
శనివారం 15 ఫిబ్రవరి 2025
https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



రాకేష్ చౌదరి కుటుంబానికి

## అండగా ఉంటాం

- మంత్రి లోకేష్ హామీ
- ఉండవల్లి నివాసంలో మంత్రిని కలిసిన కుటుంబ సభ్యులు

3 లో



రాజకీయ ముసుగు

## దొంగలను ఏరేద్దాం!

- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆగ్రహం
- ఐదేళ్ల వైసీపీ దుర్మార్గ పాలనపై ఆగ్రహం
- ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ముఖ్యమంత్రి


4 లో

స్వచ్ఛాంధ్ర..

# అందరి బాధ్యత

- మిషన్‌లో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలి
- ఎక్కడైనా, పరిశుభ్రతను బాధ్యతగా తీసుకోండి
- స్వచ్ఛాంధ్ర వ్యక్తికో, సంస్థకో చెందిన కార్యక్రమం కాదు
- పీసీబీ గాలి నాణ్యతను పరిశీలించాలి...
- నెట్ జీరో కార్యక్రమాలు అమలు చేయాలి
- స్వచ్ఛాంధ్రపై సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష
- 14 ఇండికేటర్స్ ఆధారంగా జిల్లాలకు ర్యాంకులు...
- మొదటి స్థానంలో ఎన్టీఆర్ జిల్లా... చివరి స్థానంలో అల్లూరి జిల్లా

2 లో



## త్వరలోనే బీసీ రక్షణ చట్టం



- సబ్ కమిటీ నివేదిక రాగానే ప్రక్రియ మొదలు
- బీసీ విద్యార్థుల డైట్ బకాయిలకు క్లియరెన్స్
- రెసిడెన్షియల్ కాలేజీలుగా నసనకోట, ఆత్మకూరు స్కూళ్లు
- రాష్ట్రంలో అవసరమైనమేర మరిన్ని దోభీఘాట్ల నిర్మాణం
- బీసీ సంక్షేమ శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు వెల్లడి

3 లో

## అక్రమ అరెస్టులకు వ్యతిరేకం



- చట్టం తనపని తాను చేసుకుపోతుంది
- ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం
- మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి

6 లో

గన్నవరం టీడీపీ కార్యాలయంపై వంశీ దాడి..

## సైకో బాస్ మెప్పుకోసమే

- మదం తలకెక్కి దళిత యువకుడి కిడ్నాప్, బెదిరింపులు
- మాజీ మంత్రి కేఎస్ జవహర్ ధ్వజం



- వివరాలు 8 లో..

ఆడబిడ్డలను అసభ్యంగా తూలనాడిన..

## వంశీ నాలుక కోసినా తప్పులేదు

- అతడి అరెస్ట్‌పై వైసీపీ నేతల పెడబొబ్బలు సిగ్గుచేటు
- నేరస్థులు చట్టం నుంచి తప్పించుకోలేరు
- ఎమ్మెల్యే చింతమనేని ధ్వజం



- వివరాలు 8 లో..

## సొంత అన్నలా అండగా ఉంటా

- యాసిడ్ దాడి బాధితురాలికి మంత్రి లోకేష్ భరోసా
- యువతి తండ్రికి ఫోన్, ఆరోగ్యంపై ఆరా
- అత్యంత మెరుగైన వైద్యం అందిస్తామని హామీ
- దాడి చేసిన ఉన్మాదిని కఠినంగా శిక్షిస్తామని హెచ్చరిక

3 లో





## సిగ్గు లేకుండా వంశీకి వత్తాసా?

జగన్‌రెడ్డిపై మంత్రి రామానాయుడు ఫైర్

- దళిత యువకుడి కిడ్నాప్, బెదిరింపులు కనిపించలేదా
- చట్ట ప్రకారమే వల్లభనేని వంశీ అరెస్ట్
- రౌడీలు, గూండాలు, గంజాయి, డ్రగ్స్ జగన్ బ్రాండ్
- అరాచకాల అణిచివేత చంద్రబాబు బ్రాండ్
- రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా కచ్చితంగా అమలు

5 లో

జగన్‌ది ఆటవిక రాజ్యం..

## చంద్రబాబుది ప్రజాపాలన



- దళితుడి కిడ్నాప్, దౌర్జన్యం కేసులోనే వంశీ అరెస్ట్
- దళితుల మీద దాడిని జగన్ రెడ్డి సమర్థిస్తున్నారా?
- వంశీని వెనకేసుకురావడం దుర్మార్గం
- చేసిన పాపాలకు నేడు కటకటాలు లెక్కబెడుతున్నారు
- చంద్రబాబు పాలన నేరగాళ్లకు సింహస్వప్నం
- చట్టం తన పని తాను చేసుకుపోతుంది
- దోషులు చట్టం నుండి తప్పించుకోలేరు
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

5 లో

# స్వచ్ఛాంధ్ర.. అందరి బాధ్యత

- మిషన్‌లో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలి
- ఎక్కడైనా, పరిశుభ్రతను బాధ్యతగా తీసుకోండి
- స్వచ్ఛాంధ్ర వ్యక్తికో, సంస్థకో చెందిన కార్యక్రమం కాదు
- పీసీబీ గాలి నాణ్యతను పరిశీలించాలి...
- నెట్ జీరో కార్యక్రమాలు అమలు చేయాలి
- స్వచ్ఛాంధ్రపై సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష
- 14 ఇండికేటర్స్ ఆధారంగా జిల్లాలకు ర్యాంకులు...
- మొదటి స్థానంలో ఎన్టీఆర్ జిల్లా... చివరి స్థానంలో అల్లూరి జిల్లా



అమరావతి (చైతన్య రథం): స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాముల కావాలని సీఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. లక్ష్యాలు పెట్టుకోవడమే కాదని... వాటిని ఖచ్చితంగా చేరుకునేలా ప్రణాళికలు అమలు చేయాలని సూచించారు. రాష్ట్రంలో పరిశుభ్రత పెంచేందుకు... అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పేందుకు అమలు చేస్తున్న కార్యచరణపై సీఎం సమీక్ష చేశారు. ప్రతి నెల 3వ శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహిస్తోంది. ప్రతి నెల ఒక థీమ్ తీసుకుని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జనవరి నెలలో న్యూ ఇయర్ క్లీన్ స్టార్ట్ అనే అంశాన్ని థీమ్‌గా తీసుకోగా... ఈ నెలలో సోర్స్ రీ సోర్స్ అనే అంశాన్ని థీమ్‌గా తీసుకున్నారు. మన మూలాలు -మన బలాలు తెలుసుకునేలా, రాష్ట్రంలోని వనరులను ఎలా సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలి అనే దానిపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. జీవన ప్రమాణాలు పెంచడం, పర్యాటకరంగానికి ప్రోత్సాహం, పెట్టుబడులు ఆకట్టుకోవడం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడం, నెట్ జీరోకు రాష్ట్రంలో పర్యావరణాన్ని తీసుకురావడం లక్ష్యంగా పెట్టుకుని పనిచేయాలని సీఎం సూచించారు. సంపూర్ణ స్వచ్ఛతవైపు అడుగులు వేయడం, పారిశుధ్యానికి ప్రాధాన్యత, ఘన వ్యర్థాల నిర్వహణ, ప్రజారోగ్యం, ఇంకా కేంద్రం నిర్దేశించే లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. స్వచ్ఛాంధ్ర అంటే స్వచ్ఛమైన మనుషులు, స్వచ్ఛమైన మనసులు, స్వచ్ఛమైన పరిసరాలు, స్వచ్ఛమైన ఇళ్లు, కాలనీలు, ఊళ్లు అని అంతా గుర్తించాలన్నారు. ఇళ్లతోపాటు... బహిరంగ ప్రదేశాలను, స్కూళ్లు, కాలేజ్‌లు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రార్థనా మందిరాలు, పరిశ్రమలు కూడా పరిశుభ్రంగా ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. దీని కోసం ప్రతి వ్యక్తీ, ప్రతి ఉద్యోగి, ప్రతి సంస్థ, ప్రతి వ్యవస్థ పనిచేయాలన్నారు. ఇది ఏ ఒక్క శాఖకో... ఒక్క అధికారికో సంబంధించిన కార్యక్రమంగా చూడవద్దని... పరిశుభ్రత, పచ్చదనం పెంపు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో పాఠశాల విద్యార్థి నుంచి నాయకుల వరకు బాధ్యత తీసుకోలని సీఎం పిలుపునిచ్చారు. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాల్లో సమూల మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. దీనికోసం ఆ కార్యాలయంలో ఉండే ఉద్యోగులంతా కలిసి పరిశుభ్రత, ఆహ్లాదకర వాతారవణం ఉండేలా కృషి చేయాలన్నారు. బహిరంగ ప్రదేశాలను పరిశ్రుభ్రంగా ఉంచడంలో బాధ్యతతో వ్యవహరించాలన్నారు. రోడ్లపై చెత్తవేసి, చెట్లు నరికేసి, అంతా క్లీన్‌గా ఉండాలి, పచ్చదనం ఉండాలని స్లోగన్స్ ఇస్తే కుదరదన్నారు. పౌరులు కూడా బాధ్యత వహిస్తే స్వచ్ఛాంధ్ర కల సాకారం చేసుకోవచ్చని సీఎం సూచించారు. పరిసరాల పరిశుభ్రతతోపాటు పర్యావరణ పరిరక్షణకు కూడా అంతా కృషి చేయాలి అన్నారు. గాలిలో నాణ్యతను పరిశీలించి సమస్య ఉన్న ప్రాంతాల్లో తగు చర్యలు తీసుకోవాలన్నారు. సమస్య పెరుగుతున్న సమయంలోనే గుర్తించి ఇప్పటి నుంచే అక్కడ పరిష్కారం దిశగా పనిచేయాలని సూచించారు. ఈ విషయంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వంటి శాఖల అధికారులు ఫోకస్ పెట్టాలని సూచించారు.

## జిల్లాలకు ర్యాంకులు

స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్రలో భాగంగా పట్టణాభివృద్ధి శాఖ, పంచాయతీరాజ్ శాఖ చేపట్టిన కార్యక్రమాలపై అధికారులు ప్రోగ్రెస్‌ను సీఎంకు వివరించారు. మొత్తం 14 ఇండికేటర్స్‌లో పెట్టుకున్న లక్ష్యాలను ముఖ్యమంత్రి ముందు ఉంచారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, పబ్లిక్ టాయిలెట్స్, డోర్ టు డోర్ కలక్షన్, సాలిడ్ వేస్ట్ సెగ్రిగేషన్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, కమ్యునిటీ సోక్ పిట్స్, క్లీన్ విలేజ్, ఒడిఎఫ్ ప్లస్ మోడల్ విలేజ్‌వంటి అంశాల్లో ఆయా జిల్లాల్లో ప్రగతిపై సీఎంకు వివరించారు.

ఈ 14 ఇండికేటర్స్ ఆధారంగా జిల్లాకు ర్యాంకులు ఇచ్చారు. పట్టాణాభివృద్ధి శాఖ పరిధిలో డోర్ టు డోర్ కలెక్షన్‌కు 15 పాయింట్లు, సోర్స్ సెగ్రిగేషన్‌కు 35 పాయింట్లు, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్‌కు 20 పాయింట్లు, లెగసీ వేస్ట్ క్లియరెన్స్‌కు 10 పాయింట్లు, లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్‌కు 20 పాయింట్లు ఇచ్చారు. అలాగే పంచాయతీ రాజ్ శాఖలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి 15 పాయింట్లు, పబ్లిక్ టాయిలెట్స్‌కు 10 పాయింట్లు, కమ్యూనిటీ సోక్ పిట్స్‌కు 10 పాయింట్లు, 100 శాతం డోర్ టు డోర్ చెత్త కలెక్షన్‌కు 10 పాయింట్లు, ఓడిఎఫ్ ప్లస్ మోడల్‌కు 20 పాయింట్లు చొప్పున ఇచ్చారు. ఇలా మొత్తం 200 పాయింట్ల ఆధారంగా జిల్లాల ప్రోగ్రెస్‌పై ర్యాంకులిచ్చారు.

## మొదటి స్థానంలో ఎన్టీఆర్ జిల్లా

మొత్తం 200 పాయింట్లకుగాను 129 పాయింట్లతో ఎన్టీఆర్ జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. 127 పాయింట్లతో విశాఖ రెండో స్థానంలో, 125తో ఈస్ట్ గోదావరి 3వ స్థానం, 122తో అనంతపురం జిల్లా 4వ స్థానం, 120 పాయింట్లతో అన్నమయ్య 5వ స్థానం, శ్రీకాకుళం 6వ స్థానంలో ఉన్నాయి. 118 పాయింట్లతో కడప 7వ స్థానం, 117 పాయింట్లతో గుంటూరు 8వ స్థానం, 115 పాయింట్లతో బాపట్ల 9వ స్థానం, 115 పాయింట్లతో నెల్లూరు 10వ స్థానం, 115 పాయింట్లతో వెస్ట్ గోదావరి 11వ స్థానం, 113 పాయింట్లతో అనకాపల్లి 12వ స్థానం, 111 పాయింట్లతో తిరుపతి 13వ స్థానం, 109 పాయింట్లతో కాకినాడ 14వ స్థానంలో ఉన్నాయి. 108 పాయింట్లతో ఏలూరు 15వ స్థానం, 108 పాయింట్లతో కృష్ణ 16వ స్థానం, 105 పాయింట్లతో కోనసీమ 17వ స్థానం, 105 పాయింట్లతో మన్యం పాడేరు 18వ స్థానం, 105 పాయింట్లతో సత్యసాయి 19వ స్థానం, 103 పాయింట్లతో పల్నాడు 20వ స్థానం, 99 పాయింట్లతో కర్నూలు 21వ స్థానం, 99 పాయింట్లతో ప్రకాశం 22వ స్థానం, 94 పాయింట్లతో నంద్యాల 23వ స్థానం, 93 పాయింట్లతో విజయనగరం 24వ స్థానం, 88 పాయింట్లతో చిత్తూరు 25వ స్థానం, 81 పాయింట్లతో అల్లూరి సీతారామరాజు 26వ స్థానంలో నిలిచాయి.



మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా ఉండవల్లి నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.

# ఆదర్శనీయుడు సంజీవయ్య

**104వ జయంతి సందర్భంగా చంద్రబాబు నివాళి**

అమరావతి (చైతన్య రథం): నిజాయితీకి, నిరాడంబరత్వానికి, విలువలకు మారుపేరైన దామోదరం సంజీవయ్య 104వ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాళి అర్పించారు. ఈమేరకు ఎక్స్ వేదికపై పోస్టుపెడుతూ-దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రిగా పనిచేసిన సంజీవయ్య జీవిత ప్రస్థానం ఆద్యంతం స్ఫూర్తిదాయకం, ఆదర్శనీయం. మహానుభావుని జయంతి వేడుకలను అధికారికంగా జరుపుకోవడం తెలుగుజాతికి గర్వకారణం. దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా ఆయన దేశసేవను,దళిత జనోద్ధరణను స్మరించు కుందాం' అని చంద్రబాబు పేర్కొన్నారు.

# బహుముఖ ప్రజ్ఞా-శాలి దామోదరం సంజీవయ్య

- నమ్మిన విలువలకు జీవితాంతం కట్టుబడిన వ్యక్తి
- మంత్రి లోకేష్ నివాళి



అమరావతి (చైతన్యరథం): మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా ఆ మహనీయునికి రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఘనంగా నివాళు లర్పించారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రిగా సంజీవయ్య ఖ్యాతికెక్కారని కొనియాడారు. తన పదవీ కాలంలో అనేక విప్లవాత్మక పథకాలతో ప్రజల అభ్యున్నతికి విశేషంగా కృషిచేశారని గుర్తు చేశారు. నమ్మిన విలువలకు జీవితాంతం కట్టుబడిన వ్యక్తి దామోదరం సంజీవయ్య అన్నారు. ఆయన జయంతి వేడుకలను కూటమి ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని తెలిపారు. దామోదరం సంజీవయ్య ఆశయ సాధనకు కృషిచేద్దామని మంత్రి లోకేష్ పిలుపు ఇచ్చారు.

# త్వరలోనే బీసీ రక్షణ చట్టం

- సబ్ కమిటీ నివేదిక రాగానే ప్రక్రియ మొదలు
- బీసీ విద్యార్థుల డైట్ బకాయిలకు క్లియరెన్స్
- రెసిడెన్షియల్ కాలేజీలుగా నసనకోట, ఆత్మకూరు స్కూళ్లు
- రాష్ట్రంలో అవసరమైనమేర మరిన్ని దోభీఘాట్ల నిర్మాణం
- బీసీ సంక్షేమ శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు వెల్లడి


బీసీ సంక్షేమ శాఖ పనితీరును సచివాలయంలో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

అమరావతి (చైతన్య రథం): బీసీ విద్యార్థుల కోసం ప్రభుత్వం తీసుకునే చర్యలతో స్పష్టమైన మార్పులు రావాలని, ప్రభుత్వం చేసే ఖర్చుకు జవాబుదారీతనం కనిపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సచివాలయంలో శుక్రవారం బీసీ సంక్షేమ శాఖను సీఎం చంద్రబాబు సమీక్షించారు. రాష్ట్రంలోని 660 గవర్నమెంట్ హాస్టల్స్‌లో రూ.13.10 కోట్లతో చేపట్టిన మరమ్మతులు మరో ఆరు వారాల్లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు గత ప్రభుత్వం ట్రంక్ పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు, కిచెన్ ఐటెమ్స్ అందించలేదని, రూ.18 కోట్లతో వాటి పంపిణీకి చర్యలు తీసుకున్నామని అధికారులు వివరించగా, ఈ ప్రక్రియ కూడా మార్చి మూడవవారం నాటికి పూర్తవ్వాలన్నారు.

## బకాయిల విడుదలకు గ్రీన్ సిగ్నల్

పెండింగ్ ట్యూటర్స్ హానరోరియంకు సంబంధించి 485 హాస్టళ్లలో 2024 మార్చి వరకు గత ప్రభుత్వం పెట్టిన రూ.2.02 కోట్ల బకాయిలు, ఈ ఏడాది ఫిబ్రవరి వరకు చెల్లించాల్సివున్న రూ.2.33 కోట్ల బకాయిలు మొత్తం కలిపి రూ.4.35 కోట్లు చెల్లించాల్సి ఉందని అధికారులు సీఎం దృష్టికి తీసుకురాగా, వెంటనే చెల్లించేందుకు అనుమతి ఇచ్చారు.

డైట్ ఛార్జెస్‌కు సంబంధించి రూ.185.27 కోట్లు పెండింగులో ఉన్నాయని అధికారులు వివరించగా ప్రస్తుతం రూ.110.52 కోట్ల చెల్లింపునకు సీఎం అంగీకారం తెలిపారు. అదేవిధంగా కాస్మోటిక్ బిల్లులు రూ.29 కోట్లు చెల్లించాలని ఆదేశించారు. అలాగే హాస్టళ్ల విద్యుత్ సరఫరాకు సంబంధించిన పెండింగ్ బిల్లులు కూడా వెంటనే చెల్లించాలని సూచించారు.

సత్యసాయి జిల్లాలోని నసనకోట, ఆత్మకూరు బీసీ సంక్షేమ బాలికల పాఠశాలలను రెసిడెన్షియల్ బీసీ గర్ల్స్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు సీఎం సుముఖత వ్యక్తం చేశారు. కుప్పంలోనూ బీసీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

## దామాషా ప్రకారం కార్పొరేషన్లకు నిధులు

బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కేబినెట్లో కూడా ఆమోదం తెలిపామని, ఈ మేరకు అవసరమైతే న్యాయపోరాటం చేయాల్సి ఉందని తెలిపారు. అలాగే ప్రతి కార్పొరేషన్‌కు దామాషా ప్రకారం నిధులు కేటాయించాలన్నారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీ రద్దుచేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామని, దీనిపై ఇప్పటికే విధివిధానాలు రూపొందించామని తెలిపారు. రజకులకు మేలు చేకూరేలా రాష్ట్రంలో 2014-19 మధ్య నిర్మించిన దోబీ ఘాట్ల మరమ్మతులు, అవసరమైన చోట కొత్తవి నిర్మించడంపై దృష్టి పెట్టాలని సీఎం అన్నారు. రానున్న బడ్జెట్‌లో కేటాయించే నిధులతో రాష్ట్రంలో బీసీభవనాలు పూర్తిచేయాలని ఆదేశించారు. 2014నుంచి బీసీ కార్పొరేషన్ ద్వారా లబ్ధిపొందిన వారి సమాచారాన్ని సేకరించాలని, వృత్తి ప్రామాణికంగా రుణాలు తీసుకున్న వారు ప్రస్తుతం ఎంతమంది కొనసాగిస్తున్నారో ఆడిట్ చేయాలని ఆదేశించారు.

## బీసీలను హత్య చేసిన వారికి శిక్షపడాలి

వైసీపీ హయాంలో బీసీలను ఊచకోత కోశారని, వారి హత్యలపైనా విచారణ వేగవంతం చేసి నిందితులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ అంశం మేనిఫెస్టోలో కూడా పొందుపరిచామని, అవసరమైతే ప్రత్యేక కమిషన్‌ను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. బీసీ రక్షణ చట్టాన్ని సబ్ కమిటీ నివేదిక రాగానే అమల్లోకి తెస్తామన్నారు. రాష్ట్రంలో 2014-19 మధ్య నాటి టీడీపీ ప్రభుత్వం జిల్లా కేంద్రాల్లో 13 కాపు భవనాలను మంజూరు చేసింది. అందులో 5 భవనాల నిర్మాణాలను ప్రారంభించగా, గత ప్రభుత్వం నిలిపేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిర్మాణాలను పూర్తి చేసేందుకు నిధులు విడుదల చేసింది. అవి త్వరలోనే వినియోగంలోకి రానున్నాయని అధికారులు వివరించారు. నిర్మాణంలో ఉన్న 42 కాపు కమ్యూనిటీ హాళ్లు కూడా వేగంగా పూర్తి చేయాలని చంద్రబాబు ఆదేశించారు. ఈ సమీక్షలో బీసీ సంక్షేమ మంత్రి సవిత, అధికారులు పాల్గొన్నారు.

# నిందితునిపై కఠిన చర్యలు

### ప్రేమోన్మాది దాడిపై అధికారులకు సీఎం ఆదేశాలు



అమరావతి (చైతన్య రథం): అన్నమయ్య జిల్లాలో యువతిపై యాసిడ్ దాడి ఘటనను సీఎం చంద్రబాబు ఖండించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాధిత యువతికి మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత యువతి, ఆమె కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని సీఎం భరోసా ఇచ్చారు. గుర్రంకొండ మండలం ప్యారంపల్లెలో గణేశ్ అనే యువకుడు ఓ యువతి తలపై కత్తితో గాయపరిచి ముఖంపై యాసిడ్ పోశాడు. గాయాల పాలైన బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు.. ఏప్రిల్ 29న ఆమె పెళ్లి జరగనున్న నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. నిందితుడు మదనపల్లెలోని అమ్మచెరువు మిట్టకు చెందినవాడిగా గుర్తించారు.

# సొంత అన్నలా అండగా ఉంటా

- యాసిడ్ దాడి బాధితురాలికి మంత్రి లోకేష్ భరోసా
- యువతి తండ్రికి ఫోన్, ఆరోగ్యంపై ఆరా
- అత్యంత మెరుగైన వైద్యం అందిస్తామని హామీ
- దాడి చేసిన ఉన్మాదిని కఠినంగా శిక్షిస్తామని హెచ్చరిక



అమరావతి (చైతన్యరథం): యాసిడ్ దాడి బాధితురాలికి అన్నలా అండగా ఉంటానని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ భరోసా ఇచ్చారు. అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలం ప్యారంపల్లెకు చెందిన గౌతమి(23)పై యాసిడ్ దాడి ఘటనను విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ తీవ్రంగా పరిగణిస్తున్నారు. బాధితురాలి తండ్రి జనార్ధన్‌కు మంత్రి లోకేష్ ఫోన్ చేసి ఆమె ఆరోగ్యంపై వాకబు చేశారు. చెల్లి కోలుకోవడానికి అత్యంత మెరుగైన వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆమెను నా సొంత చెల్లిగా భావించి అండగా నిలుస్తా. యాసిడ్ దాడి ఘటన నన్ను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. దాడిచేసిన ఉన్మాదిని కఠినంగా శిక్షిస్తాం, అలాంటి సైకోలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించం. అధైర్య పడొద్దు, మీ వెంట నేనున్నానని మంత్రి లోకేష్ భరోసా ఇచ్చారు. అక్కడే ఉన్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌తో మాట్లాడిన లోకేష్... గౌతమి కోలుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, ఆమె వైద్యానికి సంబంధించిన ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించాలని సూచించారు. గౌతమిపై అత్యంత అమానవీయంగా వ్యవహరించిన సైకోని కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేశారు. భవిష్యత్‌లో మరో చెల్లిపై ఇటువంటి ఘటన జరగకుండా పోలీసు యంత్రాంగం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

### రాకేష్ చౌదరి కుటుంబానికి

# అండగా ఉంటాం



- మంత్రి లోకేష్ హామీ
- ఉండవల్లి నివాసంలో మంత్రిని కలిసిన కుటుంబ సభ్యులు

అమరావతి (చైతన్యరథం): ఏనుగుల దాడిలో మృతి చెందిన తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం, కందులవారిపల్లె ఉపసర్పంచ్ రాకేష్ చౌదరి కుటుంబ సభ్యులు ఉండవల్లి నివాసంలో శుక్రవారం విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్‌ను కలిశారు. పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా ఉండే రాకేష్ చౌదరి మృతిచెందడం తనను తీవ్రంగా కలచివేసిందని మంత్రి లోకేష్ విచారం వ్యక్తం చేశారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటు. ఏనుగుల దాడిలో ఆయన మరణించడం దిగ్భ్రాంతికి గురిచేసింది. రాకేష్ చౌదరి పార్టీ పటిష్టత కోసం ఎంతో కృషిచేశారు. ఆయన కుటుండానికి అన్నివిధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా రాకేష్ కుమార్తెని ముద్దాడిన లోకేష్... కుటుంబ నేపథ్యాన్ని వాకబు చేశారు.



చైతన్యరథం

# రాజకీయ ముసుగు దొంగలను ఏరేద్దాం!

- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆగ్రహం
- ఐదేళ్ల వైసీపీ దుర్మార్గ పాలనపై ఆగ్రహం
- ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ముఖ్యమంత్రి




అమరావతి: రాజకీయ నేతల ముసుగులో నేరస్థులు ప్రజాస్వామ్యానికే పెనుముప్పుగా మారారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఏపీలో గత ఐదేళ్లపాటు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన వ్యక్తులు ఇప్పుడు కొత్తదారులు వెతుక్కుంటున్నారని ఆయన మండిపడ్డారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌కు శుక్రవారం వచ్చిన చంద్రబాబు.. అందుబాటులో ఉన్న పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఏపీలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలు, అలాగే టీడీపీ కార్యకర్తల సంక్షేమంపై పార్టీ నేతలతో ఆయన ప్రధానంగా చర్చించారు.

కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎవరికి మద్దతివ్వాలనే అంశంపై త్రిసభ్య కమిటీ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు నిర్ణయించారు.

ఎంపీ భరత్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, ఏఎస్ రామకృష్ణలతో కమిటీ ఏర్పాటుకు ఆయన నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణ- గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవాలని చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. కష్టపడి పని చేసి భారీ మెజారిటీతో కూటమి అభ్యర్థులు ఆలపాటి రాజా, పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అలాగే పార్టీ కార్యకర్తల సంక్షేమంపైనా నేతలను ఆరా తీశారు. ఇప్పటివరకూ కార్యకర్తల సంక్షేమానికి ఎంత ఖర్చు పెట్టిందీ, చెల్లించాల్సినవి ఇంకెన్ని ఉన్నాయనే అంశాలను నేతలతో చంద్రబాబు చర్చించారు.


ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. "నేరస్థులు రాజకీయం ముసుగులో ఉంటే ప్రజాస్వామ్యానికి ఎంతో ప్రమాదం. అలాంటి వారిని గుర్తించి ఏరివేయాల్సిన అవసరం ఉంది. గత ఐదేళ్లపాటు రాష్ట్రం రావణకాష్టంగా మారింది. తప్పులు మీద తప్పులు చేసి ప్రజలు, ప్రతిపక్షాలను హింసించారు. ఐదేళ్లపాటు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి.. అది చాలదన్నట్టు ఇప్పుడు కొత్తదారులు వెతుకుతున్నారు. ఒక అబద్ధాన్ని పదేపదే చెప్పి నిజమని నమ్మించాలని తాపత్రయ పడుతున్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం ఎంతటివారినైనా ముంచేందుకు ఏమాత్రం వెనుకాడడం లేదు. నా దళితులు నా దళితులు అంటూనే వారిని నట్టేట ముంచే రకాలు వీళ్లు' అని దుయ్యబట్టారు. 'ఆటవిక రాజ్యంలో దాడులు, ఊచకోతలు, విధ్వంసాలు, హత్యలు జరిగాయి. మనది ప్రజాస్వామ్యం, ఇక్కడంతా చట్టపరంగానే పరిపాలన సాగుతోందని' ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. సమావేశానికి ముందు వివిధ ప్రాంతాలనుంచి తమ సమస్యలు విన్నవించుకునేదుకు వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించి పరిష్కారానికి హామీ ఇచ్చారు. పలువురు దివ్యాంగులకు ఆర్థిక సాయం అందించారు.











చైతన్యరథం

# జగన్‌ది ఆటవిక రాజ్యం..
# చంద్రబాబుది ప్రజాపాలన

- దళితుడి కిడ్నాప్, దౌర్జన్యం కేసులోనే వంశీ అరెస్ట్
- దళితుల మీద దాడిని జగన్‌రెడ్డి సమర్థిస్తున్నారా?
- వంశీని వెనకేసుకురావడం దుర్మార్గం
- చేసిన పాపాలకు నేడు కటకటాలు లెక్కబెడుతున్నారు
- చంద్రబాబు పాలన నేరగాళ్లకు సింహస్వప్నం
- చట్టం తన పని తాను చేసుకుపోతుంది
- దోషులు చట్టం నుండి తప్పించుకోలేరు
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

అమరావతి (చైతన్యరథం): టీడీపీ కార్యాలయం అంటే మాకు దేవాలయం.. అలాంటి దేవాలయంపై దాడి చేసినా నాటి ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు.. అంతే కాకుండా తిరిగి టీడీపీ నాయకులమీదే తప్పుడు కేసులు పెట్టారు.. నాటి ప్రభుత్వం ఒక జంగిల్ రాజా ప్రభుత్వం...దుర్మార్గ ప్రభుత్వమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మండిపడ్డారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలో నేడు ప్రజాస్వామ్యయుత పాలన, జన రాజ్యం నడుస్తోందని ఉద్ఘాటించారు. చంద్రబాబు పాలనలో చట్టం తన పని తాను చేసుకుపోతుంది. కొంతమంది నేరస్థులు రాజకీయ ముసుగులో చలామణి అవ్వడానికి ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి వారితో ప్రజాస్వామ్యానికే విఘాతం. ఇలాంటి వారికి ఊచలు లెక్కపెట్టే రోజులు వస్తున్నాయి. వల్లభనేని వంశీ అరెస్ట్ ఇందుకు నిదర్శనం. నాటి అరాచక పాలనలో నడిచినట్లే నేడు కూడా వైసీపీ నేతలు కొంతమంది అరాచకాలకు పాల్పడుతున్నారు. అలాంటి వారికి కూడా త్వరలోనే బుద్ధి చెబుతాం. అధికారం పోయినా వారి తీరు మారడం లేదని పల్లా విమర్శించారు.

## నేరస్థులపై చంద్రబాబు ఉక్కుపాదం

గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడికి ప్రత్యక్షసాక్షి అయిన దళిత యువకుడు సత్యవర్ధన్‌ను బెదిరించి, వంశీ కారులోనే కోర్టుకు తీసుకొచ్చి తప్పుడు వాంగ్మూలం ఇప్పించటం.. చట్టం, కోర్టుల పట్ల జగన్ ముఠా లెక్కలేని తనాన్ని తెలియజేస్తోంది. దళిత ఫిర్యాదుదారుడిని కిడ్నాప్ చేసి విశాఖపట్నంలో ఎందుకు దాచారో జగన్ రెడ్డి సమాధానం చెప్పాలి. గతంలో వైసీపీ హయాంలో గన్నవరం టీడీపీ కార్యాలయాన్ని తగలబెట్టి, పోలీసు అధికారిని గాయపరిచిన దారుణాన్ని రాష్ట్రమంతా చూసింది. జగన్ రెడ్డి కళ్లకు కనిపించలేదా. జగన్ రెడ్డి పాలనలో నేరగాళ్లు యథేచ్ఛగా చెలరేగిపోయారు. ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం జవాబుదారీతనం లేకుండా పనిచేసింది.

నేరస్థులను ఉక్కుపాదంతో అణిచేసిన చరిత్ర చంద్రబాబుది. ఆయన పాలన అంటే నేరగాళ్లు, రౌడీలు, అత్యాచారాలు చేసేవారు, డ్రగ్స్ ముఠాలకు సింహస్వప్నమే. అలాంటి వారి తోకలు కత్తిరించి, అదుపులో ఉంచటం చంద్రబాబుకే సాధ్యం. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో మతకల్లోలాలను పూర్తిగా అదుపు



చేయటం, కొన్ని ప్రాంతాల్లో చెలరేగిన ఫ్యాక్షన్ ముఠాలను అణిచేయటం, రౌడీయిజం అనేదే లేకుండా చేసిన సమర్థ పాలకుడు చంద్రబాబు. జగన్ రెడ్డిది జంగిల్ పాలన అయితే, చంద్రబాబుది జన పరిపాలన అని పల్లా స్పష్టం చేశారు.

## దళితులపై జగన్‌ది కపట ప్రేమ

నా దళితులు.. నా దళితులు అంటూ మాట్లాడే జగన్‌కి అసలు దళితులపై ప్రేమే లేదు. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనలో ప్రత్యక్షసాక్షి, దళిత బిడ్డ అయిన సత్యవర్ధన్‌ను వంశీ కిడ్నాప్ చేయించి దారుణంగా కొట్టారు. నాడు టీడీపీ కార్యాలయంపై దాడికి సంబంధించి పెట్టిన కేసును విత్ డ్రా చేసుకునేలా చేశారు. ఇదంతా అందరికీ స్పష్టంగా తెలిసిన విషయమే. దళితులపై దౌర్జన్యం చేసి, మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచిన వంశీ ముఠాకి జగన్ రెడ్డి వత్తాసు పలకటం సిగ్గుచేటు. ఆయనకు దళితులు, మహిళలకంటే నేరగాడు వంశీ ఎక్కువయ్యాడా అని పల్లా దుయ్యబట్టారు.

గతంలో వైసీపీ పాలనలో దళితవర్గానికి చెందిన డాక్టర్ సుధాకర్‌ను హింసించి చంపారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యంను చంపి డోర్ డెలివరీ చేశారు. నాణ్యతలేని మద్యంపై ప్రశ్నిస్తే ఓం ప్రతాప్ అనే యువకుడిని దారుణంగా హత్య చేశారు. ఇసుక అక్రమాలపై శివప్రసాద్ పశ్నిస్తే అతనికి శిరోముండనం చేయించారు. దళితుల మీద వైసీపీ నేతలు సాగించిన దమనకాండపై జగన్‌రెడ్డి సమాధానం చెప్పాలి. వల్లభనేని వంశీ, కొడాలి నాని లాంటి నేతలను పెట్టుకుని రాష్ట్రంలో అరాచకాన్ని సృష్టించడంతోనే వైసీపీ పరాజయం పాలయిందని ఆ పార్టీ నేతలే చెబుతున్నారు. నేడు ప్రజాపాలన నడుస్తోంది. ప్రజా పాలనలో గూండాలకు, రౌడీలకు తావులేదు. నేరస్తులందరూ జైలుకు పోక తప్పదు. నాడు లా అండర్ ఆర్డర్‌ను గాలికి వదిలిపెట్టి ప్రతిపక్ష నేతలను అరెస్ట్ చేయడమే లక్ష్యంగా పాలన సాగించారు. నేడు నేర చరిత్ర కలిగిన వారు మాత్రమే జైళ్లకు వెళుతున్నారని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

## రూల్ ఆఫ్ లా పునరుద్ధరణ

అబద్ధాలు నిచ్చెన మెట్లులాంటివి. వేగంగా పైకెక్కవచ్చు. అంతెత్తుకు ఎక్కిన తరువాత ఆ నిచ్చెన కూలిపోతే ఒక్కసారిగా కింద పడాల్సి వస్తుందన్న విషయం వైసీపీ నేతలు తెలుసుకోవాలి. వల్లభనేని వంశీ చేసిన దురాగతాలను ఖండించకపోగా, పైపైచ్చు ఆయనకే జగన్‌రెడ్డి వత్తాసు పలకటం దుర్మార్గం. రాష్ట్రంలో గత ఐదేళ్లుగా సాగిన ఆటవిక పాలన స్థానంలో రూల్ ఆఫ్ లా ను పునరుద్ధరిస్తున్నామని పల్లా స్పష్టం చేశారు.

---

# సిగ్గు లేకుండా వంశీకి వత్తాసా?

## జగన్‌రెడ్డిపై మంత్రి రామానాయుడు ఫైర్

- దళిత యువకుడి కిడ్నాప్, బెదిరింపులు కనిపించలేదా
- చట్ట ప్రకారమే వల్లభనేని వంశీ అరెస్ట్
- రౌడీలు, గూండాలు, గంజాయి, డ్రగ్స్ జగన్ బ్రాండ్
- అరాచకాల అణిచివేత చంద్రబాబు బ్రాండ్
- రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా కచ్చితంగా అమలు



అమరావతి (చైతన్యరథం): వల్లభనేని వంశీ అరెస్ట్ విషయంలో జగన్‌రెడ్డి సిగ్గులేని మాటలు మాట్లాడుతున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మండిపడ్డారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్రకార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి రామానాయుడు మాట్లాడుతూ వల్లభనేని వంశీ అరాచకాలు, రౌడీయిజాన్ని జగన్‌రెడ్డి ఖండించకపోగా... పొగడటం ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. అరాచక వాది జగన్..మరొక అరాచక వాది వంశీని వెనకేసుకు రావడం చూసి రాష్ట్రం మొత్తం అసహ్యించుకుంటోందన్నారు. ఇలాంటి విష సంస్కృతి కలిగిన జగన్‌రెడ్డి ఐదు సంవత్సరాల పాలనలో అంబేద్కర్ రాజ్యాంగం బదులు రాజారెడ్డి రాజ్యాంగాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేశాడు. ఈరోజు సాక్షుల గురించి జగన్, వైసీపీ నేతలు ఏదేదో మాట్లాడుతున్నారు. సాక్షుల్ని బెదిరించడం, సాక్షులు చెప్పిన దాన్ని తారుమారు చేయడం, నేరాన్ని ఎదుటి వారి మీద వేయడం జగన్ నైజం. గతం నుంచీ ఆయన తీరు అదే. జగన్ కేసుల్లో కూడా సాక్షుల్ని బెదిరించడం, లేదా చంపేయడం చూస్తూనే ఉన్నాం. నేరం చేసి ఆ నేరం నుండి తప్పించుకోవడానికి మరొక నేరం చేసిన వల్లభనేని వంశీ దుర్మార్గాన్ని ఖండించకపోగా, అతనికి వత్తాసు పలకడం చూసి రాష్ట్ర ప్రజలందరూ చీదరించుకుంటున్నారు. జగన్‌రెడ్డిని ఒకటే సూటిగా అడుగుతున్నాం. ఆ రోజు గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడికి ప్రత్యక్షసాక్షి అయిన దళిత యువకుడు సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి, చంపేస్తామని బెదిరించి, వంశీ కారులోనే కోర్టు దగ్గరికి తీసుకొచ్చి తప్పుడు వాంగ్మూలం ఇప్పించడం ఎంతవరకు సమర్థనీయం. దీనికి జగన్మోహన్‌రెడ్డి సమాధానం చెప్పాలని మంత్రి రామానాయుడు సవాల్ విసిరారు.

## చట్ట ప్రకారమే అరెస్ట్

ఒక దళిత యువకుడిని కిడ్నాప్ చేసి విశాఖ పట్టణంలో వంశీ ఆధీనంలో పెట్టుకుంటే జగన్‌రెడ్డి ఎందుకు ఖండించలేకపోతున్నాడు. గన్నవరంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ఆ రోజు వంశీ, అతడి అనుచరులు తగలబెట్టి, సిబ్బంది మీద దాడి చేసి, ఆఫీసు వెలుపల ఉన్న వాహనాలను ధ్వంసం చేసిన మాట వాస్తవం కాదా. దాడి సంఘటన తెలుసుకొని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అక్కడికి చేరుకుంటే... వాళ్ల మీద గుండాలు, రౌడీలతో రాళ్ల దాడి చేసింది మాట వాస్తవం కాదా. పైపైచ్చు బాధితుల మీదే ఎదురు కేసులు పెట్టారు. మహిళ అని కూడా చూడకుండా సాయికళ్యాణిని అరెస్ట్ చేసేందుకు ఆమె ఇంటికి వెళ్లి,కనీసం దుస్తులు కూడా మార్చుకోవడానికి అవకాశం ఇవ్వకుండా నిర్దాక్షిణ్యంగా వ్యవహరించారు. నేడు ఒక దళిత యువకుడిని కిడ్నాప్ చేసి, చంపుతానని బెదిరించి దౌర్జన్యం చేశారు. దీనిపై అతడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ జరిపి వాస్తవాలు నిర్ధారించుకుని వంశీని అరెస్ట్ చేశారు. వాస్తవాలు ఇలా ఉంటే అక్రమ కేసులంటూ జగన్, వైసీపీ నేతలు గగ్గోలు పెట్టటంలో అర్థం లేదు. దళితుడిని భయభ్రాంతులకు గురి చేసి, మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా గతంలో మాట్లాడిన వంశీని జగన్ వెనకేసుకు వస్తున్నారు. దళితుల పట్ల,మహిళల గౌరవం పట్ల జగన్‌కు ఏమాత్రం చిత్తశుద్ధి లేదనేందుకు ఇదే నిదర్శనమని మంత్రి నిమ్మల దుయ్యబట్టారు.

## నేరస్థుల భరతం పడతాం

ఎన్నికల ముందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జంగిల్ రాజ్యం పోతుంది మళ్లీ జన రాజ్యం వస్తుందని మేము చెప్పాం. దాని ప్రకారం ఇవాళ రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా అమలు చేస్తున్నాం. ఈ రోజు చట్టం తన పని తను చేసుకుంటూ పోతోంది. తెలుగుదేశం పార్టీకి లా అండ్ ఆర్డర్‌ని కంట్రోల్‌లో పెట్టడం కొత్తకాదు. గతంలో రాష్ట్రంలో నేరాలపై ఉక్కుపాదం మోపిన విధంగానే.. నేడు రాజకీయ ముసుగులో ఉన్న జగన్మోహన్ రెడ్డి నేర సామ్రాజ్యాన్ని కూడా అదేవిధంగా అంత మొందిస్తాం. నేరగాళ్లు, రౌడీయిజం, అత్యాచారాలు, డ్రగ్స్ వంటివి నిలువరించి స్వచ్ఛమైన పరిపాలన అందించడం చంద్రబాబు బ్రాండ్. రౌడీలు,గుండాలు, డ్రగ్స్, గంజాయి వీటిని ప్రోత్సహించి పరిపాలన సాగించడం జగన్ రెడ్డి బ్రాండ్. చంద్రబాబు బ్రాండ్‌కి జగన్ రెడ్డి బ్రాండ్‌కి చాలాతేడా ఉంది. జగన్ బ్రాండ్ అంటే ఏమిటి అనేది గత ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పుతోనే వెల్లడయింది. అయినా కూడా పాఠాలు నేర్చుకోకుండా జగన్‌రెడ్డి మాట్లాడుతూ ఉంటే చాలా ఆశ్చర్యంగా ఉంది. ఇది రాజరికం కాదు ప్రజాస్వామ్యం అని జగన్మోహన్‌రెడ్డి గుర్తుపెట్టుకోవాలి. రాజకీయ ముసుగులో ఉన్న నేరస్తులు, రౌడీలు, గుండాల భరతం పడతాం. విజయ్ మాల్యా అవినీతికి పాల్పడి దేశాన్ని వదిలిపారిపోయిన పరిస్థితి చూశాం. కానీ దురదృష్టం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అవినీతితో లక్షల కోట్ల సొమ్ముని సంపాదించిన జగన్‌రెడ్డి... ఆ సొమ్ముతో పార్టీపెట్టి మరీ ఇక్కడ రాష్ట్రంలో అరాచకాలు సృష్టించడం మన దురదృష్టకరం. ఏది ఏమైనా మా ప్రభుత్వం కచ్చితంగా చట్ట ప్రకారమే పని చేస్తుందని మంత్రి రామానాయుడు స్పష్టం చేశారు.

చైతన్యరథం

# జగన్ తప్పులే శాపాలై..

- గుండ్లకమ్మ ప్రాజెక్ట్‌తో పాటు ముంపు వాసులనూ వైసీపీ ప్రభుత్వం ముంచేసింది
- ఐదేళ్ల అరాచక పాలనతో తట్ట మట్టి పని కూడా చేయలేదు
- గుండ్లకమ్మ నిర్వాసితులను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుంది
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



అద్దంకి (చైతన్యరథం): ఒక్కఛాన్స్ అంటే... నమ్మి ఐదేళ్లు అధికారమిచ్చిన ప్రజలకు వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి నరకం చూపెట్టారని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. అద్దంకి నియోజకవర్గ పరిధిలోని కొరిశెపాడు మండలంలో గుండ్లకమ్మ ప్రాజెక్ట్ ముంపునకు గురైన యర్రబాలెం గ్రామంలో మంత్రి గొట్టిపాటి శుక్రవారం పర్యటించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత యుద్ధ ప్రాతిపదికన రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్లను ఈ సందర్భంగా మంత్రి ప్రారంభించారు. అద్దంకి నియోజకవర్గ పరిధిలోని ఏడు ముంపు గ్రామాల ప్రజలతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గుండ్లకమ్మ ముంపు గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, పాఠశాలలు, దేవాలయాల నిర్మాణంతో పాటు ఇతర మౌలిక సదుపాయాలను వెంటనే కల్పించాలని సంబంధిత అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. ముంపు గ్రామాల నిర్వాసితులకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తాను అండగా ఉంటానని మంత్రి గొట్టిపాటి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం.. ముంపు గ్రామాలను ఆదుకుంటుందని అభయమిచ్చారు.

### నిర్వాసితులను గాలికొదిలేశారు

ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ... ఐదేళ్లు అధికారం అనుభవించినా... గుండ్లకమ్మ ప్రాజెక్ట్ నిర్వాసితుల మీద జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోని వైసీపీ ప్రభుత్వం కనీస కనికరం చూపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తట్ట మట్టి పని కూడా చేయలేదని దుయ్యబట్టారు. ప్రాజెక్ట్‌తో పాటు నిర్వాసితులను కూడా జగన్ రెడ్డి నట్టేట ముంచి గాలికొదిలేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ చేసిన తప్పులు.. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి శాపాలుగా మారాయని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసంతో రాష్ట్రంలో ఎక్కడి ప్రాజెక్టులు అక్కడే ఆగిపోయానని స్పష్టం చేశారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నా బడుగు, బలహీన వర్గాలను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. గుండ్లకమ్మ నిర్వాసితుల సమస్యలు ఎప్పుడో పరిష్కారం అవ్వాల్సి ఉన్నా... వైసీపీ ప్రభుత్వ తప్పిదాలతో పనులు ఆలస్యమయి... ముంపు గ్రామాల ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందని వెల్లడించారు. గుండ్లకమ్మ నిర్వాసితులకు న్యాయం చేసి, వారికి అండగా ఉంటామని ఈ సందర్భంగా గొట్టిపాటి స్పష్టం చేశారు.

అనంతరం యర్రబాలెం గ్రామంలోని ఎస్సీ కాలనీని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను కాలనీ వాసులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కాలనీలో అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని అధికారులను గొట్టిపాటి ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక కూటమి నేతలతో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులకు వ్యతిరేకం



- చట్టం తనపని తాను చేసుకుపోతుంది
- ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం
- మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి

ఒంగోలు (చైతన్యరథం): అక్రమ అరెస్టులకు కూటమి ప్రభుత్వం వ్యతిరేకమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి శ్రీడోలా బాలా వీరాంజనేయ స్వామి స్పష్టం చేశారు. ఒంగోలు కలెక్టరేట్ ఎదుట శుక్రవారం మాజీ సీఎం దామోదరం సంజీవయ్య జయంతి వేడుకల్లో మంత్రి బాలవీరాంజనేయ స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంజీవయ్య విగ్రహానికి మంత్రి, జిల్లా కలెక్టర్, అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి ఆయన సేవల్ని కొనియాడారు. అనంతరం మంత్రి బాలవీరాంజనేయ స్వామి మీడియాతో మాట్లాడుతూ... వైసీపీ నాయకుడు వల్లభనేని వంశీ విషయంలో చట్టం తన పని తాను చేసుకుని పోయిందని తెలిపారు. గతంలో వైసీపీ ప్రభుత్వం చేసినట్లు తమప్రభుత్వం అక్రమ అరెస్టులు చేయడం లేదన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం విలువలకు కట్టుబడి పనిచేస్తుందని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై గత ప్రభుత్వం నాడు వ్యవహరించినట్లు తాముప్రవర్తిస్తే సగం మంది వైసీపీ నాయకులు జైళ్లు, కోర్టుల చుట్టూ తిరుగుతూ ఉండేవారని చెప్పారు. పోలీసుల విచారణలో దోషులు అని తేలితేనే వారిని అరెస్టు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

హామీ ఇచ్చిన మేరకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నామని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి స్పష్టం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారం లోకివచ్చిన తరువాత సుమారు ఏడాది పాటు అమ్మ ఒడిని అమలు చేయలేదన్న విషయాన్ని మంత్రి డోలా గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి రోజులైనా గడవక ముందే పథకాల అమలుపై వైసీపీ నేతలు దుష్ప్రచారం చేయడం తగదని హితవు పలికారు. వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పినా నాయకుల పరిస్థితి మారలేదని అన్నారు. కందుకూరులో శనివారం జరిగే స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొంటారని మంత్రి బాలవీరాంజనేయస్వామి తెలిపారు..

# సమస్యలు పరిష్కరించి ఆదుకోండి

- టీడీపీ కేంద్ర కార్యాలయానికి తరలివచ్చిన అర్జీ దారులు
- వినతులు స్వీకరించిన మాజీ మంత్రి కేఎస్ జవహర్



అమరావతి (చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమానికి తరలి వచ్చిన అర్జీదారుల నుండి మాజీ మంత్రి కేఎస్ జవహర్ వినతులు స్వీకరించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

అనంతపురం జిల్లా గుంతకల్ కు చెందిన రాఘవేంద్రాయుడు గ్రీవెన్స్ లో విజ్ఞప్తి చేస్తూ.. తన తండ్రి మరణాంతరం తనకు, తన తమ్ముడికి సమానంగా రావాల్సిన వాటాను తన తమ్ముడే ఆక్రమించుకొని తనను ఇబ్బంది పెడుతున్నాడని.. దయచేసి తనకు న్యాయం చేయాలని కోరారు.

అనంతపురం జిల్లా దేవుని ఉప్పలపాడు గ్రామానికి చెందిన నారమ్మ అర్జీ ఇస్తూ.. తాము గత 40 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూమిని అధికారులు ఆన్ లైన్ చేయమంటే చేయకుండా హోల్డ్‌లో పెట్టారని దయచేసి తాము సాగు చేసుకుంటున్న భూమిని తమ పేరుమీద ఆన్‌లైన్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

తూర్పు గోదావరి జిల్లా చాగల్లు మండలం మల్లవరం గ్రామానికి చెందిన పలువురు రైతులు విజ్ఞప్తి చేస్తూ.. గ్రామంలో ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం భూమిలో కొనసాగుతున్న 20 మంది లబ్ధిదారులకు 1935 లో రైతువారీ భూములుగా కన్వెర్షన్ చేసి రిజిస్టర్‌లో మార్పు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వుల కొనసాగించేలా చూడాలని కోరారు. సదరు భూమిని దేవాదాయ శాఖ నిషేదిత జాబితా నుండి తొలగించి, నిరభ్యంతర ధృవీకరణ పత్రం అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

అనంతపురం జిల్లా గొర్లదిన్నె మండాలనికి చెందిన లోకేశ్వర్ నాయడు విజ్ఞప్తి చేస్తూ.. తాను ఏపీఎంఎస్ఐడీసీలో పనులు చేసి మూడు సంవత్సరాలు దాటినా తాను చేసిన పనికి డబ్బులు రావకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని.. దయ చేసి తనకు రావాల్సిన బకాయిలు ఇప్పించి ఆదుకోవాలని కోరారు.

నంద్యాల జిల్లా వెలుగోడుకు చెందిన దువ్వాసి వసంత కుమారి విజ్ఞప్తి చేస్తూ.. ఎస్సీ మాల కులానికి చెందిన తనకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని.. తన కుటుంబ పోషణ నిమిత్తం కేజీబీవీలో నైట్ వాచ్‌మెన్ ఉద్యోగం ఇచ్చి తనకు సాయం చేయాలని వినతి పత్రం అందజేశారు.

అనంతపురం జిల్లా అనంతపురం మండలం మన్నీల గ్రామానికి చెందిన ముండ్లపాటి కుమారస్వామి విజ్ఞప్తి చేస్తూ.. తమకు వారసత్వంగా వచ్చిన భూమిలోకి దారిలేదంటూ పై పొలాల వారు బెదిరిస్తున్నారని.. దయచేసి పూర్వం నుండి ఉన్న రహదారిని యధావిధిగా కొనసాగేలా అధికారులు సర్వే చేసి తమకు రహదారి సమస్య లేకుండా చూడాలని కోరారు.

గుంటూరు 10వ లైనుకు చెందిన పెరికల లక్ష్మి విజ్ఞప్తి చేస్తూ.. తమ ఇంట్లో 4 సవర్ల బంగారం, రెండు లక్షల రూపాయల డబ్బులు పోయాయని.. తన భర్త వైద్యం కోసం దాచుకున్న డబ్బులను దొంగలు కొట్టేశారని.. దీనిపై త్వరగా విచారించి దొంగలను పట్టుకుని డబ్బులు తిరిగి ఇప్పించాలని వేడుకున్నారు.





# నిరంతర శ్రామికుడు సీఎం చంద్రబాబు



- ఉత్తమ ముఖ్యమంత్రుల జాబితాలో నాలుగో స్థానం గర్వకారణం
- మంత్రి కొలుసు పార్థసారథి

అమరావతి (చైతన్యరథం): దేశంలోని ఉత్తమ ముఖ్యమంత్రుల జాబితాలో నాలుగవ స్థానంలో నిలిచిన ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడుకి రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార, పౌరసంబంధాల మంత్రి కొలుసు పార్థసారథి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ప్రతిష్టాత్మక ఇండియా టుడే పత్రిక సర్వేలో చంద్రబాబు నాయుడు నాలుగో స్థానంలో నిలవడం మాకు గర్వకారణం. కేవలం అధికారంలోకి వచ్చిన 8 నెలల్లోనే ఐదో స్థానం నుంచి ఆయన నాలుగో స్థానానికి చేరుకోవడం.. సంక్షేమం కోసం ఆయన పడుతున్న శ్రమ, ప్రగతి సాధించడానికి పట్టుదలతో పనిచేస్తున్న తీరుకు నిదర్శనంగా నిలుస్తుంది. కేవలం కొన్ని నెలల కాలంలోనే ఆరున్నర లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను సాధించడం ప్రజలకు, పెట్టుబడిదారులకు ఆయన మీద ఉన్న నమ్మకాన్ని ప్రతిబింబిస్తోంది. ఐదేళ్లపాటు అన్ని రంగాల్లో విధ్వంసాన్ని చవిచూసిన రాష్ట్రాన్ని మళ్లీ ప్రగతి పట్టా లెక్కించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం శ్రమించడం అందరికీ, ప్రత్యేకించి యువతకు కచ్చితంగా మార్గదర్శకం. ప్రజలకు వాగ్దానం చేసిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయటానికి, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వ యంత్రాంగాన్ని సీఎం చంద్రబాబు ముందుండి నడిపిస్తున్నారు. ఆయన మార్గదర్శకత్వంలో మేం కూడా అన్ని విధాలుగా కష్టపడుతున్నాం. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి 20 లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యాన్ని ప్రభుత్వం త్వరలోనే సాధిస్తుందని మంత్రి పార్థసారథి ఉద్ఘాటించారు.

# వెలిగొండ వెలుగుపై వైసీపీ చీకట్లు!

**ఐదేళ్ల చీకటి పాలనలో ఏపీ నీటి ప్రాజెక్టులకు ఆగమాగం చేసిన వైసీపీ సర్కారు.. వెలిగొండ ప్రాజెక్టుపైనా శీతకన్నేసింది. 2019 -2024 మధ్యకాలంలో ప్రాజెక్ట్ పనులు గాలికొదిలేసిన జగన్ సర్కారు.. నీటిపారుదల వ్యవస్థనూ భ్రష్టుపట్టించింది. ఏపీ వరప్రదాయిన పోలవరం డయాఫ్రం వాల్ దెబ్బతినడానికీ, అన్నమయ్య ప్రాజెక్ట్ కొట్టుకుపోవడానికీ -పూర్తి కారకుడు అసమర్థ జగనే. రాష్ట్రంలోని నీటి ప్రాజెక్టులను సమీక్షిస్తూ కొద్దిరోజుల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబు -వెలిగొండ ప్రాజెక్ట్‌పై తన దృక్పథాన్ని ప్రకటించడంతో -ఆ ప్రాంత రైతుల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. వెలిగొండ పనులు వేగవంతం చేద్దామంటూనే.. త్వరలోనే ప్రాజెక్ట్ పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానని చంద్రబాబు ప్రకటించడం.. ప్రాజెక్టు మళ్లీ గాడినపడే కాలం మొచ్చిందని చెప్పక చెప్పడమే.**




చంద్రబాబు హయాంలో 80 శాతానికిపైగా పనులు పూర్తి చేసుకున్న వెలిగొండ ప్రాజెక్ట్‌ను 2019 -2024 మధ్యకాలంలో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి రాష్ట్రంలోని పెద్ద ప్రాజెక్టులతోపాటు వెలిగొండ ప్రాజెక్ట్‌ను గాలికొదిలేశాడు. చంద్రబాబు హయాంలో నిర్మించిన ప్రాజెక్టుల్లో చిన్నచిన్న పనులు చేసినా ప్రాజెక్టులు పూర్తయి చంద్రబాబుకు పేరు వస్తుందని... వాటికి నిధులు కేటాయించకుండా కాలయాపన చేస్తూ రాష్ట్రంలో నీటిపారుదల రంగాన్ని పూర్తిగా నామరూపాలు లేకుండా చేశాడు. రాష్ట్ర ప్రజల జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్ట్ పనులను అటకెక్కించాడు. వరదల్లో డయాఫ్రం వాల్ కొట్టుకుపోతున్నా చేతులు పిసుక్కుంటూ తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చున్నాడే తప్ప... చంద్రబాబు హయాంలో 72శాతం పూర్తయిన పోలవరం ప్రాజెక్ట్ పనుల పురోగతిని సమీక్షించలేదు. నీటి పారుదలరంగాన్ని 20 ఏళ్లు వెనక్కి నెట్టి అన్నదాతల ఉసురు తీశాడు సైకో జగన్‌రెడ్డి. ఎంతసేపూ మద్యం, ఇసుక, ఎర్రచందనం, గంజాయివంటి అక్రమ ఆదాయాన్ని తాడేపల్లి ప్యాలెస్‌లో లెక్కలు వేసుకుంటూ రాష్ట్రాన్ని దోచేశాడు. జగన్‌రెడ్డి అక్రమ ఇసుక సంపాదన వల్ల నదిలో లారీలు ఉన్నాయన్న కారణం చేత... సొంత జిల్లా కడపలో అన్నమయ్య ప్రాజెక్ట్ వరదలకు కొట్టుకుపోయేందుకు కారణమయ్యాడు. అవినీతి సొమ్ము కోసం రాష్ట్ర ప్రజలనే కాకుండా... రాష్ట్ర ప్రయోజనాలను నేలమట్టం చేశాడు సైకో జగన్‌రెడ్డి.

## ఐదేళ్లల్లో జగన్‌రెడ్డి కేటాయించింది అంతంతే...!

ప్రజా సంకల్ప యాత్ర పేరిట పాదయాత్ర నిర్వహిస్తూ... మార్నింగ్ ఈవినింగ్ వాకింగ్ చేస్తూ... జగన్‌రెడ్డి పెద్ద పెద్ద హామీలు ఇచ్చాడు. అందులో భాగంగానే మేము అధికారంలోకి వస్తే ఏడాదిలోపు వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తామని ఫిబ్రవరి 27, 2018 పొదిలిలో జగన్ హామీ ఇచ్చాడు. 2019లో మోసపూరిత హామీలు, తప్పుడు కథనాలు, టీడీపీ చేసిన అభివృద్ధి చెప్పుకోలేకపోవడంతో జగన్‌రెడ్డి పార్టీ అధికారంలోకి వచ్చింది. వచ్చిన ఐదేళ్లపాటు మొద్దు నిద్ర, అవినీతి సొమ్మును వెనకేసుకోవడం తప్పితే... పాదయాత్రలో ఇచ్చిన ఏ ఒక్కహామీనీ అమలు చేసింది లేదు. దాదాపు ఐదేళ్లపాటు కాలక్షేపం చేసి అటు వెలిగొండ ప్రాజెక్ట్‌ను ముంచేశాడు. టీడీపీ ఐదేళ్లకాలంలో రూ.1,500 కోట్ల రూపాయాలు వెలిగొండ ప్రాజెక్ట్ కోసం ఖర్చు చేసింది. అయితే ఐదేళ్ల జగన్ పాలనలో కేవలం రూ.850 కోట్లు ఖర్చు చేశారు. ఇంకా రూ.400 కోట్లు అవసరమని తెలిసినా వెలిగొండకు 2023-24 బడ్జెట్‌లో కేవలం రూ.101.47 కోట్లు మాత్రమే కేటాయించి రూ.30 కోట్లు మాత్రమే ఖర్చుచేసి మూడు జిల్లాల ప్రజలకు తీరని ద్రోహం చేశాడు.

## మూడు దశాబ్దాల క్రితమే పునాదులు వేసి చంద్రన్న

1995లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు మొదటి సారి ప్రమాణస్వీకారం చేశారు. సరిగ్గా ఏడాదికే ఆంధ్రప్రదేశ్‌లో నీటి అవసరాలను గుర్తించి... ప్రాజెక్టుల నిర్మాణంపై కసరత్తు మొదలుపెట్టారు. 1996 మార్చి 5న ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణానికి 15కి.మీ దూరంలోవున్న గొట్టిపడియ దగ్గర పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. శ్రీశైలం రిజర్వాయర్ ఫోర్ షోర్ కుడిగట్టు ద్వారా గ్రావిటీతో కృష్ణా నదినుంచి 43.50 టిఎంసీ వరదజలాలను వినియోగించి... ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలలో 4.47 లక్షల ఎకరాలకు సాగునీటి కల్పన, ఫ్లోరైడ్ ప్రభావిత 30 మండలాలలో 15.25 లక్షల మందికి తాగునీరు అందించడం లక్ష్యంగా నిర్దేశించారు. అనంతరం వచ్చిన వైఎస్ఆర్ ప్రభుత్వం జలయజ్ఞం పేరుతో రాష్ట్రంలోని ప్రాజెక్ట్‌లను దోచుకొని ధనయజ్ఞంగా మార్చింది. అయ్యను అడ్డంపెట్టుకొని కొడుకు జగన్‌రెడ్డి అప్పట్లోనే లక్ష కోట్లకు ఎగబాకాడు.

## నీటి ప్రాజెక్టులకు రూ.68 వేల కోట్లు ఖర్చు చేసిన చంద్రబాబు

2014లో చంద్రబాబు అధికారంలోకి వచ్చాక రాష్ట్రవ్యాప్త నీటి ప్రాజెక్టులను గాడిలో పెట్టేందుకు వేగంగా చర్యలు తీసుకున్నారు. ఆర్థిక లోటున్నా 2014-2019 ఐదేళ్ల బడ్జెట్‌లో నీటిపారుదల రంగానికే రూ.68 వేల కోట్లు కేటాయించారు. రాష్ట్రంలోని మేజర్, మైనర్ నీటి ప్రాజెక్టుల పనులు వేగంగా పూర్తి చేశారు. మరోసారి అధికాంలోకి వచ్చివుంటే దాదాపు 62 ప్రాజెక్టులు పూర్తయ్యేవి. 2019లో జగన్‌రెడ్డి అధికారంలోకి రావడం రివర్స్ టెండరింగ్ పేరుతో అన్ని పనులు ఎక్కడికక్కడే నిలుపుదల చేశారు. ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో కేవలం రూ.32 వేల కోట్లు మాత్రమే నీటిపారుదల రంగానికి కేటాయించాడు. అందులో రూ.10 వేల కోట్లు జీతాలకు పోగా... మిగిలిన పనులకు బకాయిలు పెండింగ్ పెట్టి వెళ్లాడు.

## ఐదేళ్లలో 5శాతం పనులే చేసిన జగన్‌రెడ్డి

వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో వెలిగొండ ప్రాజెక్టు పనులను కేవలం 5శాతమే పూర్తిచేసింది. రూ.3వేల కోట్ల నిధులు కేటాయించి రూ.170 కోట్లే ఖర్చుచేసింది. ఇందులో రూ.50 కోట్ల బిల్లులు బంధువులైన కడప జిల్లాకు చెందిన కాంట్రాక్టర్లకు చెల్లించారు. 2014-19 మధ్య చంద్రబాబు ప్రభుత్వం రూ.1,973 కోట్లు కేటాయించి రూ.1,319 కోట్లు ఖర్చుచేసింది. టన్నెల్-1 పూర్తయినా దానిలో 1.20 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని టన్నెల్ -2 నుంచి తోలారు. దీనిని తొలగించాలంటేనే ఆరు నెలలు పడుతుంది. టన్నెల్-2లో ఇంకా 7 కిలోమీటర్లమేర లైనింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. అదే టన్నెల్ లోకి 11 కిలోమీటర్ల లైనింగ్ పూర్తికావడానికి 11 ఏళ్లు పట్టింది. ఈ టన్నెళ్ల నుంచి నీటిని జలాశయానికి తరలించాలంటే 21 కిలోమీటర్ల ఫీడర్ కెనాల్ పూర్తికావాలి. ఆ పనులూ అసంపూర్తిగా ఉన్నాయి. ఆర్ఆర్ ప్యాకేజీ కింద నిర్వాసితులకు రూ.880 కోట్లు ఇవ్వాల్సి ఉంది. వైసీపీ పాలనలో నిర్వాసితులకు ఒక్క రూపాయి కూడా పరిహారం అందజేయలేదు.

## త్వరలో వెలిగొండ ప్రాజెక్ట్‌ను సందర్శిస్తా: చంద్రబాబు

మూడు జిల్లాల ప్రజల ఆకాంక్ష వెలిగొండ ప్రాజెక్టు. తెలుగుదేశం హయాంలో మొదటి సొరంగం పనులు పూర్తయితే... వైసీపీ నాయకులు తామే పూర్తి చేసినట్టు ప్రచారం చేసుకున్నారు. ప్రాజెక్టుకు సంబంధించి టీడీపీ హయాంలో 80 శాతంపైగా పూర్తి చేశారు. ఈ మేరకు నీటిపారుదల శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రాజెక్టులతో పాటు వెలిగొండ ప్రాజెక్ట్‌పై ప్రత్యేక దృష్టిపెట్టారు.వెలిగొండ విషయంలో జరుగుతున్న జాప్యంపై సీఎం ఆవేదనవ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో నా చేతుల మీదుగా వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశానని... ఆ ప్రాంత అవస రాలు గుర్తించి 2014-19 మధ్యలో అత్యంత ప్రాధాన్యమిచ్చి పనులు ముందుకు తీసుకువెళ్లానని అన్నారు. కానీ తరువాత వచ్చిన ప్రభుత్వం డ్రామాలు చేసి పూర్తికాని ప్రాజెక్టున ప్రారంభోత్సవాలు చేసింది. దీనివల్ల ఆ ప్రాంత వాసులకు తీవ్ర నష్టం వాటిల్లినట్టు చంద్రబాబు పేర్కొన్నారు. అధికారులు ఈ ప్రాజెక్టు పూర్తిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని... తాను కూడా ప్రాజెక్టును సందర్శించి త్వరితగతిని ప్రాజెక్టు పూర్తికి చర్యలు తీసుకుంటానని ఇప్పటకే సీఎం చంద్రబాబు ప్రకటించారు.

- ప్రవీణ్ బోయ, అనలిస్ట్

చైతన్యరథం

## ఆడబిడ్డలను అసభ్యంగా తూలనాడిన..

# వంశీ నాలుక కోసినా తప్పులేదు

- అతడి అరెస్ట్‌పై వైసీపీ నేతల పెడబొబ్బలు సిగ్గుచేటు
- నేరస్థులు చట్టం నుంచి తప్పించుకోలేరు
- అంబోతు రాంబాబు రంకెలు ఆపాలి
- తప్పు చేసినవారు గుడివాడ, దెందులూరు, బందర్.. ఎక్కడ ఉన్నా కటకటల్లోకే
- ఎమ్మెల్యే చింతమనేని ధ్వజం

అమరావతి (చైతన్యరథం): ఆడబిడ్డలపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడిన వల్లభనేని వంశీ నాలుకను కోసినా తప్పులేదని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మండిపడ్డారు. నాడు అధికార బలం ఉందని నాడు ఇష్టం వచ్చినట్లు రెచ్చిపోయారు. మదం తలకెక్కిన వంశీ ఆడవాళ్లను తిడుతుంటే .. జగన్ పకపకా నవ్వుతూ కూచున్నాడు. వంశీ జైలుకు వెళ్లడానికి కారణం జగనే. మరి వంశీని పరామర్శించకుండా జగన్ బెంగళూరు ఎందుకువెళ్లాడు? ఇలాంటి వ్యక్తి అరెస్ట్ అయితే ఆంబోతులా అంబటి రాంబాబు అరుస్తున్నాడు. అసలు ఆ అరగంట, గంట విషయం ఏంటో రాంబాబు ముందు ప్రజలకు చెప్పి తరువాత మాట్లాడాలని చింతమనేని దుయ్యబట్టారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో చింతమనేని మాట్లాడుతూ వంశీ అరెస్ట్ అక్రమం అని వైసీపీ నేతలు మాట్లాడటం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. వంశీ ఏతప్పు చేయకుండానే గన్నవరం టీడీపీ కార్యాలయం తగలబడుతుందా? మీరు అధికారంలో ఉండి నాడు మీ తప్పులను కప్పి పుచ్చుకున్నారు. అక్రమ అరెస్టులు, తప్పుడు హౌస్ అరెస్టులు వైసీపీ ప్రభుత్వంలోనే జరిగేవి. అవసరమైతే చింతపల్లి ఫారెస్ట్‌లోకి తీసుకెళ్లి ఎన్‌కౌంటర్ చేస్తామని బెదిరించడంతో పాటు కొంత మందిని అసలు భూమి మీదనే లేకుండా చేసింది వైసీపీ నేతలే.ఇటువంటివి మీకే సాధ్యం. మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ ఆత్మహత్య చేసుకునే పరిస్థితిని తీసుకు వచ్చింది వైసీపీ నేతలు కాదా? ఎటువంటి తప్పు చేయకపోయినా ఆయన భూమి మీద లేకవ పోవడానికి కారణం వైసీపీ,జగన్‌మోహన్‌రెడ్డి కాదా? అధికారంలో ఉండగా చేసిన నేరాలకు వంశీని ఇప్పుడు అరెస్ట్ చేశారు.వంశీనే కాదు కొడాలి నానితోపాటు అరాచక వ్యక్తులు అందరూ అరెస్ట్ అవుతారు. నేరం చేసిన వారు చట్టం నుంచి తప్పించుకోలేరు. చట్టం అమలు అయ్యేందుకు కాస్తసమయం పట్టొచ్చేమో కాని శిక్ష తప్పదు. ఇలాంటి వారందరూ కటకటాల పాలు కాక తప్పదని చింతమనేని స్పష్టం చేశారు.

### గతం మరిచి అరుపులు

రాత్రిపూట కామబాబు.. పగలు రాంబాబుకు మంత్రి పదవి ఇచ్చి ప్రభుత్వ స్థాయిని జగన్ దారుణంగా దిగజార్చాడు. ఇలాంటి ఆంబోతు రాంబాబు కూడా వంశీ అరెస్ట్‌పై మాట్లాడుతున్నాడు. క్యాసెక్, టీఎంసీ అంటే ఏంటోతెలియని వ్యక్తి ఇరిగేషన్‌శాఖకు మంత్రిగా ఉండి పోలవరాన్ని పడుకోబెట్టి సర్వనాశనం చేశాడు. రాంబాబు గురించి చెప్పాలంటే మాటలు సరిపోవు. కోడెల శివప్రసాద్ ఆత్మహత్య వెనుక అంబటి వేధింపులు కూడాఉన్నాయి. దీనిపై రాంబాబు మీద 306 సెక్షన్ కింద కేసు పెట్టి అరెస్ట్ చేయాలి. పరోక్షంగా కోడెల చావుకు కారణం రాంబాబు, జగన్‌లే. మా మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు నాడు స్వయంగా డీజీపీని కలిసేందుకు వెళితే గేటు దాటి రానివ్వకుండా వెనక్కి పంపారు. డీజీపీ ఆఫీసు పక్కనే ఉన్న టీడీపీ కేంద్ర కార్యాలయంలోకి వైసీపీ మూకలు చొరబడి కార్యాలయాన్ని ధ్వంసం చేసి ఆఫీసు సిబ్బందిపై దాడి చేస్తే... నాడు డీజీపీ ఎక్కడికి పోయాడు. ఆ రోజు ముఖ్యమంత్రి ఎక్కడికిపోయాడు. నిన్ను తిడుతుంటే నీకు రోషం వస్తుంటే.. మా కార్యాలయాలు.. మాపై దాడులు చేస్తుంటే మాకు కోపం రాదా? నాడు ప్రతిపక్ష హెూదాలో చంద్రబాబు వెళుతుంటే రాళ్లు విసిరినా దానిపై నాటి డీజీపీ మాట్లాడుతూ బావప్రకటనా స్వేచ్ఛ అంటూ సమర్థించాడు. డీజీపీ రిప్రజెంటేషన్ తీసుకోకుంటే తగలబెట్టి వెళ్తానంటున్నారు. వైసీపీ సంస్కృతే అది. ఇప్పుడు మీకు, మీ నాయకులకు ఇబ్బంది వస్తే నొప్పి తెలుస్తోందా అని చింతమనేని నిలదీశారు.

### అంబటి సిగ్గులేని మాటలు

నాపై ఏ తప్పు లేకుండా ఎస్సీ, ఎస్టీ కేసులు, హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. 67 రోజులు జైల్లో పెట్టారు. అన్యాయంగా చంద్రబాబుని స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో 53 రోజులు జైల్లో పెట్టారు.



దాని ఫలితమే నేడు వైసీపీకి 11 సీట్లు. సిగ్గులేకుండా అబ్బయ్య చౌదరిని ఇబ్బంది పెడుతున్నారంటూ.. అంబటి రాంబాబు మాట్లాడుతున్నాడు. అసలు అబ్బయ్య గురించి రాంబాబుకు ఏమి తెలుసు. పేరుకే సాఫ్ట్‌వేర్.. లోపలంతా నేర స్వభావమే. అలాంటి క్రిమినల్ ఉండనే ఉండడు. కొల్లేరు ప్రజలకు చెందిన ఆరు కోట్లు కొల్లగొడితే.. అబ్బయ్య చౌదరి ఇంటి ముందు పేదలు వంద రోజులుగా వంటావార్పుతో కంచాలు కొడుతూ నిరసన చేస్తున్నారు. అయినా సిగ్గులేకుండా మాట్లాడుతారా? అదే టీడీపీలో అయితే నా ఇంటి ముందు ఇలాంటి ఉద్యమం జరిగితే మా నాయకుడు నన్ను పిలిచి అడిగేవారు.నా తప్పు ఉంటే మందలించేవారు. వెంటనే సమస్యను పరిష్కరించమని చెప్పేవారు. జగన్‌రెడ్డికి ఇవేం పట్టవు. దెందులూరులో ఏం జరుగుతుందో ఆయనకు తెలియదు.. శుభకార్యానికి వెళితే తనపై కేసుపెట్టారని అబ్బయ్య నంగనాచి మాటలు మాట్లాడుతున్నాడు. మేము శుభకార్యాలకు వెళ్లడంలేదా? ప్రజల్లో తిరగడంలేదా? ఎవరు తప్పు చేశారో పెళ్ళికి పిలిచిన వ్యక్తినే చెప్పమనండి. చెలమలశెట్టి రమేష్ గురించి చెబుతున్నారు? ఆయన్నే చెప్పమనండి.. ఎవరిది తప్పో. నాది తప్పు అని తేలితే నేను అసెంబ్లీకి రాజీనామా చేస్తా? గంట అరగంట అంటూ మాట్లాడే వ్యక్తి అంబటికి.. నా క్యారెక్టర్ గురించి మాట్లాడే అర్హత లేదు. అంబటి నాకు సర్టిఫికెట్ ఇవ్వడమేంటి. గంట, అరగంట గురించి ఎందుకు వివరణ ఇచ్చుకోలేదు. ఏ సుకన్య దొరకకపోవటంతో నా గురించి మాట్లాడుతున్నావా అని అంబటిపై చింతమనేని నిప్పులు చెరిగారు.

### ప్రజలే మీ కోరలు పీకారు

తప్పు చేసిన వారు ఎవరూ తప్పించుకోలేరు. దెందులూరు, గుడివాడ, బందర్ ఎక్కడ ఉన్నా ఎవరైనా శిక్ష తప్పదు. వైసీపీ హయాంలో దళిత బిడ్డను చంపి డోర్ డెలివరీ చేస్తే అడిగినవారు లేరు. మీరు మమ్మల్ని ప్రశ్నిస్తున్నారా. వైసీపీ వారి తప్పు లేకుండా నా నియోజకవర్గంలో ఒక్క అక్రమ కేసు కూడా పెట్టలేదు. ఇదే కూటమి క్రమశిక్షణ. నన్ను ఇరికించాలని ప్రయత్నించి అబ్బయ్యే ఇరుక్కున్నాడు. కొల్లేరు డబ్బులు ఎగ్గొట్టాలన్న ప్లాన్‌లో భాగంగా స్కెచ్ వేశాడు. కావాలని పెళ్లిలో కారును అడ్డంపెట్టి రచ్చచేశారు. అక్కడి సెక్యూరిటీ వారు మూడు సార్లు చెప్పినా కార్లను అడ్డం తియ్యలేదు. ఏమి తెలియకుండా నోరు ఉంది కదా అని రాంబాబు అంబోతులా అరిస్తే సరిపోదు. ప్రజా క్షేత్రంలో ప్రజలే నీ కోరలు పీకారు. నీ కొమ్ములు విరిచారు. ఇంకెదుకు రంకెలు. వైనాట్ 175 అన్నారు. ప్రజలే మీకు ఎక్కడ కాల్చి వాతలు పెట్టాలో అక్కడ పెట్టారు. ఇంకా మాట్లాడటానికి సిగ్గనిపించడంలేదా అని చింతమనేని దుయ్యబట్టారు.

### తప్పులు బయటపడుతుంటే గావు కేకలు

అభివృద్ధి, సంక్షేమం లేదని మాట్లాడటానికి మీకు అర్హత ఉందా? రూ.4000 వేలు పింఛన్ ఇవ్వడం సంక్షేమం కాదా? మీ ప్రభుత్వంలో ఒక్క రోడ్డయినా వేశారా? టీడీపీ ప్రభుత్వం వచ్చాక నియోజకవర్గంలో ఎక్కడా రోడ్లపై కూడా గుంతలు లేకుండా చేశారు. నా నియోజకవర్గంలో గతంలో ఎమ్మెల్యేగా ఉన్న అబ్బయ్య పట్టించుకోని రోడ్లన్నీ ఇప్పుడు వేస్తున్నాం. ఉగాది నాటికి రోడ్లన్నీ పూర్తి చేసి ప్రారంభిస్తాం.. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి అబ్బయ్య గర్వపడాలి. నాడు కార్యకర్తలతో చందాలు వేసుకుని గుంతలు పూడుస్తుంటే రోడ్లు తవ్వారని నాపై పక్క నియోజకవర్గంలో కూడా అక్రమ కేసులు పెట్టారు. నేడు చేసిన తప్పులకు కేసులు పడుతుంటే గొంతు చించుకుంటున్నారు. దెందులూరులో అబ్బయ్య చరిత్ర అంతా బయటకు తీస్తా వదిలిపెట్టను. చేసిన తప్పులు బయటకు వస్తుంటే.. ఈ అరాచక వ్యక్తులకు నేడు రెడ్ బుక్ గుర్తుకు వస్తోంది. టీవీల ముందు గావు కేకలు పెడుతున్నారు. దుర్మార్గం ఎల్లకాలం నిలవదని ఇప్పటికైనా అరాచక మూకలు తెలుసుకోవాలని చింతమనేని అన్నారు.

---

## గన్నవరం టీడీపీ కార్యాలయంపై వంశీ దాడి..

# సైకో బాస్ మెప్పుకోసమే

- అలాంటి మృగాలు బయట తిరగడం సమాజానికి హానికరం
- బెయిల్ రాకుండా జైల్లోనే ఉంచాలి
- మదం తలకెక్కి దళిత యువకుడి కిడ్నాప్, బెదిరింపులు
- మాజీ మంత్రి కేఎస్ జవహర్ ధ్వజం

అమరావతి (చైతన్యరథం): అప్పట్లో తాడేపల్లిలోని తన సైకో బాస్‌ని సంతృప్తి పరిచేందుకే వల్లభనేని వంశీ గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి చేశాడని మాజీ మంత్రి కేఎస్ జవహర్ ధ్వజమెత్తారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో జవహర్ మాట్లాడుతూ... వంశీకి బెయిల్ ఇవ్వకుండా జైల్లోనే ఉంచాలన్నారు. ఆయనను బయటకు వదిలితే సమాజానికి మంచిదికాదు. అల్పబుద్ధివారికి అధికారమిస్తే పరిపాలన అలాగే ఉంటుంది. చెప్పు తినెడి కుక్క చెరుకు తీపి ఎరగనట్లు వల్లభనేని వంశీకి అవినీతి, అక్రమాలే తెలుసుగానీ, నీతి, నియమాలు తెలియవు. చెడ్డవారికి అధికారం ఇస్తే పరిపాలన ఏ విధంగా ఉంటుందో చెప్పేందుకు వల్లభనేని వంశీ అరాచకాలే నిదర్శనం. వంశీ తెలుగుదేశంపార్టీ నుండి వైసీపీలోకి వెళ్లినప్పటికీ, అతడిలోని టీడీపీ భావాజాలాన్ని జగన్ పూర్తిగా చెరిపేశాడు. వంశీ లాంటి



దరిద్రులుంటే కులానికి కూడా చెడ్డపేరు వస్తుంది. వంశీ చేయని అరాచకాలు, కబ్జాలు, నేరాలు లేదు. సత్యవర్థన్ కిడ్నాప్ విషయంలోనే కాక వంశీ చేసిన లెక్కలేనన్ని నేరాలకు అతనిపై అనేక కేసులు పెట్టాల్సి వస్తుంది. నేరస్థులు వారు తీసుకున్న గోతిలో వారే పడతారనేందుకు సత్యవర్థన్‌ను కిడ్నాప్ చేయటం, బెదిరింపులకు గురిచేయడమే నిదర్శనం. సత్యవర్ధన్ అనే వ్యక్తి గన్నవరం తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తుండేవాడు. అతడి కళ్లముందే వంశీ తన అనుచరులతో టీడీపీ కార్యాలయంపై దాడి చేయించాడు. కార్లు, కంప్యూటర్లు ధ్వంసంచేసి విధ్వంసాన్ని సృష్టించాడు.దీనిపై ఫిర్యాదు చేసిన సత్యవర్థన్‌ను కిడ్నాప్ చేయించి, బెదిరించి ఫిర్యాదు వెనక్కు తీసుకుంటున్నట్లుగా అతడితో తప్పుడు వాంగ్మూలం ఇప్పించాడు. అతడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో వంశీ పాపం పండి అరెస్టయి, జైలు ఊచలు లెక్కపెడుతున్నాడు. సత్యవర్ధన్ ఒక దళితుడు. ఏమీ చేయలేనివాడు, అశక్తుడు. అలాంటి వ్యక్తిని కిడ్నాప్ చేసి, బలవంతంగా బెదిరించి ఎస్సీ, ఎస్టీ కోర్టు వద్దకు వచ్చి కేసు విత్ డ్రా చేసుకుంటే ఎవరూ ఏమి చేయలేరనే అహంభావంతోనే వంశీ ఈ నేరానికి పాల్పడ్డాడు.దళితులు అమాయకులైనా, వారి వద్ద ఏశక్తులు లేకున్నా వాళ్లకు రక్షణకవచంలా అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ఉంది.ఆ రాజ్యాంగమే వారికి రక్షాకవచంగా నిలుస్తుందని జవహర్ స్పష్టం చేశారు.

### ఇన్ని వందల కోట్లు ఎక్కడివి?

తాడేపల్లిలోని తన సైకో బాస్‌ని సంతృప్తి చేసేందుకే వంశీ ఇంతటి విధ్వంసం సృష్టించాడు. గన్నవరంలో వంశీ ముఖంచూసి ఆయనకు ఎవరూ ఓట్లేయలేదు. తెలుగుదేశంపార్టీ అభ్యర్థిగా మాత్రమే వంశీని గెలిపించారు. టీడీపీ తనకు అన్యాయం చేయలేదని వంశీకి కూడా తెలుసు. గన్నవరం పార్టీ ఆఫీసుపై దాడి చేయడానికి కారణం జగన్ మెప్పుకోసమే. తల్లిలాంటి తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి చేసింది జగన్‌ను సంతోషపెట్టడానికే. గన్నవరం నియోజకవర్గం తన జాగీరుగా భావించి వంశీ రెచ్చిపోయి దోపిడీలకు, దాడులకు పాల్పడ్డాడు. జగన్ రాష్ట్రాన్ని దోచుకుంటే... వంశీ గన్నవరాన్ని దోచుకున్నాడు.చివరికి విమానాశ్రయ భూముల్ని కూడా వదలలేదు. సెటిల్‌మెంట్‌లు చేయడంలో వంశీ దిట్ట. గన్నవరంప్రాంతంలో అపార్టుమెంట్లు కట్టినవారి మధ్య వివాదాలు సృష్టించి, వాటి ద్వారా లబ్దిపొందే రకం. వంశీ నేడు ఇన్ని వందల కోట్లు ఎలాసంపాదించాడు, నిర్మాతగా సినిమాలు ఎలా తీశాడనే విషయం గన్న వరం చుట్టపక్కల ప్రజలందరికీ తెలుసు. జగన్.. వంశీకి పూర్తి అధికారాలిచ్చి వదిలేయడంతో విచ్చల విడిగా వ్యవహరించాడు. వంశీని అరెస్టు చేయడం సమర్థనీయం. దళిత యువకుడు సత్యవర్ధన్ కిడ్నాప్ వంశీ అరాచకానికి నిదర్శనం. ఒక దళితుడిని కిడ్నాప్ చేసి హత్య చేయడానికి ప్రయత్నించాడు. అతనిపై సెక్షన్ 3కేసు పెట్టాలని మాజీమంత్రి కేఎస్ జవహర్ డిమాండ్ చేశారు.

# అవినీతిపరుల భరతంపట్టాలి!

సమ్మిళిత సుస్థిరాభివృద్ధిని స్వాహా చేసి, ప్రజాధన దోపిడీకి పాల్పడిన వైసీపీ అవినీతి నిగ్గు తేల్చటంలో కూటమి నిర్లక్ష్యం వహిస్తే –నిజంగానే మిగిలేది జనజీవన విధ్వంసమే. అవినీతి, అక్రమార్కులపట్ల చట్టబద్ధంగా వ్యవహరించి నిబంధనల ప్రకారం శిక్షించాల్సిన బాధ్యత కూటమిపై ఉంది. లెక్కాపత్రంలేని స్వాహాపర్వాలతో రాష్ట్రాన్ని మింగిన అనకొండలను చట్టబద్ధంగా శిక్షించి తీరాలి. రాజకీయాన్ని వ్యాపారమయం చేసి.. దగాకోరు విధానాలతో ప్రజలను మోసంచేసి.. రాష్ట్రాన్ని వైసీపీ అధోగతి పాలు చేసింది. పాలకులం కాదు సేవకులమంటూ నంగనాచి కబుర్లుచెప్పి.. తెరవెనుక చేసిందంతా అవినీతే! లక్షల కోట్ల ప్రజాధనాన్ని. అమూల్యమైన జాతి సంపదను కొల్లగొట్టిన తీరు మాటల్లో చెప్పగలిగేది కాదు. ఐదేళ్ల అడ్డగోలు పాలనలో సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు అడ్డూ అదుపులేకుండా అనేక మార్గాలలో ఎన్నివేల కోట్లు కొల్లగొట్టారో ఏ ఆర్థిక నిపుణుడు నిగ్గు తేల్చగలడు? ప్రజాధనం కొల్లగొట్టిన వారిని కరుడుగట్టిన నేరస్థులుగా పరిగణించి కోర్టు బోనులో నిలబెట్టాలి. దక్షతతో నేర నిరూపణ చేసి చట్టబద్ధంగా శిక్షించాలి. అడ్డగోలుగా దోచుకొన్న అక్రమార్జన మొత్తం కక్కించి బొక్కసానికి చేర్చాలి. ఎందుకంటే, అది ప్రజాధనం. దానికి ధర్మకర్తలుగా ఉండాల్సిన ప్రజాప్రతినిధులు దోపిడిదారులుగా వ్యవహరించారు. అలాంటివారిని కటకటాల్లోకి, వారి అక్రమ సంపాదనను ఖజానాలోకి మళ్ళించగలిగితే– ఇటు సంక్షేమానికి, అటు అభివృద్ధికీ నిధుల కొరతే ఉండదు. ప్రజా తీర్పు విషయంలోనూ న్యాయం జరుగుతుంది. అవినీతితో ఏపీ అస్తిత్వమే ప్రశ్నార్థకమైనవేళ– గత పాలకుల దురాగతాల నుంచి రాష్ట్ర భవిష్యత్తును కాచుకోవడమే లక్ష్యంగా అధికారంలోకి వచ్చిన కూటమి ముందున్న కీలక లక్ష్యం.. లక్షల కోట్ల ప్రజాధనాన్ని ఆబగా దిగమింగిన అవినీతిపరుల భరతం పట్టడమే. ఇదీ ప్రజలు ఆశిస్తున్నది. అవినీతిపరులుపై ఉక్కుపాదం మోపకుండా ఉపేక్షిస్తే ప్రభుత్వ బలహీనతగా, అసమర్థతగా భావించి తామే అసలైన పవిత్రులుగా ప్రచారం చేసుకొంటారు అవినీతి నేతలు. ప్రజాధనానికి ధర్మకర్తగావున్న ప్రభుత్వం ఇష్టానుసారం ప్రజాధనాన్ని దోచుకుతిన్న జగత్ కంత్రీల భరతం పట్టాల్సిన సమయమిది.

ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎన్నడూ ఇంతగా దోపిడీకి గురి కాలేదు. అవినీతిపాలనలో అభివృద్ధి పూర్తిగా అడుగంటి రాష్ట్రంపై పెనుచీకట్లు కమ్ముకున్నాయి. ఐదేళ్ల అధికారాన్ని అవినీతి గనిగా మార్చుకుంది వైసీపీ. అధికారాన్ని అడ్డంపెట్టుకొని జగన్ ముఠా సృష్టించిన అవినీతికి యావత్ ఏపీ బలైంది. రాజ్యాంగ ప్రమాణాలకు నీళ్లొదిలి.. వాగులు వంకలు, ఇసుక, ఖనిజాలు, కాంట్రాక్టులు, మద్యం, అటవీ సంపద, ఖాళీ భూములు– ఇలా తిన్నవాడికి తిన్నంతగా అవినీతిపాలన సాగింది. ఆబ్కారీ కార్పొరేషన్‌కు భవిష్యత్తులో వచ్చే రాబడుల్నీ తాకట్టుపెట్టి, ఇష్టారీతిగా దూసి తెచ్చిన రుణాలతో ఏపీమీద అప్పుల భారం దాదాపు రూ.11 లక్షల కోట్లకు చేరింది. విలువైన భూములను గత ప్రభుత్వ పెద్దలు యథేచ్ఛగా భోంచేశారు. రీసర్వే పేరిట భూముల రికార్డులను తారుమారు చేసి అసైన్డ్, ఈనాం, ప్రభుత్వ భూములను చేజిక్కించుకొన్నారు. విశాఖ, ఒంగోలు, చిత్తూరు, తిరుపతిలో జరిగిన సహజ వనరులు, భూములు దోపిడీ ఒక కేస్‌స్టడీ మాత్రమే. ఇళ్ల స్థలాల పేరిట అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు గత పాలకులు. ముందుగానే భూములు గుర్తించి, వాటిని తక్కువ ధరకు కొనుగోలు చేసి తర్వాత మూడు రేట్ల అధిక ధరకు ప్రభుత్వానికి విక్రయించారు. భూ కొనుగోలువల్ల గత పాలనలో ప్రభుత్వానికి రూ.35,576 కోట్ల నష్టం జరిగినట్టు సమాచారం. ప్రభుత్వ అంచనా ప్రకారం 1.75 లక్షల ఎకరాల భూమిని దోపిడి చేసినట్టు అంచనా. ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుపేదలకు ఇచ్చిన అసైన్డ్ భూముల్లో 10 వేల ఎకరాలను బలవంతంగా లాక్కున్నారు. చట్టాన్ని మార్చి, పేదలనుంచి 40 వేల ఎకరాల అసైన్డ్ భూములు గుంజుకొన్నారు. అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి ఆ భూములను 22(ఏ) నుంచి తొలగించి హస్తగతం చేసుకున్నారు. నకిలీ మద్యం మహమ్మారిని రాష్ట్రంమీదకు వదిలి జనం సొమ్మును, ఆయురారోగ్యాలను గుల్లచేసారు.

గత పాలకుల ఏలుబడిలో ఎగబాకిన నకిలీ మద్యం అమ్మకాల మూలంగా చుట్టుముట్టిన నానా రోగాలు, పడిపోయిన కుటుంబ ఆదాయాలు గడచిన ఐదేళ్లలో రూ.3.5 లక్షల కోట్ల మేరకు ప్రజానీకానికి నష్టం వాటిల్లినట్లు, విషతుల్యమైన మద్యం కారణంగా ఎన్నో తాళిబొట్లు తెగిపోయాయన్నది కాదనలేని వాస్తవం. ప్రభుత్వ మందు మాయల కారణంగా రూ.18 వేల కోట్లకు పైగా రాష్ట్రాదాయాన్ని కోల్పోవాల్సి వచ్చిందని సీఎం చంద్రబాబు సైతం ప్రకటించారు. మద్యం సరఫరా సంస్థలనుంచి రూ.3,113 కోట్ల వరకు కమిషన్లు దండుకొన్నట్టు సమాచారం. గత ప్రభుత్వంలో జరిగిన భూదోపిడీ, అవినీతి, నకిలీ మద్యంపై ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టీడీపీ, జనసేన పెద్దఎత్తున పోరాటమే చేశాయి. అధికారంలోకి వస్తే వైసీపీ నేతల అవినీతిని కక్కిస్తామని, బాధ్యులను బోను ఎక్కిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. అవినీతి, భూదోపిడిపై విసిగిపోయిన ప్రజలు కూటమికి ఎన్నికల్లో బ్రహ్మరథం పట్టారు. గతపాలకుల జమానాలో జరిగిన అవినీతి బయటకొస్తుందని, అవినీతిపరుల భరతం పడతారనీ భావించారు. ప్రకృతి వనరుల విధ్వంసం, ప్రజాధనం ఎలా దుర్వినియోగం చేశారో చెప్పడానికి గత ప్రభుత్వ పాలనే ఉదాహరణ. తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం పర్యావరణానికి విఘాతం కలిగిస్తూ సాగించిన అరాచకం వర్ణించలేనిది. ప్రజాధనం అంటే బాధ్యతలేని, ప్రజలంటే లెక్కలేని, ప్రజాస్వామ్యమంటే భయంలేని పాలకులు ప్రభుత్వ సొమ్ము రూ.కోట్లు కుమ్మరించి, వ్యక్తిగత విలాసాల కోసం ప్యాలెస్‌లు నిర్మించుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలవుతోంది. ప్రభుత్వం ఇంతవరకు అవినీతిపరులపై చర్యలకు ఉపక్రమించలేదని.. గత పాలకుల జమానాలో జరిగిన భూదోపిడి, అవినీతి, అక్రమాలపై, దారుణాలపై గుండెలు బాదుకొన్న కూటమి నేతలు ఇప్పుడు ఏమి తేల్చారని, ఉక్కుపాదం మోపకుండా ఎందుకు అవినీతిపరులను ఉపేక్షిస్తున్నారని ప్రజలూ ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ముందున్న కీలక లక్ష్యం లక్షల కోట్ల ప్రజాధనాన్ని ఆబగా దిగమింగిన బడా నేరగాళ్ల భరతం పట్టడం మొదటిది కావాలి.

**- నీరుకొండ ప్రసాద్.**

# కళాశాల చదువుకు కొత్త సొబగు!

## ఆధునిక సంస్కరణలతో ఇంటర్ విద్య బలోపేతం

ప్రతి విద్యార్థి భవిష్యత్‌కు ఇంటర్ విద్య అత్యంత కీలకమైనది. అయితే, వైసీపీ పాలనలో జూనియర్ కళాశాలలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఈ పరిస్థితిని మార్చేందుకు కృషి చేస్తోంది. జూనియర్ కళాశాలలను పునరుద్ధరించి, కొత్త జీవనశక్తిని తీసుకురావడానికి ప్రభుత్వం ఒక్కో అడుగు వేగంగా వేస్తోంది. ఈమేరకు రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యలో కీలకమైన మార్పులు జరగనున్నాయి. ఇంటర్మీడియట్ కళాశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు కూటమి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. కొత్త విద్యా సంవత్సరం నుంచి ఎంబైపీసీ అనే కోర్సును ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇది ఎంపీసీ, బైపీసీ సమ్మిళితంగా ఉండే ప్రత్యేక కోర్సుగా రూపొందించారు. తద్వారా విద్యార్థులు ఇంజనీరింగ్, మెడిసిన్ కోర్సుల కోసం మరో అదనపు అవకాశాన్ని పొందనున్నారు.

### ఎంబైపీసీ- విద్యార్థులకు విస్తృత అవకాశాలు

ఇంతకాలం ఎంపీసీ విద్యార్థులకు గణితం తప్పనిసరిగా ఉండే కారణంగా మెడిసిన్ అవకాశం లేకుండా పోయేది. అలాగే, బైపీసీ విద్యార్థులకు బయాలజీ ఉన్నా గణితం లేక ఇంజనీరింగ్ సాధ్యమయ్యేది కాదు. అయితే ఎంబైపీసీ ద్వారా విద్యార్థులు ఇంజనీరింగ్, మెడిసిన్ రెండింటిలో ఏదైనా కోర్సును ఎంచుకునే అవకాశాన్ని పొందగలరు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఈ కోర్సును అందుబాటులోకి తేవడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి.

### ఇంటర్మీడియట్ విద్యలో కీలక మార్పులు

సబ్జెక్టుల కాంబినేషన్‌లో మార్పులు:

ఇప్పటి వరకు ఇంటర్ విద్యార్థులు ఆరు సబ్జెక్టులు చదవాల్సి వచ్చేది. ఇకపై ఐదు సబ్జెక్టుల విధానం అమల్లోకి రానుంది. ఇంగ్లీష్ తప్పనిసరి, తెలుగు లేదా సంస్కృతం ఆప్షనల్ ఉంటుంది. మిగిలిన మూడు కోర్ సబ్జెక్టులను విద్యార్థులు తమ ఆసక్తి మేరకు ఎంచుకోవచ్చు.

### సైన్స్ గ్రూపుల మార్పులు

ఎంపీసీలో గణితాన్ని ఇకపై ఒకటిగానే లెక్కిస్తారు. బైపీసీలో బోటనీ, జువాలజీని కలిపి బయాలజీగా మార్చారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ మార్కులలో మార్పులు చేసి, గణితానికి తగ్గించి వాటికి పెంచారు. ప్రాక్టికల్ పరీక్షల మార్కులను 60కి పెంచారు. మొత్తం 1000 మార్కుల విధానం కొనసాగనుంది.

### ఎన్‌సీఈఆర్టీ సిలబస్ అమలు

విద్యార్థులపై భారం తగ్గించేందుకు ఎన్సీఈఆర్టీ సిలబస్‌ను పూర్తిగా అమలు చేయనున్నారు. జెఈఈ, నీట్‌వంటి పోటీ పరీక్షలకు ప్రత్యేకంగా సమయాన్ని కేటాయించనున్నారు.

### ఫెయిలైన విద్యార్థులకు సులభతరం

ఎంబైపీసీ చదివిన విద్యార్థి గణితంలో ఫెయిలైనా, ఆప్షనల్ సబ్జెక్టులో పాస్ అయితే ఇంటర్ ఉత్తీర్ణత పొందగలరు. బయాలజీలో ఫెయిలైనా, అదనపు సబ్జెక్టులో పాస్ అయితే సర్టిఫికెట్ లభిస్తుంది.

### జగన్‌రెడ్డి పాలన - అథ:పాతాళానికి విద్యా ప్రమాణాలు

జగన్‌రెడ్డి పాలనలో విద్యను పూర్తిగా నిర్వీర్యం చేశారు. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం 3వ స్థానంలో ఉన్న రాష్ట్రాన్ని 19వ స్థానానికి దిగజార్చారు. జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో విద్యారంగంలో తీసుకువచ్చిన నిర్ణయాలు అన్నీ నిర్లక్ష్యపు, అవివేకపు విధానాలే. మండలానికి రెండు జూనియర్ కళాశాలలంటూ హడావుడిగా హైస్కూళ్లల్లో ఇంటర్మీడియట్ కలిపి విద్యార్థులతో ఆడుకున్నాడు. భవనాలు లేవు. ల్యాబ్‌లు లేవు. సిబ్బంది లేరు. కానీ తన మూర్ఖపు పద్ధతులతో హైస్కూళ్లలో ఇంటర్మీడియట్ కలిపి విద్యార్థుల జీవితాలతో పనికిమాలిన ప్రయోగాలు చేశారు. ప్రచార్భాటం కోసం రాష్ట్రవ్యాప్తంగా 504 హైస్కూల్ ప్లస్‌లు అంటూ మరో మాయ చేశారు. కానీ వాటిలో సరాసరిన 13మంది చొప్పున మాత్రమే ఉండేవారు. అసలు కొన్నిచోట్ల సున్నా ప్రవేశాలు. బోధనకు లెక్చరర్లను నియమించకుండా ఉపాధ్యాయులకు ఇంక్రిమెంట్ ఇచ్చి విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన దుర్మార్గుడు జగన్. కనీసం ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు సైతం ఇవ్వలేదు. భవనాలు, ల్యాబ్‌లు సౌకర్యం కల్పించలేని జగన్‌రెడ్డి మళ్లీ తానో విద్య సంస్కర్తలాగా ప్రకటించుకున్నాడు. విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని నిలిపివేసి వాళ్ల నోటిదగ్గర కూడు లాక్కున్న దుర్మార్గుడు. బాలికలకు ప్రత్యేకం అన్నాడు కానీ కనీసం సౌకర్యాలు కల్పించకుండా గాలికి వదిలేశాడు. ఎంపీసీ, బైపీసీలాంటి గ్రూపులకు ల్యాబ్‌లు ఏర్పాటు చేయకుండా సమీపంలోని జూనియర్ కళాశాలలు, ల్యాబ్‌లకువెళ్లి ప్రయోగాలు చేసుకోవాలంటూ విద్యార్థుల కర్మకు వదిలేసి వాళ్ల చేత సిగ్గులేకుండా పొగిడించుకునేవాడు.

### విద్యావంతుడి నాయకత్వంలో విశిష్ట సంస్కరణలు

కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన మరుక్షణం నుంచే విద్యా సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ చొరవతో గత ప్రభుత్వం నిలిపివేసిన ఇంటర్ విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకాన్ని తిరిగి ప్రారంభించారు. దీంతో విద్యార్థులకు మరింత పోషకాహారం అందుతోంది. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఏపీ మోడల్ స్కూళు ,, కస్తూరిబా గాంధీ విద్యాలయాలు, హైస్కూలు ప్లస్ స్కూళ్లలో విద్యనభ్యసిస్తున్న రెండు లక్షలమందికి పైగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, స్కూల్ బ్యాగులను పంపిణీ చేసింది.

మన బడి –మన భవిష్యత్ పథకం కింద రాష్ట్రంలో 447 కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.169.69 కోట్లను విడుదల చేసింది. ప్రైవేట్ కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఐఐటీ, నీట్‌వంటి పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ అందిస్తూ విద్యార్థులను ఉన్నత విద్యలో ముందుకు తీసుకెళ్లే ప్రణాళికను అమలు చేస్తోంది. బోధనా విధానాన్ని మెరుగుపర్చేందుకు జిల్లా, రీజనల్‌స్థాయిలో అకడమిక్ గైడెన్స్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎజిఎంసి)లను ఏర్పాటు చేశారు. చిత్తూరు జిల్లాలోని 25, గుంటూరు జిల్లాలోని 4 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఐఐటి మద్రాసు సహకారంతో 'విద్యాశక్తి' పైలట్ ప్రాజెక్టును అమలు చేస్తున్నారు. దీనిద్వారా మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీషు సబ్జెక్టుల విద్యార్థుల సామర్థ్యం పెంపుదలకు కృషిచేస్తున్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఇంటర్ విద్యలో సీబీఎస్ఈ మరియు ఎన్సీఈఆర్టీ బోధన విధానాన్ని అమలు చేయడంతో విద్యార్థులకు జాతీయస్థాయి మౌలిక విద్య అందుబాటులోకి రానుంది. ఇంటర్మీడియట్ విద్యలో సమగ్ర మార్పులకు శ్రీకారం చుడుతూ రెగ్యులర్ ఇంటర్ కోర్సులతోపాటు వృత్తి విద్యా కోర్సుల్లోనూ అభివృద్ధికి దారితీసే చర్యలు మొదలయ్యాయి.

విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు 'సంకల్ప్' కార్యక్రమం ప్రవేశపెట్టి విద్యా ప్రమాణాలను మెరుగుపరచేందుకు కృషి జరుగుతోంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలను మండలస్థాయిలో ఏర్పాటు చేసి మరింత మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే ప్రణాళికకు శ్రీకారం చుట్టారు. పోటీ పరీక్షల సన్నద్ధత కోసం ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక మెటీరియల్ అందిస్తున్నారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ప్రైవేట్ కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నాణ్యతా ప్రమాణాలను పెంచే చర్యలు మొదలయ్యాయి. ఇంటర్ విద్యార్థులకు మెంటర్‌షిప్ ప్రోగ్రామ్ అమలు చేసి వెనుకబడిన విద్యార్థులకు వ్యక్తిగత దృష్టి పెట్టే విధానాన్ని అమల్లోకి తెస్తున్నారు. సైన్స్ సబ్జెక్టులకు ఎన్‌సీఈఆర్టీ మరియు పోటీ పరీక్షల అనుసారంగా సిలబస్ రూపొందించి, ఇంటర్ 2వ సంవత్సరం పాఠ్యాంశాలను తగ్గించే ఆలోచన చేస్తున్నారు. రాష్ట్ర విద్యార్థులను జాతీయస్థాయిలో అత్యుత్తమ స్థానానికి తీసుకెళ్లే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం విద్యా సంస్కరణలతో వేగంగా అడుగులేస్తోంది. గత ఐదేళ్ల అస్తవ్యస్త పాలనలో దెబ్బతిన్న ఇంటర్మీడియట్ విద్యను పునరుద్ధరించేందుకు ప్రభుత్వ కళాశాలల్లో వసతులను మెరుగుపరిచే చర్యలు చేపడుతోంది.

# తెలుగు రాష్ట్రాలను భయపెడుతున్న గులియన్ బారే సిండ్రోమ్

## •చేతులు, కాళ్ళలో జలదరింపు, తిమ్మిరి... కండరాల బలహీనత

## •శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది... 25 ఏళ్ల మహిళ మృతి




ప్రస్తుతం దేశంలో ఎక్కువగా వినిపిస్తున్న పేరు "గులియన్ బారే సిండ్రోమ్.." ఇది ఒక నరాల వ్యాధి. ఈ వ్యాధిని మొదటగా మహారాష్ట్రలో గుర్తించారు. ఈ వ్యాధితో తెలంగాణలో తొలి మరణం నమోదు అయింది. తాజాగా ఈ వ్యాధి ఏపీలో కూడా ప్రవేశించింది. ఏపీలో ప్రస్తుతం 17 గులియన్ బర్రె సిండ్రోమ్ (జీబీఎస్) కేసులు నమోదు అయ్యినట్లు ఏపీ వైద్యారోగ్య శాఖ ప్రకటించింది. "గులియన్ బారే సిండ్రోమ్.." ఇంతవరకూ తెలుగు రాష్ట్రాలకు పరిచయమే లేని ఈ పేరు.. ఇప్పుడు వణికిస్తోంది. ఇప్పటికే తెలంగాణలో ఒకరిని బలి తీసుకున్న ఈ వ్యాధి.. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోనూ టెన్షన్ పుట్టిస్తోంది. వరుసగా నమోదవుతున్న కేసులు.. అధికారులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అసలేంటి ఈ "గులియన్ బారే సిండ్రోమ్"? కరోనాలా ఇది కూడా అంటు వ్యాధా..? వైద్యులు ఏమంటున్నారు..?

ఇప్పటికే బర్డ్‌ఫ్లూతో టెన్షన్ పడుతున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను మరింత భయపెడుతోంది గులియన్ బారే సిండ్రోమ్ మరో మాయదారి రోగం. ఇప్పటికే మహారాష్ట్ర, కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో కలవరం పుట్టిస్తున్న ఈ జీబీఎస్.. ఇటీవల తెలంగాణకు ఎంటర్ అయింది. సిద్దిపేట జిల్లా సీతారాంపల్లికి చెందిన 25 ఏళ్ల మహిళ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ మృతి చెందింది. ఇప్పుడు తాజాగా ఈ వ్యాధి ఏపీలో కూడా ప్రవేశించింది. ఏపీలో ప్రస్తుతం 17 గులియన్ బర్రె సిండ్రోమ్ (జీబీఎస్) కేసులు నమోదు అయ్యినట్లు ఏపీ వైద్యారోగ్య శాఖ ప్రకటించింది. విజయనగరం, విజయవాడ, అనంతపురంలో ఒక్కో కేసు చొప్పున నమోదు కాగా, కాకినాడలో 4, గుంటూరు, విశాఖలలో 5 చొప్పున జీబీఎస్ కేసులు నమోదయ్యాయి.


గుంటూరు జిల్లా జీజీహెచ్‌కు గులియన్ బారే సిండ్రోమ్ బాధితులు క్యూ కడుతున్నారు. ఇప్పటికే ఆసుపత్రిలో ఏడుగురు బాధితులకు చికిత్స కొనసాగుతోంది. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. గుంటూరు జిల్లాలో నాలుగు రోజుల్లోనే ఏడు జీబీఎస్ కేసులు నమోదయ్యాయి. కరోనా బాధితుల్లో ఎక్కువగా ఈ సిండ్రోమ్ కనిపిస్తోందని జీజీహెచ్ సూపరింటెండెంట్ తెలిపారు. అయితే ప్రజలు దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరంలేదన్నారు. కాళ్లు, చేతులు స్పర్శ కోల్పోయినట్టు అనిపిస్తే వెంటనే ఆస్పత్రికి రావాలని వైద్యాధికారులు సూచించారు. నాలుగు రోజుల్లో ఏడు కేసులు నమోదవడంతో ఏపీ ప్రభుత్వం కూడా అలర్ట్ అయింది. అయితే దీనిపై ఎవ్వరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు..హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు. గుంటూరు జీజీహెచ్‌కు వెళ్లిన కృష్ణబాబు.. న్యూరాలజీవార్డును పరిశీలించారు. చికిత్సకు అవసరమైన ఇమ్యూనోగ్లోబిన్ ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు.

ఈ వైరస్ పేరు గులియన్ బారే సిండ్రోమ్. దీని బారినపడిన వారికి ఒళ్లంతా తిమ్మిరిగా అనిపించడం, కండరాలు బలహీనంగా మారడం, డయేరియా, పొత్తి కడుపు నొప్పి, జ్వరం, వాంతులు కావడం లాంటి లక్షణాలు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. కలుషిత ఆహారం, నీటి ద్వారా ఈ బ్యాక్టీరియా సోకుతుంది. ఈ వ్యాధి ముఖ్యంగా పిల్లలు, వృద్ధులపైనే తీవ్ర ప్రభావం చూపుతుంది. నాడీ వ్యవస్థను ఈ వైరస్ దెబ్బతీస్తుంది. దీంతో రోగి పక్షవాతం బారిన పడతాడు. అయితే సకాలంలో వైద్యం అందితే ముప్పు ఉండదు. వ్యాధి సోకిన తొలి దశలోనే ఆస్పత్రిలో చేరితే.. 4 వారాల్లో కోలుకునే ఛాన్స్ ఉంటుంది. వ్యాధి ముదిరితే.. కోలుకోవడానికి దాదాపు 6 నెలలు పట్టొచ్చు. అత్యధిక శాతం మందిలో ఇన్‌ఫెక్షన్ మొదలైన ఒకటి రెండు వారాల తర్వాతే ఇది బయటపడుతుంది. అరుదుగా వాడే ఇన్ఫ్లూయెంజా, టెటనస్ టీకాల వంటివి కూడా గులియన్ బారే సిండ్రోమ్‌కు కారణం కావొచ్చు. అయితే, ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని..కరోనాలా ఇది అంటువ్యాధి కాదని వైద్యులు చెబుతున్నారు. చికిత్సతో నయం చేయవచ్చని భరోసా ఇస్తున్నారు. రోగనిరోధక శక్తిని నశింపచేసేలా జీబీఎస్ సిండ్రోమ్ విస్తరిస్తోందంటున్నారు వైద్యులు. అతిగా ఇన్ఫెక్షన్లు, వాక్సిన్‌లు, సర్జరీలు, ట్రామా, జన్యుపరంగానూ జీబీఎస్ వ్యాధి వచ్చే అవకాశం ఉందంటున్నారు. మరోవైపు, ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఉచిత చికిత్సను అందిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా 8 వేల వ్యాక్సీన్లను అందుబాటులో ఉంచినట్టు తెలిపిన వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. జీబీఎస్ బాధితులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.

మరోవైపు దేశవ్యాప్తంగా గుల్లెయిన్-బారే సిండ్రోమ్ కేసులు పెరుగుతున్నాయి. తాజాగా మహారాష్ట్రలో మరో రెండు కేసులు నమోదయ్యాయి. దీంతో జీబీఎస్ సంఖ్య 205కి చేరుకుందని ఆరోగ్య అధికారి ఒకరు తెలిపారు. ధృవీకరించిన కేసుల సంఖ్య 177, అందులో 20 మంది రోగులు వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. గుల్లెయిన్-బారే సిండ్రోమ్ కారణంగా దేశవ్యాప్తంగా మరణించిన వారి సంఖ్య 9కి చేరుకుంది. మహారాష్ట్రలో ఈ అరుదైన వ్యాధికి సంబంధించిన కేసులు ఎక్కువగా పూణే నుండి వచ్చాయి. అయితే, దేశ ఆర్థిక రాజధానిలో కొన్ని కేసులను గుర్తించారు. ముంబై ఆసుపత్రిలో 53 ఏళ్ల వ్యక్తి కూడా జీబీఎస్‌తో మరణించాడు.

# యూపీఎస్సీ ఇండియన్ ఎకనామిక్ సర్వీస్ 2025 నోటిఫికేషన్

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఇండియన్ ఎకనామిక్ సర్వీస్, ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్ ఎగ్జామినేషన్ 2025 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ విధానంలో మార్చి 4, 2025వ తేదీ సాయంత్రం 6 గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలి. ఈ ఏడాదికి ఇండియన్ ఎకనామిక్ సర్వీస్‌లో 12 పోస్టులు, ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్‌లో 35 పోస్టులు.. మొత్తం 47 పోస్టులను యూపీఎస్సీ భర్తీ చేయనుంది. ఎకనామిక్ సర్వీస్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తప్పనిసరిగా ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎకనామిక్స్, అప్లైడ్ ఎకనామిక్స్, బిజినెస్ ఎకనామిక్స్ లేదా ఎకనామెట్రిక్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలో ఉత్తీర్ణత పొంది ఉండాలి. అలాగే స్టాటిస్టికల్ సర్వీస్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తప్పనిసరిగా స్టాటిస్టిక్స్, మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్/ అప్లైడ్ స్టాటిస్టిక్స్ విభాగంలో డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీలో ఉత్తీర్ణత పొంది ఉండాలి. అభ్యర్థుల వయోపరిమితి ఆగస్టు 01, 2025 నాటికి తప్పనిసరిగా 21 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి. ఈ అర్హతలున్నవారు ఎవరైనా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభమయ్యాయి. దరఖాస్తు రుసుము కింద ప్రతి ఒక్కరూ రూ.200 చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపుల నుంచి మినహాయింపు ఉంటుంది. ఇక తుది గడువు ముగిసిన 7 రోజుల్లోపు అంటే మార్చి 5 నుంచి 11, 2025వ తేదీ వరకు అప్లికేషన్ ఎడిట్ చేసుకోవడానికి అవకాశం ఇస్తారు. అలాగే దరఖాస్తులను ఉపసంహరించుకోవడానికి కూడా ఈ ఏడు రోజుల్లోనే అవకాశం ఉంటుంది. రాత పరీక్ష, ఇంటర్వ్యూ లేదా పర్సనాలిటీ టెస్ట్ ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది. ప్రశ్నాపత్రం ఆబ్జెక్టివ్-టైప్ విధానంలో ఉంటుంది. ప్రతి తప్పు సమాధానికి నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది. యూపీఎస్సీ- ఐఈఎస్/ ఐఎస్ఎస్ఈ 2025 పరీక్ష జూన్ 20, 2025వ తేదీన నిర్వహిస్తారు.




# దశలవారీగా సమస్యల పరిష్కారం : గౌతుశిరీష



పలాస (చైతన్యరథం): దశల వారీగా సమస్యలు పరిష్కరిస్తానని పలాస ఎమ్మెల్యే గౌతుశిరీష హామీఇచ్చారు. పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలోని 16వవార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా ఇక్కడ గాంధీనగర్‌కు ఆనుకొని ఉన్న ఓంశాంతి ఆశ్రమం ఎదురుగా రోడ్‌లో, శ్మశానంవాటికకు వెళ్లడానికి దారి లేదని శిరీషకు వార్డు ప్రజలు వినతిపత్రం అంద జేశారు. శ్మశాన వాటికకు వెళ్లడానికి రోడ్డు కూడా లేదని వివరించారు. డ్రైనేజీలు, నీటి సమస్య లను ఆమె దృష్టికి తీసుకువచ్చారు.

# ఆదిత్యుని సన్నిధిలో నందమూరి రామకృష్ణ



అరసవల్లి (చైతన్యరథం): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు కుమారుడు నందమూరి రామకృష్ణ ఉదయం 4.30 గంటలకు దర్శించుకున్నారు. వారికి శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. వారికి స్వామివారి జ్ఞాపికను ఆలయ ఈవో వై.భద్రాజీ అందజేశారు. స్థానిక కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

# పట్టభద్రులంతా అభివృద్ధికి ఓటేయాలి : శిరీషదేవి



గంగవరం (చైతన్యరథం): పట్టభద్రులంతా అభివృద్ధికి ఓటేయాలని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబురమేష్, వంతల రాజేశ్వరి కోరారు. టీడీపీ మండలాధ్యక్షుడు పాము అర్జున్, కూటమి నాయకుల ఆధ్వర్యంలో వారంతా పర్యటించి టీడీపీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరాన్ని గెలిపించాలని కోరారు. జడేరు, గంగవరం, నెల్లిపూడి, పిడతమామిడి, మొల్లేరు గ్రామాల్లో పట్టభద్రులను కలిసి కూటమి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. టీడీపీ ఎన్నికల పరిశీలకులు దాడి రత్నాకర్, కూటమి నేతలు కనిగిరి రాంబాబు, కుంజం సిద్ధు, పుట్టపల్లి నీలాలమ్మ, వెంకటేశ్వర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్యకర్తలతో తరుచూ సమావేశమవుతా : అనిత



నక్కపల్లి (చైతన్యరథం): పార్టీ కార్యకర్తలతో తరచూ సమావేశమవుతానని మంత్రి వంగలపూడి అనిత అన్నారు. సారిపల్లిపాలెంలోని తన నివాసంలో నియోజకవర్గ సమన్వయ కమిటీ నాయకులు, యూనిట్ ఇన్చార్జులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం హామీల అమలుతోపాటు రాష్ట్రాభివృద్ధికి విశేష కృషి చేస్తుందన్నారు. ఈ విషయం ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కురందాసు నూకరాజు, లాలం కాశీనాయుడు, గింజాల లక్ష్మణరావు, అమలకంటి అబద్దం, జానకి శ్రీను తదితరులు పాల్గొన్నారు. మంగవరానికి చెందిన వైసీపీకి చెందిన నీటి సంఘం అధ్యక్షుడు, పలువురు డైరెక్టర్లు, నాయకులు మంత్రి అనిత సమక్షంలో టీడీపీలో చేరారు. గూటూరు రామగోవిందు, శివ, వెంకటరావు, బుజ్జి, గణేష్, రమణకు మంత్రి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

చైతన్యరథం

## భీమడోలులో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



భీమడోలు (చైతన్యరథం): ఈనెల 27వ తేదిన జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంని మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని టీడీపీ నేతలు కోరారు. శుక్రవారం గీతాంజలీ కళాశాలలో లెక్సిల్ కంపెనీ ఆధ్వర్యంలో జరిగిన జాబ్‌మేళాను ప్రారంభించారు. ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు, ఏలూరు జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, వట్టి పవన్ కుమార్, తెలుగుదేశంపార్టీ పరిశీలకులు వి.ఎస్ మూర్తీయాదవ్, కూటమి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కూటమి అభ్యర్థికి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎన్డీయే కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని రాబోయే రోజుల్లో రాష్ట్రం అన్ని విధాలుగా ముందుకు సాగుతుందన్నారు.

## ఎన్డీయే కూటమి అభ్యర్థిని గెలిపించండి : బొడ్డు



రాజనగరం (చైతన్యరథం): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ప్రచారంలో భాగంగా రుడా చైర్మన్ మరియు రాజనగరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి ఆదేశాలకు అనుగుణంగా కోరుకొండ మండలంలోని దోసకాయలపల్లి, నరేంద్రపురం గ్రామంలో గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి ఎన్డీయే కూటమి అభ్యర్థి అయిన పేరాబత్తుల రాజశేఖర్‌కి మొదట ప్రాధాన్యత ఓటేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎన్డీయే కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, రాబోయే రోజుల్లో రాష్ట్రాభివృద్ధి చేందడం ఖాయమన్నారు. ఈనెల 27వ తేదిన జరగబోయే ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజనగరం నియోజకవర్గ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పరిశీలకులైన మాజీ గిరిజన కార్పొరేషన్ చైర్మన్ ఎం.వి.వి ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి తనకాల నాగేశ్వరావు, రాష్ట్ర కార్యదర్శి కంటే కేశవరావు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం ద్వారానే అభివృద్ధి సాధ్యం : ఆరిమిల్లి



తణుకు (చైతన్యరథం): ఉమ్మడి ఉభయ గొదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం గెలుపుకు కృషి చేయాలనీ అరకు పార్లమెంట్ అధ్యక్షులు రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, తణుకు నియోజకవర్గ శాసన సభ్యులు ఆరిమిల్లి రాధ కృష్ణ కోరారు. తణుకు నియోజకవర్గం అత్తిలి మండలం బుల్లిపాడు, గుమ్మంకోట గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని నిరుద్యోగులు ఉపాధి ఉద్యోగుల అవకాశాలు కూటమి ప్రభుత్వం ద్వారానే సాధ్యమని, ప్రజా సమస్యలు పరిష్కరించే సత్తా కూటమి ప్రభుత్వానికే ఉందని అందుకే కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు మేధావులు గెలిపించాలని కోరారు. నిరుద్యోగులకు ఉపాధి,ఉద్యోగ అవకాశాల కోసం విజన్ ఉన్న నాయకుడు మన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దావూస్ వెళ్లి కంపెనీలతో మాట్లాడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని కోరి రాష్ట్రానికి తీసుకొస్తున్నారని అన్నారు. ఉద్యోగస్తుల సమస్యలు రైతులు నిరుద్యోగుల పరిష్కారం కావడానికి కూటమి ప్రభుత్వంపై నమ్మకం ఉంచి కూటమి అభ్యర్థి అయిన పెరబత్తుల రాజశేఖరం ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్‌తో పాటు నియోజకవర్గ శాసన సభ్యులు ఆరిమిల్లి రాధ కృష్ణ వెంట మండల అధ్యక్షులు రాజశేఖర్ బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## పేరాబత్తుల రాజశేఖరానికి ఓటేయండి : ముప్పిడి వెంకటేశ్వరరావు



తాళ్లపూడి (చైతన్యరథం): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరాన్ని గెలిపించాలని కోరుతూ తాళ్లపూడి మండలంలో కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. అన్నదేవరపేట, గజ్జరం, పోచవరం, ప్రక్కిలంక, వేగేశ్వరపురం, పెద్దేవం, మలకపల్లి గ్రామాల్లోని పలు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, సచివాలయాలు, పాఠశాలల్లోని ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పట్టభద్రులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. క్షేత్రస్థాయిలో నాయకులను కలిసి రాజశేఖర్ గెలుపునకు కృషి చేయాలన్నారు. కూటమిపార్టీ అమలు చేస్తున్న పథకాలు, చేసిన అభివృద్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పరమేశ్వరరావు, నాయకులు జీవీ ప్రసాద్, సత్యేంద్ర, కౌరారు వెంకట్రావు, కాకర్ల వంశీ, కె, కోట్నీసు, నామా కొండబాబు పాల్గొన్నారు.

## కూటమి అభ్యర్థిని గెలిపించాలని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ప్రచారం

బుట్టాయగూడెం (చైతన్యరథం): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి కృషి చేయాలని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పిలుపునిచ్చారు. బుట్టాయగూడెం మండలం బూసరాజుపల్లిలో టీడీపీ క్యాంప్ కార్యాలయం వద్ద ట్రైకార్ రాష్ట్ర చైర్మన్ బొరగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో కూటమి పార్టీల నేతలు, బూత్ ఇన్చార్జిలతో శక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రగతికి మెరుగైన కృషి చేస్తుందని వివరించారు. కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటును వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచార కరపత్రాలను ప్రదర్శించారు. అనంతరం బుట్టాయగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఎన్నికల పరిశీలకుడు పుచ్చా విజయకుమార్, నియోజకవర్గ పరిశీలకుడు అనపర్తి వెంకటనారాయణ పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలి



గన్నవరం (చైతన్యరథం): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించుకోవాలని ప్రభుత్వ విప్, గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావ్ పిలుపునిచ్చారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు గురించి దేశంలో, రాష్ట్రంలో చర్చించుకునే స్థాయిలో భారీ మెజారీటీ సాధించాలని కోరారు. శుక్రవారం గన్నవరం పట్టణంలోని ప్రవంతి పాఠశాలలో కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్(డెమొక్రటిక్) ఆధ్వర్యంలో ప్రైవేట్ ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రతికూల పరిస్థితుల్లో కూడా గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిని గెలిపించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గన్నవరం నియోజకవర్గ ఓటర్లు విజ్ఞులని పెద్దల సభకు ఆలపాటి రాజేంద్రప్రసాద్ లాంటి వ్యక్తులను కచ్చితంగా పంపుతారని ధీమా వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల కన్నా గొప్పవారు ఎవరు లేరని ఆలపాటి గెలుపు ద్వారా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ పోటీలో లేనప్పటికి ఈ ఎన్నికలను తేలికగా తీసుకోకూడదన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడు నెలల కాలంలో ఈ ఎన్నికలు జరుగుతున్నాయని, కూటమి పాలనకు ఈ ఎన్నికలు ఒక పరీక్ష అని తెలిపారు. రాష్ట్రానికే తలమానికంగా మల్లవల్లి పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. గన్నవరం అభివృద్ధి అజెండాగా తాను పనిచేస్తున్నానని స్పష్టం చేశారు. నిరుద్యోగులకు రానున్న కాలంలో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయిని స్పష్టం చేశారు. గన్నవరం పట్టణంలో ఎన్టీఆర్, మహాత్మా గాంధీ నూతన విగ్రహాలను ఏర్పాటు చేస్తామని అలాగే ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసి సుందరీకరణ పనులను చేపట్టేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. గన్నవరం అనగానే గన్నవరం అభివృద్ధి తెలియచెప్పేలా హెచ్‌సిఎల్, ఎయిర్పోర్ట్ లాంటి అభివృద్ధిని ప్రజలకు చూపించాలని మీడియా వారిని ఈ సందర్భంగా కోరారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి దేశంలో రాష్ట్రంలో చర్చించుకునే స్థాయిలో భారీ మెజారీటీ సాధించాలని కోరారు.

## పట్టభద్రులంతా 'ఆలపాటి'కి పట్టం కట్టాలి : రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి



కైకలూరు (చైతన్యరథం): ఉమ్మడి కృష్ణా.. గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా బరిలో నిలిచిన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు పట్టభద్రులంతా ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో పట్టం కట్టాలని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆలపాటికి మద్దతుగా కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌తో కలిసి గురుమూర్తి పట్టణంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కాలేజీలు, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గురుమూర్తి మాట్లాడుతూ... విద్యావంతుడు, సాంకేతిక విద్యాశాఖ మంత్రిగా, తెనాలి శాసనసభ్యుడిగా గతంలో పనిచేశారని, పట్టభద్రుల సమస్యలపై ఆయనకు ఎంతో అవగాహన ఉందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, బీజేపీ పెద్దలు బలపరిచిన ఆలపాటిని గెలిపించి శాసనమండలికి పంపిస్తే అక్కడ పట్టభద్రుల వాణి వినిపిస్తారన్నారు. పార్టీ నియమాలు, సిద్ధాంతాలకు కట్టుబడిన వ్యక్తి ఆలపాటి అని, కూటమి నేతలు ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి గెలుపునకు బాధ్యత వహించాలన్నారు. ఓటర్ల నమోదులో కూటమి నేతల చొరవ అభినందనీయమని, నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, పట్టభద్రులంతా మొదటి ప్రాధాన్యత ఓటును ఆలపాటికి వేసి గెలిపించాలని కోరారు. న్యాయశాఖ, విద్యా శాఖ, ప్రజా సమస్యలపై మంచి అనుభవం ఉన్న ఇలాంటి వ్యక్తి ఆలపాటి రాజాను శాసనమండలికి పంపించటం చాలా అవసరమని గురుమూర్తి పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ఆర్యవైశ్య వెల్ఫేర్ కార్పోరేషన్ డైరెక్టర్ పైడిమర్రి మాల్యాద్రి, నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు మెంటే పార్థసారథి, నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, కో- కన్వీనర్ తేరా రమేష్ బాబు, మండల టీడీపీ అధ్యక్షులు పెన్మేత్స త్రినాథ్‌రాజు, జిల్లా టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి పోలవరపు లక్ష్మీరాణి, రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వహక కార్యదర్శి పూల రామచంద్రరావు(రాజీ), తెలుగుదేశం పార్టీ నాయకులు వీరాబత్తిన సుధ, పట్టణ టీడీపీ అధ్యక్షులు యమ్.డి.జానీ, మండల జనసేనపార్టీ అధ్యక్షులు ముమ్మనేని నాగ మల్లేశ్వరరావు, కైకలూరు -2 యమ్.పి.టి.సి మంగినేని రామకృష్ణ, తోట లక్ష్మీ, పెరుగు నాగరాజు, పుప్పాల సూర్యప్రకాశరావు, తెంటు నాగేశ్వరరావు, పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి ఆచంట వినయ్, ఉపాధ్యక్షులు పడమట వాసు, గంగుల ఏసురాజు, వేములపల్లి కారుణ్య, దైతగుంజ రామస్వామి, సయ్యద్ భాషిద్, రసూల్ ఖాన్, హబీబ్, తులసి పూర్ణ, ఎన్డీఏ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్యమే ఎన్డీయే కూటమి లక్ష్యం : ఎంపి కేశినేని శివనాథ్



విజయవాడ (చైతన్యరథం): రాష్ట్రంలోని ప్రజలందరీ సంక్షేమం, అభివృద్ధితో పాటు ఆరోగ్య సంరక్షణ కూడా ఎన్డీయే కూటమి లక్ష్యమని, ఆ విధంగానే కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీ కేశినేని శివనాథ్ శుక్రవారం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను అందజేశారు. నలుగురు లబ్ధిదారులకు అందజేశారు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని నలుగురికి రూ.4,71,894లు మంజూరయ్యాయి. ఈ లబ్ధిదారుల్లో తిరువూరు నుంచి ముగ్గురు, విజయవాడ వెస్ట్ నుంచి ఒకరు ఉన్నారు. యాక్సిడెంట్ కారణంగా బ్రెయిన్ ఆపరేషన్ చేయించుకున్న సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.2,72,174 లు చెక్కును తిరువూరు నియోజకవర్గం ఎ.కొండూరు మండలం గొల్లమందల గ్రామానికి చెందిన బోజెడ్ల ఉషారాణికి సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.2,72,174ల చెక్కును ఎంపీ కేశినేని శివనాథ్ అందజేశారు. అలాగే తిరువూరు పట్టణంలో బెస్తాబజార్‌కి చెందిన మునుకుంట్ల శ్రీనుకి సీఎంఆర్ఎఫ్ కింద రూ.1,43,502లు, గంపలగూడెం మండలం దుందర్లపాడు గ్రామానికి చెందిన కలసాని లక్ష్మీకి సీఎంఆర్ఎఫ్ కింద రూ.26,218లు మంజూరైయ్యాయి. తిరుపూరు నుంచి చెక్కులు అందుకోవటానికి రాలేకపోయిన మునుకుంట్ల శ్రీను, కలసాని లక్ష్మీకి వారి చెక్కులను తిరువూరు నాయకులు అందజేసి లబ్ధిదారులకు అందజేయాల్సిందిగా ఎంపి కేశినేని శివనాథ్ ఆదేశించారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం 50వ డివిజన్ గొల్లపాలెం గట్టు క్వారీ ప్రాంతానికి చెందిన షేక్ సోహైల్‌కి సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.30,000 చెక్కును ఆమె కుమారుడు షేక్ షాబాషి అందుకున్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ చెక్కులతోపాటు సీఎం చంద్రబాబు పంపించిన సందేశ పత్రాలను కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు చెరుకూరి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులను గౌరవిస్తుంది : వెనిగండ్ల రాము



గుడివాడ (చైతన్యరథం): కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఉపాధ్యాయులు మద్దతుగా నిలవాలని, మంచి వ్యక్తిని శాసనమండలిలోకి పంపితే ప్రజలకు మేలు జరుగుతుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో, కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేస్తూ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శుక్రవారం విస్తృత ప్రచారం చేశారు. గుడివాడ పట్టణంలోని ఏకేటీపీ, గాంధీ, ఎస్.పీ.ఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో పర్యటించిన ఎమ్మెల్యే రాము.... కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాకు మద్దతుగా కరపత్రాలు పంపిణీ చేస్తూ... ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆయనకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులను అనేక ఇబ్బందులకు గురిచేసిందన్నారు. కనీసం ఒకటో తేదీన జీతాలు కూడా అందించలేకపోయిందనీ గుర్తు చేశారు. నాడు మద్యం దుకాణాల వద్ద గురువులకు విధులను కేటాయించే పరిస్థితి ఉండేది అన్నారు. వివిధ యాప్‌లతో టీచర్లను ఉక్కిరిబిక్కిరి చేసేవారనీ, పాఠశాలల్లో మరుగుదొడ్లు పరిశుభ్రత బాధ్యత కూడా వారిపై పెట్టి చులకనగా చూసేవారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి మారిందనీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఉపాధ్యాయులను గౌరవిస్తూ పాలన సాగిస్తున్నారనీ ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ లాంటి మంచి వ్యక్తి శాసనమండలిలోకి అడుగుపెడితే ప్రజలకు మరింత మేలు జరుగుతుందని ఎమ్మెల్యే రాము అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు పట్టభద్రులందరూ మద్దతుగా నిలవాలని ఎమ్మెల్యే రాము పిలుపునిచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నేతలు పాల్గొన్నారు.

## సకలజనుల స్వేచ్ఛ... ఎన్డీయే కూటమి ధ్యేయం : ఆళ్ళ




గన్నవరం (చైతన్యరథం): ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టబద్రుల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కి గన్నవరం నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీ తీసుకువచ్చి గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావుకు మరింత బలాన్ని ఇవ్వాలని గన్నవరం నియోజకవర్గ టీడీపీ పోల్ మేనేజ్మెంట్ కోఆర్డినేటర్, నాగార్జునసాగర్ ఎడమకాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు అన్నారు. శుక్రవారం బాపులపాడు మండలం వేలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రాడ్యుయేట్ ఓటర్లుగా ఉన్న ఉపాధ్యాయులను బాపులపాడు మండల ప్రజా ప్రతినిధులు, టీడీపీ నాయకులు కలిసి కరపత్రాలను అందజేసి కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ప్రథమ ప్రాధాన్యతా ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా గన్నవరం నియోజకవర్గ పోల్‌మేనేజ్‌మెంట్ కోఆర్డినేటర్, నాగార్జునసాగర్ ఎడమకాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ... గత వైసీపీ పాలనలో విద్యారంగం గడ్డుకాలాన్ని ఎదుర్కొందని, ఉపాధ్యాయులను బ్రాందీషాపుల వద్ద కాపలా పెట్టి వారిని అవమానపరిస్తే ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు 100 కోట్లు నిధులు విడుదల చేయటమే కాకుండా గురుపూజోత్సవం అధికారికంగా నిర్వహించి 700 కోయభారతి టీచర్ పోస్టులు భర్తీ చేసి ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు 1వ తేదీనే జీతాలు అందేలా ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకుందని రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులందరు ఏకపక్షంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఓటు వేసి శాసనమండలిలో తమ సమస్యలు పరిష్కరించటానికి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## విద్యావంతుల్లారా ఆలపాటిని గెలిపించండి

● కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ పిలుపు




విజయవాడ (చైతన్యరథం): విద్యావంతుల్లారా ఈనెల 27వ తేదిన జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కి మొదటి ప్రాధాన్యత ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి, మచిలీపట్నం నియోజకవర్గ పరిశీలకులు లుక్కా సాయిరాం ప్రసాద్‌గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో లుక్కా మాట్లాడుతూ... ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టబుద్రుల శాసనమండలి ఎన్నికకు కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ని విద్యావంతులైన ఉపాధ్యాయులు, ఉద్యోగులు, నిరుద్యోగ యువత అందరూ మద్దతు ఇచ్చి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. గత జగన్ రెడ్డి పాలనలో పట్టభద్రులైన నిరుద్యోగులకు ఒక్క ఉద్యోగం కూడా కల్పించలేదనే విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు 80% వరకు పట్టభద్రులై ఉంటారని, వారికి పీఆర్సీ 43.5% చంద్రబాబు ఇస్తే, దాన్ని జగన్‌రెడ్డి రివర్స్ పిఆర్‌సితో 23%కు కుదించి ఉద్యోగులను ఆర్థికంగా కుదేలు చేశాడు అన్నారు. వారు దాచుకున్న జిపిఎఫ్, పెన్షన్ల సొమ్మును ఇతర అవసరాలకు జగన్‌రెడ్డి వారికి తెలియకుండా దారి మళ్లించి మోసం చేశాడు అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల వారి ఆరోగ్య అవసరాలకు, పిల్లలు చదువులకు, వారి పిల్లల వివాహలకు, వారి కుటుంబ అవసరాలకు వాడుకోవటానికి వీలు లేకుండా జగన్‌రెడ్డి దగా చేశాడు అన్నారు. విద్య నేర్పే గురువులు, సమాజంలో అత్యంత పూజ్యానీయులైన ఉపాధ్యాయులను బ్రాందీ షాపులు దగ్గర తాగుబోతులను క్యూ లైన్ లో పంపించే డ్యూటీలు వేసి, మద్యాన్ని అమ్మించి, గురువుల ప్రతిష్టను జగన్ రెడ్డి దిగజార్చాడు అన్నాడు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరుకు ఫేస్ యాప్‌ను ప్రవేశపెట్టి, అవి సరిగ్గా పనిచేయకపోయినా, ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టి జగన్‌రెడ్డి సైకో మనస్తత్వాన్ని ప్రదర్శించాడు అన్నారు. గత జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రాన్ని దోచి, అప్పులపాలు చేసినప్పటికీ, కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడు నెలల కాలంలోనే ప్రతి నెల ఒకటో తారీకున ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లు, పెన్షన్ దారులు అందరికీ సొమ్మును వారి ఖాతాలో జమవుతున్న విషయం గమనించమని లుక్కా కోరారు.

## నిరుద్యోగయువత, ఉపాధ్యాయులు, మేథావుల వాణిని ఆలపాటి చట్టసభల్లో బలంగా వినిపిస్తారు : మాజీమంత్రి ప్రత్తిపాటి



చిలకలూరిపేట (చైతన్యరథం): నిరుద్యోగులు, ఉపాధ్యాయులు, మేథావుల గొంతుకగా మారి పట్టభద్ర ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ చట్టసభల్లో ఆయా వర్గాల వాణిని బలంగా వినిపిస్తాడని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. శుక్రవారం ఆయన చిలకలూరిపేట పట్టణంలోని శ్రీ శారదా జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల మరియు జూనియర్ కళాశాల, డీ.ఆర్.ఎన్.ఎస్.సీ.వీ.ఎస్ డిగ్రీ కళాశాల ఉపాధ్యాయులు, లెక్చరర్స్‌ని కలిసి కూటమిపార్టీల తరుపున ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్ర ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆలపాటిని గెలిపించాలని కోరారు. నిరుద్యోగ యువత జీవితాలు చక్కబెట్టేందుకు, గాడితప్పిన రాష్ట్రాన్ని చక్కదిద్దుతూ కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషిచేస్తోందన్న ప్రత్తిపాటి, త్వరలోనే రాష్ట్రానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయి పరిశ్రమలు రానున్నాయన్నారు. భారీ పెట్టుబడులు, లక్షలాది ఉద్యోగాల కల్పన కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ సరికొత్త ఆలోచనా విధానాలతో ముందుకెళ్తున్నట్టు ఆయన చెప్పారు. ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను కూడా ప్రభుత్వం దశలవారీగా భర్తీ చేస్తుందని పుల్లారావు తెలిపారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ యువత, ఉపాధ్యాయులతో పాటు ప్రజల పక్షాన నిలిచి, అన్నివేళలా వారికి అండగా నిలుస్తాడని పుల్లారావు చెప్పారు. ఆలపాటిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు సహాయసహకారాలు అందించాలని మాజీమంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో జనసేనా ఇంచార్జి తోట రాజా రమేష్, బీజేపీ నాయకులు జయారామి రెడ్డి, టీడీపీ నాయకులు షేక్ టీడీపీ కరిముల్లా, తేళ్ల సుబ్బారావు, నెల్లూరి సదా శివరావు, మద్దుమల రవి, నరసింహారావు మాస్టర్, బేరింగ్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

## వంశీ అరెస్ట్ సక్రమమే : నెట్టెం రఘురామ్

నేర సామ్రాజ్యాన్ని నిర్మాణం చేసిన వంశీ... దాదాపు



జగ్గయ్యపేట (చైతన్యరథం): ఎప్పుడా అని ఎదురుచూస్తున్న ఒక మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ వల్లభనేని వంశీ అరెస్టు సక్రమమేనని ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం వ్యాఖ్యానించారు. శుక్రవారం జగ్గయ్యపేటలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గన్నవరంలో ఒక వ్యవస్థీకృతమైన నేర సామ్రాజ్యాన్ని నిర్మాణం చేసిన వంశీ... దాదాపు నియోజకవర్గంలోని అన్ని మండలాలు, మారుమూల గ్రామాల్లో సైతం దాదాపు రూ.100 నుంచి రూ.200 కోట్లు దోచుకున్నారని అన్నారు. గ్రావెల్‌ని, మట్టిని, రాళ్లను కొల్లగొట్టి ఒకనేర సామ్రాజ్యాన్ని విస్తృతపర్చాడు, ఎక్కడికక్కడ తనకి బాగుందని, అనుకున్న స్థలాల్ని బెదిరించి కైవసం చేసుకున్న కేసులు అనేకం అతనిపై ఉన్నాయి, ఇలాంటి క్రిమినల్ అరెస్టు అయితే వైసీపీ వాళ్లు ఇది అక్రమమైన కేసుగా పరిగణించడం బాధాకరమన్నారు. వైసీపీ నాయకులు గత ఐదు సంవత్సరాలుగా ఒక అక్రమ సామ్రాజ్యాన్ని, అప్రజాస్వామిక వ్యవస్థని నిర్మాణం చేసిన మీరు, ఏది అక్రమం, అసలు అక్రమం, సక్రమం అంటే అర్థం తెలుసా అని ప్రశ్నించారు. ఎన్ని అక్రమ కేసులను బనాయించారు, ఎన్ని వేలమంది మా వాళ్లని దౌర్జన్యంగా కేసుల్లో ఇరికించి జైలుపాలు చేశారని అన్నారు.

# దుర్మార్గులను వదిలిపెట్టొద్దు

**మంత్రి నారా లోకేశ్ ఆదేశం యాసిడ్ దాడులను సహించేది లేదు, బాధిత మహిళను ఆదుకుంటాం**

**కేవలం 15 నిమిషాల్లోనే నిందితులను అదుపులోకి తీసుకున్నాం : మంత్రి మండిపల్లి**

మదనపల్లి, (చైతన్యరథం): గుర్రంకొండ మండలం, ప్యారంపల్లి గ్రామానికి చెందిన మహిళ గౌతమిపై యాసిడ్ దాడికి పాల్పడిన గణేష్ ను కఠినంగా శిక్షిస్తామని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి యాసిడ్ దాడికి గురైన మహిళలను మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ భాషా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, తంబళ్లపల్లె నియోజకవర్గం టీడీపీ ఇన్చార్జి జయ చంద్రారెడ్డి, శ్రీరామ్ చిన్నబాబులతో కలిసి మంత్రి మదనపల్లి పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో బాధితురాలని, వారి తల్లిదండ్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ గుర్రంకొండ మండలం, ప్యారంపల్లెకు చెందిన గౌతమి అనే మహిళ డిగ్రీ పూర్తి చేసుకొని బ్యూటిషన్ పని చేసుకుంటూ ఉండేదన్నారు. ఈమెపై గణేష్ అనే వ్యక్తి యాసిడ్ దాడికి పాల్పడ్డాడన్నారు. యాసిడ్ దాడికి పాల్పడిన వ్యక్తిని కేవలం 15 నిమిషాల లోనే అదుపులోకి తీసుకుని నిందితుడిని రిమాండ్ కు పంపేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. మహిళలపై యాసిడ్ దాడులకు పాల్పడే వ్యక్తులను సహించేది లేదని అలాంటి వారిని కఠినంగా శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి సంఘటనలు ఎక్కడా పునరావృతం కాకుండా ఉండేందుకు మహిళలు ముందస్తు జాగ్రత్తగా పోలీసులను ఆశ్రయించాలన్నారు. యాసిడ్ దాడికి గురైన మహిళను మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రి నుంచి బెంగళూరుకు తరలించి అక్కడ మెరుగైన వైద్యం





అందించేందుకు ప్రభుత్వం తరఫున అన్ని చర్యలు తీసకుంటోందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యాసిడ్ బాధితురాలు ఆరోగ్యం గురించి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి ఫోన్ చేసి బాధితురాలి వివరాలు అడిగి తెలుసుకున్నారు. యాసిడ్ దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని బాధితురాలు పూర్తిగా కోరుకునేంతవరకు ప్రభుత్వం తరఫున అన్ని సహాయ సహకారాలు తీసుకోవాలని మంత్రి నారా లోకేష్ ఆదేశించారు.

## సీఎం చంద్రబాబు చొరవతో

# బ్యాటరీ బస్సులకు శ్రీకారం

**ప్రక్రియను పరిశీలించిన ఆర్టీసీ ఉపాధ్యక్షుడు మునిరత్నం**

కుప్పం, (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆర్టీసీ బస్సులను బ్యాటరీ బస్సులుగా మార్చేందుకు ప్రణాళికలను సిద్ధం చేశారు. ఇందులో భాగంగా ఆర్టీసీ ఉపాధ్యక్షుడు పీఎస్ మునిరత్నం బెంగుళూరులోని తకనాల్ ఎనర్జీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని సందర్శించి, ఎలక్ట్రిక్ బ్యాటరీ పనిచేసే విధానాన్ని కంపెనీ వారిని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ఆర్టీసీ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చేందుకు ప్రక్రియ మొదలు పెట్టారు. ఈయన వెంట మాజీ ఎంపీపీ డా. వి. వెంకటేష్, ఎఎంసి మాజీ చైర్మన్ సతేంద్ర శేఖర్, మాజీ సర్పంచ్ గోపినాథ్, రామచంద్ర, అశోక్ పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.





# విద్యార్థులకు రవాణా ఛార్జీలిస్తాం

**ఇంటి నుంచి పాఠశాలకు కిలోమీటరు దూరం దాటితే నెలకు రూ.600లు, అవరమైన సౌకర్యాలూ కల్పిస్తాం, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల వెల్లడి**

కలిగిరి, (చైతన్యరథం): ఉదయగిరి నియోజకవర్గంలోని కలిగిరి మండల ఎంఈఓ ఆఫీస్ ప్రాంగణంలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యావ్యవస్థలో చేపట్టిన మార్పుల గురించి జరిగిన సమావేశంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొని, ప్రజల దగ్గర నుండి అర్జీల ద్వారా వచ్చిన సమస్యల పరిష్కారానికి సూచనలివ్వాలని అధికారులను కోరారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడానికి స్థానిక నాయకులు కూడా విద్యార్థుల తల్లిదండ్రులను ఒప్పించి ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను విద్యను అభ్యసించే విధంగా కృషి చేయాలని, విద్యార్థుల సంఖ్య తగ్గడానికి గల కారణాలను అన్వేషించాలని ఆదేశించారు. అదే తరహాలో రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు తమ గ్రామం నుండి పాఠశాల మధ్య దూరం ఒక కిలోమీటర్ దాటితే ఒక్కొక్క విద్యార్థికి రవాణ ఖర్చుల రూపంలో నెలకు 600 రూపాయలను అందించే విధంగా మార్గదర్శకాలను ఏర్పాటు చేశారని, ఇంకా అవసరమైన సదుపాయాలు సమకూరుస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కలిగిరి మండల నాయకులు కార్యకర్తలు ప్రజలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### తహసీల్దార్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ

కలిగిరి తహసిల్దార్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎమ్మార్వో కార్యాలయ సిబ్బంది విధులు, గురించి అడిగి తెలుసుకున్నారు. ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చే అర్జీదారులకు ఒకటి రెండు రోజుల లోపల అవి అందే విధంగా చూడాలని ఆదేశించారు. అర్జీదారుల పట్ల గౌరవంగా మెలగాలని ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని పిలుపునిచ్చారు. ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా వాటి పరిష్కారం మార్గాలు చూపాలన్నారు. నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, పరిష్కారం చేయగలిగినవి వెంటనే చేయాలన్నారు. మిగిలినవి జిల్లా అధికారుల దృష్టిలో ఉంచి, వాటి ప్రక్రియ సరిగా జరిగే విధంగా చూడవలసిన బాధ్యత స్థానిక అధికారులపై ఉందని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను కూడా కాపాడాలన్నారు. కార్యాలయం సిబ్బంది పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, బాధితుల నుండి వివరాలను సేకరించి వాటి పరిష్కారం మార్గం చూపాలని అధికారులను ఆదేశించారు.



# ఆసుపత్రిలో రోగులకు మరిన్ని వసతులు

**పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ వెల్లడి**

పలమనేరు, (చైతన్యరథం): పలమనేరు వంద పడకల ఆసుపత్రిలో రోగుల సౌకర్యార్థం మరిన్ని వసతులు కల్పించాల్సిన అవసరముందని పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. పలమనేరులోని తన కార్యాలయంలో ఆసుపత్రి కమిటీ, సిబ్బందితో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రోగులు వారి సహాయకులకు ప్రస్తుతం ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న సౌకర్యాలపై ఆయన ఆరా తీశారు. ఆసుపత్రిలో మెరుగైన సేవలతో పాటు వసతులను కల్పించాల్సి ఉందని ఇంకా అవసరమైన ఏర్పాట్లపై ఆయన వివరాలు తీసుకున్నారు. ఆక్సిజన్ పైపులైను, లిఫ్ట్ ఏర్పాటు,10 స్ట్రక్చర్లు, బ్యాక్ రెస్ట్ బెడ్లు, రోగుల సహాయకుల కోసం బెంచీల ఏర్పాటు, దోమల బెడద లేకుండా కిటికీలకు మెష్ లు, 34 పరుపులతో పాటు కంప్యూటర్, ప్రింటర్ల అవసరమున్నట్లు ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. ఇక అదే విధంగా ఆసుపత్రి ఆవరణలో తక్కువ ధరకు నాణ్యమైన ఆహారం అందేలా క్యాంటీన్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతమున్న నిధులతో రోగులకు మొదటి ప్రాధాన్యత అవసరాలు ఉన్న వాటిని ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. మిగిలిన సౌకర్యాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పూర్తి చేసుకుందామని దాంతోపాటు స్థానికంగా దాతల సహకారంతోనూ కొన్నింటిని పూర్తి చేసుకుందామని ఆయన తెలియజేశారు.



## ఫలించిన ఎమ్మెల్యే ఉగ్ర కృషి

**నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే లైన్ భూ పరిహారం మజూరు**

కనిగిరి, (చైతన్యరథం): నడికుడి – శ్రీకాళహస్తి రైల్వే లైన్‌కు సంబంధించిన పనులు వేగవంతంగా జరిగేందుకు మార్గం సుగమం అయినట్లు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి వెల్లడించారు. నడికుడి – శ్రీకాళహస్తి రైల్వే లైన్ రైల్వే లైన్ పనులకు 116.44 ఎకరాలకు 12.50 కోట్లు మంజూరు అయ్యాయి. ఈనెల 4వ తేదీన నారా లోకేష్ సీఎస్ విజయానంద్‌ను కలసి పరిహారం మంజూరు గురుంచి వినతిపత్రం అందజేశారు. నడికుడి – శ్రీకాళహస్తి మార్గంలో ప్రతిపాదించిన గార్లపేట స్టేషన్ నుండి కనిగిరి స్టేషన్ పరిధిలోని 2.7 కి.మీ పరిధిలో ఉన్న భూములకు సంబంధించిన పరిహారం శుక్రవారం 12,38,68,265 / – మొత్తం 116.44 ఎకరాలకు సంబంధించిన రైతుల ఖాతాల్లో జమయ్యింది. దీంతో కనిగిరి నుంచి పామూరు వరకు సంబంధిత మార్గంలో రైల్వే పనులు మరింత చురుగ్గా సాగుతాయన్నారు. ఇందుకు సహకరించిన సీఎం చంద్రబాబుకు, మంత్రి లోకేష్‌కు, సీఎస్ విజయానంద్‌కు కృత్ఞతలు తెలిపారు.

# బ్రహ్మోత్సవాలకు దయచేయండి

**అధికారికంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే బొజ్జల**

శ్రీకాళహస్తి, (చైతన్యరథం): శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ బిఆర్ నాయుడు, సినీ హీరో నితిన్‌ను కలిసి శ్రీ కాళహస్తీశ్వర స్వామి వారి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు, గుడిమల్ల బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని అధికారిక ఆహ్వానం అందజేశారు. అలాగే మాజీ కేంద్రమంత్రి మెగాస్టార్ చిరంజీవిని కూడా కలిసి ఉత్సవాలకు సాదరంగా ఆహ్వానించారు.







# కక్ష సాధింపులు కాదు... కుక్క కాట్లకు చెప్పుదెబ్బలు

**పండిన వైసీపీ మూకల పాపం : గూడూరి ఎరిక్సన్ బాబు**

యర్రగొండపాలెం, (చైతన్యరథం): అధికార మదంతో నాడు వైసీపీ నేతలు చేసిన అరాచకాలు అక్రమాలు దౌర్జన్యాలు, పాపాలకు నేడు శిక్ష అనుభవిస్తున్నారని, ఇవి కక్ష సాధింపులు ఎలా అవుతాయని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు ధ్వజమెత్తారు. ఈ మేరకు శుక్రవారం నాడు ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ నాడు వైసీపీ నాయకుల బరితెగింపు రాజకీయాలకు నేడు మూల్యం చెల్లించుకుంటున్నారు. అరాచకాలు చేసి అరెస్టులు చేస్తే మొసలి కన్నీరు కారిస్తే అబద్ధాలు నిజాలైపోవు. వంశీ గన్నవరంటీడీపీ కార్యాలయంపై పట్టపగలు రౌడీ మూకల్ని పంపి దాడి చేయించి మా నేతల వాహనాలు తగులబెట్టింది దేశం మొత్తం చూసింది. కానీ ఇది తాడిపత్రి చంద్రశేఖర్‌కి కనిపించకపోవడం విడ్డూరం. చంద్రశేఖర్‌కి విషయ పరిజ్ఞానం తక్కువ, వితండవాదం ఎక్కువ. మైక్ ముందు ఉంది కదా ఇష్టానుసారం మాట్లాడితే ప్రజలు చూస్తూ ఊరుకోరు. ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ కిడ్నాప్లు, బెదిరింపులకు పాల్పడితే అరెస్టు చేయరా? జగన్ రెడ్డి పాలనలో వ్యవస్థలన్నీ కుప్పకూలాయి. రాష్ట్రంలోని సహజ వనరుల లూటీ చేసి ప్రజలను దోచుకున్నారు. ప్రభుత్వ భూములను,ప్రజల ఆస్తుల్ని సైతం కొట్టేశారు. వైసీపీ హయాంలో పుల్లలచెరువు మండలం సిద్దినపాలెంలో సుబ్బయ్య అనే వైసిపి నాయకుడు ఏకంగా గ్రామాన్ని తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకుని తాకట్టు పెట్టి బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నాడు. దీన్ని ప్రశ్నించిన వారిని గ్రామం నుంచి వెలివేసాడు. ఇలాంటి వ్యక్తిని అరెస్ట్ చేయకుండా సన్మానాలు చేస్తారా ? ఇలాంటి కబ్జా కోరులు, రౌడీ మూకల్ని వెనకేసుకురావడానికి చంద్రశేఖర్‌కి సిగ్గనిపించడం లేదా? తప్పు చేసిన వారిని అరెస్ట్ చేస్తే కులం అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేస్తారా? వైసిపి పాలనా కాలంలో అధికార మదంతో చేసిన ప్రతి అహంకారపూరిత చర్యలకు తప్పక మూల్యం చెల్లించుకుంటారు. తప్పు చేసిన వారెవరు తప్పించుకోలేరని ఎరిక్షన్ బాబు అన్నారు.

# ప్రజల మనోభావాలకు అనుగుణంగా బ్రిడ్జి నిర్మించండి

## హైవే అధికారులను కోరిన కూటమి నేతలు

రాయదుర్గం, (చైతన్యరథం): డి.హీరేహాల్ మండల కేంద్రం పరిధిలో 150ఏ నెంబర్ జాతీయ రహదారిపై ప్రజాభీష్టానికి



అనుగుణంగా బ్రిడ్జి నిర్మించాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ బెంగళూరు ప్రాంతీయ అధికారి బ్రహ్మాకర్‌కు ఎంపీ అంబికా లక్ష్మీ నారాయణతో వినతి పత్రాన్ని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అందజేశారు. బ్రిడ్జి అంచనా రూపకల్పన దిశలో రహదారిపై వాహనాల రద్దీ అంశం పై దృష్టి సారించలేదని వివరించారు. దాంతో ప్రస్తుతం పెరిగిన వాహన రద్దీతో పాటు స్థానికులు, పాఠశాల విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందిగా మారిందని తెలిపారు. బాక్స్ మోడల్‌లో బ్రిడ్జి నిర్మిస్తున్నందున గ్రామాన్ని రెండు భాగాలుగా విభజించినట్లు అవుతోందని వివరించారు. దీని వల్ల గ్రామానికి మంచిది కాదన్న ప్రజల మనోభావాలను గౌరవిస్తూ పిల్లర్ మోడల్‌లో ఫ్లై ఓవర్ నిర్మించే విధంగా సవరణ అంచనాలతో కొత్త ప్రతిపాదనలు సిద్ధంచేసి పంపాలని కోరారు. బ్రిడ్జి కింద వాహనాల రాకపోకలకు వీలుగా అదనంగా మరో రెండు మార్గాలు ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇవ్వడం సంతోషకరమన్నారు.



# బద్వేలును బాగు చేద్దాం

## స్థానిక నేతల ప్రతిపాదనలకు సీఎం చంద్రబాబు సానుకూల స్పందన

బద్వేల్, (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును తెలుగుదేశం పార్టీ బద్వేల్ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ముఖ్యమంత్రిని కలిసి బద్వేల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన కీలక అంశాలపై చర్చించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం పలు ప్రతిపాదనలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్లు వారు పేర్కొన్నారు. రితేష్ రెడ్డి ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చినట్లుగా వారు తెలిపారు.

# ఆదర్శ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య

## అనంతపుర అర్బన్ ఎమ్మెలే దగ్గుపాటి ప్రసాద్ అర్బన్ కార్యాలయంలో ఘనంగా జయంతి వేడుకలు

అనంతపురం, (చైతన్యరథం): విలువలతో కూడిన రాజకీయాలకు, నిజాయితీకి, నిరాడంబతరకు దామోదరం సంజీవయ్య నిలువెత్తు రూపం అని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఆంధ్రరాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రి దివంగత దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను అర్బన్



టీడీపీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఘనంగా నిర్వహించారు. సంజీవయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య జీవిత ప్రస్థానం ఆద్యంతం స్ఫూర్తిదాయకం, ఆదర్శనీయమన్నారు. మంత్రిగా, ఆంధ్ర రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రిగా సేవలు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. నిజాయితీగా ప్రజలకు సేవలందిస్తూ ప్రజాహిత పాలన కోసం అనేక సంస్కరణలు అమలు చేశారని వివరించారు. చిన్న వయసులోనే ముఖ్యమంత్రి పదవిని అలంకరించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. వితంతువులు, వృద్ధులకు పింఛన్ ఇచ్చే విధానాన్ని ప్రవేశపెట్టింది దామోదరం సంజీవయ్యే అని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని అరికట్టడానికి, ప్రజల ఇబ్బందులు తొలగించడానికి ఏసీబీ వ్యవస్థను దేశంలోనే మొట్టమొదటిసారిగా ఏపీలో స్థాపించారన్నారు. ఆయన నేటి తరం రాజకీయ నాయకులకు స్ఫూర్తిగా ఉంటారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

## గడ్డం రాజగోపాల్‌కు ఆరోగ్యమంత్రి నివాళులు

ముదిగుబ్బ,(చైతన్యరథం): ముదిగుబ్బ మండలానికి చెందిన ప్రముఖ సామాజికవేత్త గడ్డం రాజగోపాల్ యాదవ్, ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ విషాద వార్తను తెలుసుకున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, ఆయన స్వగ్రామం మద్దన్నగారిపల్లికి వెళ్లి, గడ్డం రాజగోపాల్ యాదవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన ఆత్మకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా, మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ, వారి కుటుంబ సభ్యులకు అండగా నిలబడి, అవసరమైన ప్రతి సహాయం అందిస్తామన్నారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపి ఓదార్చారు.



# రాష్ట్ర స్థాయిలో విద్యార్థులకు కంటి అద్దాలు

## పంపిణీ చేసిన ఎమ్మెల్యే బండారు శ్రావణి

శింగనమల, (చైతన్యరథం): గార్లదిన్నె మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్ ఆవరణంలో జరిగిన రాష్ట్ర స్థాయిలో విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్, కలెక్టర్ వినోద్ కుమార్ , రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్‌తో కలిసి నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణి పాల్గొని విద్యార్థులకు కంటి అద్దాలు అందజేశారు. అలాగే నియోజకవర్గంలోని ఆసుపత్రుల అవసరాలు ఇతర వైద్య సంబంధిత సౌకర్యాల గురించి మంత్రి సత్యకుమార్‌ను నిధులు కోరగా సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి మాట్లాడుతూ భావిభారత పౌరుల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం ఎంత పెద్ద పీట వేస్తుందో చెప్పేందుకు ఈ కార్యక్రమం నిదర్శనం అని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా 2020 నాటికి అంధత్వం రేటు 0.3 శాతానికి తగ్గిందన్నారు. ఈ మహోన్నత పథకం ద్వారా కంటి సంబంధిత చికిత్సలు మెరుగుపడి, మిలియన్ల మంది ప్రజలు అంధత్వం నుంచి బయటపడ్డార న్నారు. నేత్ర దానంతో పాటు అవయవ మార్పిడి ప్రోత్సాహంతో దాతల సంఖ్య పెరిగిందన్నారు. ప్రతీ ఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలన్నారు. వైసీపీ చేతగాని పాలనలో అంబులెన్సులు అందుబాటులో లేక శవాలను ద్విచక్ర వాహనాలపై తరలించిన ఎన్నో సంఘటనలను చూశామన్నారు. కానీ అలాంటి దుర్ఘటనలకు తావు లేకుండా చంద్రబాబు పటిష్ట చర్యలు చేపట్టారన్నారు. సమర్థవంతంగా అంబులెన్స్ సేవలు అందేలా చూసుకుంటున్నారని తెలిపారు. వైద్య రంగానికి పెద్ద పీట వేస్తూ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ద్వారా పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలను అందిస్తున్నారని తెలిపారు.

# పకడ్బందీగా ఒంటిమిట్ట శ్రీకోదండరామ స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు

## అధికారులతో జేఈవో సమీక్ష

## పండుగ తరహాలో శాఖల వారీగా పనులు

ఒంటిమిట్ట,(చైతన్యరథం): కడప జిల్లా ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాలను పండుగ వాతావరణం తరహాలో ఏర్పాట్లు చేయాలని టిటిడి ఈవో శ్రీ జె. శ్యామల రావు ఆదేశాల మేరకు టిటిడి జేఈవో శ్రీ వి. వీరబ్రహ్మం అధికారులతో తిరుపతిలోని టిటిడి పరిపాలనా భవనంలోని జేఈవో ఛాంబర్ లో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. శ్రీ కోదండరామ స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 5 - 15వ తేదీ వరకు జరుగనున్న నేపథ్యంలో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేయాలని అధికారులకు జేఈవో సూచించారు. ఒంటిమిట్ట శ్రీకోదండరామ స్వామి బ్రహ్మోత్సవాలలో ఏప్రిల్ 11వ తేదీన జరుగనున్న శ్రీ సీతారాముల కల్యాణం రాష్ట్ర పండుగ లాంటిదనే విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేయాలని కోరారు. స్వామివారి ముత్యాల తలంబ్రాలు తయారీ, పంపిణీలో ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. స్వామివారి కల్యాణానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులకు అన్నప్రసాదాల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని, బ్రహ్మోత్సవాలకు డిప్యూటేషన్ మీద నియమించే అధికారులు, ఉద్యోగులతో పాటు శ్రీవారి సేవకులకు వసతి, ఆహారం ఏర్పాట్లపై ముందస్తుగా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. భక్తులకు ఎండ వేడిమి, అనుకోకుండా వర్షం వస్తే ఉపశమనం కలిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎండ వేడిమికి విరివిగా మజ్జిగ, తాగునీరు పంపిణీ చేసేందుకు అవసరమైన కౌంటర్లు సిద్ధం చేసుకోవాలన్నారు. టీటీడీ విజిలెన్స్ అధికారులు స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకుని భద్రత, పార్కింగ్ ఏర్పాట్లకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. కల్యాణ వేదిక వద్ద భక్తులకు ప్రవేశ మార్గాలు, నిష్క్రమణ మార్గాలు, క్యూలైన్ల ఏర్పాటు, పార్కింగ్, ట్రాఫిక్, ఆకట్టుకునేలా పుష్పాలంకరణలు, విద్యుత్ అలంకరణలు, అన్నప్రసాదాలు, ముత్యాల తలంబ్రాలు పంపిణీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా తగిన



చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక పంచాయతీ సిబ్బందిని సమన్వయం చేసుకుని పారిశుధ్యం ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రథమ చికిత్స కేంద్రాలు, అవసరమైన మందులు, అంబులెన్సులు, సిబ్బందిని సిద్ధం చేసుకోవాలని సూచించారు. త్వరలో కడప జిల్లా అధికారులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. బ్రహ్మోత్సవాల వాహన సేవల ముందు హిందూ ధర్మ ప్రచార పరిషత్ భజన బృందాలచే ఆకట్టుకునేలా ప్రదర్శనలు ఉండాలని, అలాగే కల్యాణోత్సవం రోజున చక్కటి కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. బ్రహ్మోత్సవాలను భక్తులు తిలకించేలా ఎస్వీబీసీ హెచ్డీ క్వాలిటీతో నాణ్యమైన ప్రసారాలు చేయాలని, ప్రముఖమైన రోజులలో ప్రత్యక్ష ప్రసారాలు అందించాలన్నారు. భక్తుల నుంచి ఫీడ్ బ్యాక్ సేకరించి సౌకర్యాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. అధికారులు ముందస్తుగా తమ శాఖలలో జరుగుతున్న పనులను సమీక్షించుకుని చెక్ లిస్ట్ ప్రకారం చివరి భక్తుడి వరకు సౌకర్యాలు అందేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. ప్రముఖులకు ఆహ్వాన పత్రికలు, కల్యాణ వేదిక వద్ద ప్రోటోకాల్ ప్రకారం చెక్ లిస్ట్ తయారు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీవో గోవింద రాజన్, అన్నప్రసాద ప్రత్యేక అధికారి జి ఎల్ ఎన్ శాస్త్రి, టౌన్ ప్లానింగ్ నిపుణులు రాముడు పాల్గొనగా వర్చువల్ గా గుణ భూషణ్ రెడ్డి, నటేశ్ బాబు ఇతర అధికారులు హాజరయ్యారు

# నూతన సీఈసీగా జ్ఞానేష్ కుమార్?

## -17న ఎంపిక కమిటీ సమావేశం



ఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం నూతన ప్రధాన కమిషనర్‌గా (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ నియమితులు కానున్నట్లు తెలుస్తోంది. నూతన సీఈసీని ఎన్నుకునేందుకు ఈ నెల 17న ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎంపిక కమిటీ సమావేశం కానున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుత సీఈసీ రాజీవ్ కుమార్ ఈ నెల 18న పదవీ విరమణ చేయనున్నారు. ఎంపిక కమిటీలో ప్రధాని నరేంద్ర మోదీతో పాటు, కేంద్ర న్యాయశాఖమంత్రి అర్జున్ మేఘవాల్, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సభ్యులుగా ఉన్నారు.

జ్ఞానేశ్ కుమార్ కేరళ కేడర్‌కు చెందిన 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన ఇంతకు ముందు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆధ్వర్యంలోని సహకార మంత్రిత్వ శాఖ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖల కార్యదర్శిగా పని చేసి రిటైర్ అయ్యారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఏర్పాటుతో సహా అయోధ్య కేసుపై సుప్రీంకోర్టు తీర్పునకు సంబంధించిన అన్ని విషయాలను చూసేందుకు హోం మంత్రిత్వ శాఖలో ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగానికి నాయకత్వం వహించారు.

సీఈసీ, ఈసీ ఎంపికకు సంబంధించిన కొత్త చట్టానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టడానికి ఒకరోజు ముందు సీఈసీ ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుండటం ప్రాధాన్యత సంతరించుకుంది.

**వరుస ఎన్నికలు..**

కాగా,ఈఏడాది ద్వితీయార్థంలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సిఉండగా,వచ్చే ఏడాది బెంగాల్, తమిళనాడు, అసోం, కేరళ ఎన్నికలు జరగాల్సి ఉన్నాయి. దీంతో కొత్త సీఈసీ ఎంపిక మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. సీఈసీగా 2022 మేలో రాజీవ్‌కుమార్ నియమితులయ్యారు. గత ఏప్రిల్-జూన్‌లో జరిగిన కీలకమైన లోక్‌సభ ఎన్నికలు, దశాబ్దం తరువాత జమ్మూ కశ్మీర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు ఆయన ఆధ్వర్యంలోనే జరిగాయి. 2022లో రాష్ట్రపతి ఎన్నికల నిర్వహణ, కర్ణాటక, తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలను సైతం నిర్వహించారు. చివరిసారిగా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను ఇటీవల నిర్వహించారు. రాజీవ్ కుమార్ తన పదవీకాలంలో ప్రతిపక్షాల నుంచి.. ప్రధానంగా కాంగ్రెస్ నుంచి తీవ్రమైన ఫిర్యాదులు ఎదుర్కొన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల విషయంలో బీజేపీకి అనుకూలంగా వ్యవహరించారని విపక్షాలు ఆరోపించాయి. ఈవీఎంల వినియోగాన్ని నిలదీశాయి. లైవ్ ఓటింగ్ ట్రెండ్స్ పబ్లిష్ చేయడంలో ఈసీ తీవ్రజాప్యం చేసిందంటూ హర్యానా ఎన్నికల సమయంలో కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. ఎలక్షన్ కమిషన్ పూర్తిగా బీజేపీకి లొంగిపోయిందని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు ముందు ఆప్ తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ ఆరోపణలను సీఈసీ స్వయంగా తిప్పికొట్టారు. ఈవీఎంలను ఎవరూ హ్యాక్ చేయలేరని, ఈసీ నిష్పాక్షికతను ఎవరూ వేలెత్తిచూపలేరని అన్నారు. రాజీవ్ కుమార్ ఇటీవల తన రిటైర్మెంట్ ప్లాన్స్ వివరిస్తూ, పదవి విరమణ అనంతరం హిమాలయాలకు వెళ్లి కొన్ని నెలలు అక్కడే ఉంటానని చెప్పారు. ఏకాంతం, స్వీయ అధ్యయనం కోసం తనకు కొంత సమయం కావాలని, ఇందుకోసం దూరంగా వెళ్తానని, అనవసర అంశాల నుంచి పూర్తి విముక్తి పొందుతానని చెప్పారు.

# అమెరికా పర్యటనలో హుందాగా వ్యవహరించారు

## - ప్రధాని మోదీకి కాంగ్రెస్ నేత శశిధరూర్ ప్రశంసలు



ఢిల్లీ: అమెరికా పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీ వ్యవహరించిన తీరుపై కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశిథరూర్ ప్రశంసలు కురిపించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మోదీ చర్చలు భారత్‌కు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. ట్రంప్‌తో జరిగిన అత్యున్నత స్థాయి సమావేశంలో ప్రధాని మోదీ హుందాగా నడుచుకున్నారని కితాబిచ్చారు. దేశం ఎదురు చూస్తున్న అనేక సమస్యలు త్వరలో పరిష్కారం కానున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్‌పై అమెరికా పన్నులు విధిస్తున్నందున.. మనం కూడా తొందరపాటు చర్యలు తీసుకుంటే ఆ ప్రభావం దేశం నుంచి ఎగుమతయ్యే ఉత్పత్తులపై పడే అవకాశం ఉందన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా అక్రమ వలసదారుల అంశంపై మోదీ మాట్లాడుతూ చట్టవిరుద్ధంగా అగ్రరాజ్యంలో నివసిస్తున్న భారతీయులను స్వదేశానికి తీసుకొస్తామని ప్రకటించారు. ఒక దేశంలోకి చట్టవిరుద్ధంగా ప్రవేశించిన వారికి అక్కడ నివసించే హక్కు ఉండదని, ఈ విధానం ప్రపంచమంతటికీ వర్తిస్తుందని పేర్కొన్నారు. మోదీ వ్యాఖ్యలను శశిథరూర్ సమర్థిస్తూ కొందరు యువత తప్పుడు దారిలో అక్రమంగా విదేశాలకు వెళ్తున్నారని అన్నారు. అలా వెళ్లిన భారత పౌరులను తిరిగి తీసుకురావాలని కోరారు. భవిష్యత్తులో ఇటువంటి అక్రమ వలసలను నివారించడానికి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ట్రంప్ ఎఫ్-35 యుద్ధ విమానాలను ఆఫర్ చేయడాన్ని భారత్‌కు శుభ పరిణామంగా పేర్కొన్నారు. ఫిబ్రవరి 12న అమెరికా పర్యటనకు వెళ్లిన ప్రధాని నరేంద్ర మోదీ ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, పలువురు కీలక వ్యక్తులతో వరుస భేటీలు నిర్వహించారు. భద్రత, వాణిజ్యం, భారత్-అమెరికా సంబంధాల్లో రక్షణ, సాంకేతికత సహా పలు అంశాలపై విస్తృతంగా చర్చలు జరిపారు. డిపార్ట్మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (డోజ్) అధినేత ఎలాన్ మస్క్, అమెరికా జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) మైఖేల్ వాల్ట్జ్ తో కూడా మోదీతో సమావేశమయ్యారు. ఈ కీలక భేటీల అనంతరం శుక్రవారం భారత్‌కు తిరుగు ప్రయాణమయ్యారు.

# సుప్రీంకోర్టును ఆశ్రయించిన అల్లాబాదియా

న్యూఢిల్లీ: వివిధ రాష్ట్రాల్లో తనపై ఎఫ్ఐఆర్‌లు నమోదు కావడంతో యూట్యూబర్ రణవీర్ అల్లాబాదియా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 'ఇండియాస్ గాట్ లాటెంట్ వేదికగా యూట్యూబర్ రణవీర్ అల్లాబాదియా చేసిన వ్యాఖ్యలు అంతటా తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈక్రమంలోనే ఆయనపై వేర్వేరు రాష్ట్రాల్లో ఎఫ్ఐఆర్లు నమోదయ్యాయి. దీంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించి తనపై నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లను ఒకేచోట చేర్చి విచారించాలని కోరారు. గౌహతి పోలీసులు అరెస్టు చేస్తారనే భయంతో ముందస్తు బెయిల్‌కు కూడా అభ్యర్థించారు. ముందస్తు విచారణ జరిపాలని కోరారు. అయితే ఆయన అభ్యర్థనను జస్టిస్ సంజీవ్ ఖన్నాతో కూడిన ధర్మాసనం నిరాకరించింది. ఇప్పటికే కేటాయించిన తేదీని మార్చబోమని, ఆ రోజునే విచారణ జరుపుతామని స్పష్టం చేసింది.



యూట్యూబ్ షో 'ఇండియా గాట్ లాటెంట్'లో జడ్జీగా హాజరైన అల్లాబాదియా అనుచిత వ్యాఖ్యలతో చిక్కుల్లో పడ్డారు. ఈ షోకు హాజరైన ఓ వ్యక్తిని తల్లిదండ్రుల శృంగారం గురించి ప్రశ్నించడం ఒక్కసారిగా వివాదమైంది. దీనిపై మహారాష్ట్ర పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయగా, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ఘాటుగా స్పందించారు. తాను ఆ షో చూడనప్పటికీ తనకు సమాచారం అందిందని, షోలో చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అనుచితమని సీఎం అన్నారు. ప్రతి వ్యక్తికి స్వేచ్ఛ ఉంటుందని, అయితే ఇతరుల స్వేచ్ఛను హరించేలా అంది ఉండకూడదని అన్నారు. పరిమితులు దాటితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోలీసుల ఎఫ్ఐఆర్, సీఎం హెచ్చరికలతో అల్లాబాదియా వెంటనే క్షమాపణలు చెప్పారు. తన వ్యాఖ్యలు అనుచితంగా ఉన్నాయని ఒప్పుకున్నారు. అందులో అందులో ఎలాంటి హాస్యం లేదని, తాను చేసిన వ్యాఖ్యలను సమర్థించుకోవడం లేదని అన్నారు. తాను మరింత మెరుగ్గా పనిచేయాల్సిన అవసరాన్ని ఈ అనుభవం నేర్పిందని చెప్పారు. తనను క్షమించాలని వేడుకున్నారు.

ఇండియా గాట్ లాటెంట్ షోకు సమయ్ రైనా హోస్ట్ కాగా.. గెస్ట్ జడ్జీలుగా రణవీర్, అపూర్వ, జస్ప్రీత్ సింగ్, ఆశిశ్ చాంచానీ పాల్గొన్నారు.

# సీబీఐ ఆఫీసుకే కన్నం

## - మొత్తం దోచేసిన దొంగలు

అగర్తల: నేరాలకు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారి ఆటకట్టించే సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) అధికారులనే దొంగలు షాక్ తినిపించారు దొంగలు. వారి కార్యాలయంలోనే చోరీకి పాల్పడి అంతా ఊడ్చేశారు. కప్‌బోర్డులు, కిటికీలు.. ఇలా వేటినీ వదలి పెట్టలేదు. త్రిపురలో అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే శ్యామలీ బజార్ క్వార్టర్ కాంప్లెక్స్‌లో ఈ చోరీ జరిగింది. కుర్చీలు, డోర్లు, కిటికీలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, స్టీల్ సామగ్రి ఇలా అన్నీ దోచేశారు. గోడలు తప్ప ఏమీ మిగల్చలేదు. ఐదు నెలలుగా ఆ కార్యాలయం మూసి ఉంది. ఇటీవల అధికారులు ఆ బ్రాంచ్‌కు వెళ్లడంతో ఈ విషయం వెలుగు చూసింది. దీనిపై సీబీఐ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. త్రిపుర రాజధాని అగర్తల సమీపంలో ఆరుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. కొంత సామగ్రిని తిరిగి స్వాధీనం చేసుకున్నారు. మిగతా వస్తువులను గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. చోరీ వెనక వేరే ఏదైనా కారణం ఉందా అని ఆరా తీస్తున్నారు.

### మమతా కులకర్ణి

# రాజీనామా తిరస్కరణ

## - కిన్నార్ అఖాడా మహామండలేశ్వర్ కొనసాగనున్న నటి



మహాకుంభ్ నగర్: కిన్నార్ అఖాడా మహామండలేశ్వర్ హోదాకు బాలీవుడ్ నటి మమత కులకర్ణి ఇటీవల చేసిన రాజీనామా తిరస్కరణకు గురైంది. దీంతో ఆమె ఆ హోదాలోనే కొనసాగనున్నారు. ఈ విషయాన్ని ఆమె ఓ వీడియో ద్వారా వెల్లడించారు. మమతా కులకర్ణి గత జనవరి 24న ప్రాపంచిక జీవనాన్ని పరిత్యజించి, సన్యాసినిగా మారిన విషయం తెలిసిందే. ప్రయాగ్ రాజ్ కుంభమేళాలోని కిన్నార్ అఖాడాలో 'మాయీ మమతానంద్ గిరి'గా ఆమెకు నామకరణం చేశారు. అఖాడాలో కులకర్ణి చేరిక తర్వాత అందులోని సభ్యుల మధ్య వివాదాలు చెలరేగాయి. ఇందులో చేరిన మొదట్లోనే ఆమె అత్యున్నత స్థానమైన మహామండలేశ్వర్ హోదాను పొందడాన్ని పలువురు వ్యతిరేకించారు. దీంతో ఆమెపై బహిష్కరణ వేటు పడటం.. మహామండలేశ్వర్ ఆమె తీసుకున్న దీక్షను రద్దు చేసినట్లు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో రాజీనామా చేస్తున్నట్లు ఈ నెల 10న ఆమె ఓ వీడియో ద్వారా ప్రకటించారు. ఇకపై సాధ్వీగా కొనసాగుతానని తెలిపారు. ఈ పరిణామాల నేపథ్యంలో తాజాగా మమతా కులకర్ణి మరో వీడియో విడుదల చేశారు. మహామండలేశ్వర్ హోదాకు నా రాజీనామా ఆమోదం పొందలేదు.

ఆచార్య లక్ష్మీనారాయణ్ త్రిపాఠీ నన్ను ఆ హోదాలో ఉంచినందుకు నేను కృతజ్ఞురాలిని.. అని పేర్కొన్నారు. మరోవైపు, ఆమె ఆ హోదాలోనే కొనసాగుతారని అఖాడాకు చెందిన ఆచార్య మహామండలేశ్వర్ లక్ష్మీనారాయణ్ త్రిపాఠీ పీటీఐకి తెలిపారు. 90వ దశకంలో బాలీవుడ్‌లో మంచి క్రేజ్ సంపాదించుకున్న నటి మమతా కులకర్ణి 2003 తర్వాత సినిమాల నుంచి వైదొలిగి విదేశాలకు వెళ్లిపోయారు. ఈ క్రమంలోనే డ్రగ్స్ రాకెట్లో ఆమె పేరు వినిపించింది. పోలీసులు నోటీసులు సైతం పంపారు. ఇన్నేళ్ల తర్వాత కుంభమేళా సందర్భంగా భారత్‌కు వచ్చిన ఆమె అందరినీ ఆశ్చర్యపరుస్తూ అఖాడాలో చేరడం, ఆమె నియామకంపై చెలరేగిన వివాదంతో ఈ వ్యవహారం చర్చనీయాంశమైంది.

# విలియమ్స్ వచ్చేస్తోంది..



అనుకోని పరిస్థితుల్లో అంతరిక్ష కేంద్రంలో చిక్కుకుపోయిన భారత సంతతికి చెందిన నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్ త్వరలో భూమిపైకి చేరనున్నారు. ఆమెతోపాటు అక్కడే ఉన్న బుచ్ విల్మోర్ కూడా కిందకి రానున్నారు. ఈమేరకు వీరిద్దరు స్పేస్ నుంచి సీఎన్ఎన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. వారికోసం మార్చి 12న స్పేస్ఎక్స్‌కు చెందిన క్రూ-10 అంతరిక్ష నౌకను పంపనున్నారు. నౌకలో కొత్తగా ఐఎస్ఎస్‌లోకి రానున్న వ్యోమగాములు వీరి బాధ్యతలు తీసుకోనున్నారు. తర్వాత మార్చి 19న ఆ నౌకలో తిరిగి భూమిమీదకు తాము బయల్దేరనున్నామని విల్మోర్ తెలిపారు. 8 రోజుల మిషన్లో భాగంగా సునీత, విల్మోర్ గత ఏడాది జూన్ 6న బోయింగ్ స్టార్‌లైనర్ క్యాప్సుల్లో అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన సంగతి తెలిసిందే. వాస్తవానికి జూన్ 14న వీరిద్దరూ భూమికి తిరుగుపయనం కావాల్సిఉండగా.. వ్యోమనౌకలో హీలియం లీకేజీ కారణంగా సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. దాంతో వారు ఎనిమిది నెలలుగా అంతరిక్ష కేంద్రంలోనే చిక్కుకుపోయారు.

# అక్రమ వలసదారులను వెనక్కి తీసుకొస్తాం

## అమెరికాలో మోదీ కీలక వ్యాఖ్యలు



అమెరికా పర్యటనలోవున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో కీలక చర్చలు జరిపారు. అనంతరం వీరిద్దరూ కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా అక్రమ వలసదారుల అంశంపై ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. చట్టవిరుద్ధంగా అగ్రరాజ్యంలో నివసిస్తున్న భారతీయులను స్వదేశానికి తీసుకొస్తామని ప్రకటించారు. ఒక దేశంలోకి చట్టవిరుద్ధంగా ప్రవేశించిన వారికి అక్కడ నివసించే హక్కు ఉండదని, ఈ విధానం ప్రపంచమంతటికీ వర్తిస్తుందని పేర్కొన్నారు. అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న 104మంది భారతీయులను ఇటీవల అగ్రరాజ్యం తిప్పి పంపిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో వాళ్ల చేతులకు సంకెళ్లు, కాళ్లకు గొలుసులు వేయడం వివాదాస్పదమైంది. ఈ పరిణామాల వేళ ట్రంప్‌తో భేటీ అయిన మోదీ వలసదారుల అంశంపైనా చర్చించారు. "యువత, పేదరికంలో ఉన్నవారు మోసపూరితంగా వలసదారులుగా మారుతున్నారు. డబ్బు, ఉద్యోగాల ఆశజూపి కొంతమంది వీరిని మోసం చేస్తున్నారు. అలా వారు అక్రమ వలసదారులుగా మారుతున్నారు. వారికి తెలియకుండానే మానవ అక్రమరవాణా కూపంలోకి వెళ్తున్నారు. ఈ దారుణాలను సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఉంది. ఈ ప్రయత్నాల్లో భారత్‌కు ట్రంప్ పూర్తి సహకారం అందిస్తారని ఆశిస్తున్నాం" అని మోదీ అన్నారు.

**మిమ్మల్ని చాలా మిస్సయ్యా: మోదీతో ట్రంప్**

డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత మోదీ ఆయనతో భేటీ కావడం ఇదే తొలిసారి. వాషింగ్టన్‌లోని వెస్ట్ వింగ్ లాబీకి చేరుకున్న భారత ప్రధానికి ట్రంప్ ఆత్మీయ స్వాగతం పలికారు. ఇరు దేశాధినేతలు ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఈసందర్భంగా "మిమ్మల్ని చాలా మిస్సయ్యా" అంటూ ట్రంప్‌తో మోదీ వ్యాఖ్యానించారు. 'నాక్కూడా మిమ్మల్ని చూడటం ఆనందంగా ఉంది' అని అమెరికా అధ్యక్షుడు బదులిచ్చారు. అమెరికా పర్యటనలో భాగంగా స్పేస్ఎక్స్ సీఈవో, అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (డోజ్) అధినేత ఎలాన్ మస్క్‌తోనూ ప్రధాని మోదీ భేటీ అయ్యారు. అంతరిక్షం, సాంకేతికత, నవకల్పనలు సహా పలు అంశాలపై వీరిద్దరూ చర్చించారు.

## చెర్నోబిల్ అణుప్లాంట్‌పై

# రష్యా దాడి: ఉక్రెయిన్



ఒకప్పుడు అణు సంక్షోభానికి కారణమైన చెర్నోబిల్ న్యూక్లియర్ ప్లాంట్‌పై రష్యా డ్రోన్‌తో దాడి చేసినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈమేరకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ ఎక్స్‌లో పోస్టు చేశారు. కాకపోతే అక్కడ రేడియేషన్ స్థాయిలో పెద్దగా మార్పులేదని స్టేట్ ఎమర్జెన్సీ సర్వీస్ పేర్కొన్నట్లు వెల్లడించారు. "చెర్నోబిల్‌లో దెబ్బతిన్న నాలుగో రియాక్టర్ నుంచి వెలువడే రేడియేషన్ వ్యాపించకుండా ప్రపంచాన్ని కాపాడుతున్న షెల్టర్‌పై డ్రోన్‌తో రష్యా దాడిచేసింది. ఘటనలో కాంక్రీట్ షెల్టర్ కొద్దిగా దెబ్బతింది. మంటలను ఆర్పేశారు. రేడియేషన్ స్థాయి పెరగలేదు.అక్కడి పరిస్థితిని నిరంతరం గమనిస్తున్నాం.అంచనాల ప్రకారం ఆ షెల్టర్ చెప్పుకోదగ్గ స్థాయిలోనే దెబ్బతింది"అని ఆ పోస్టులో జెలెన్ స్కీ వెల్లడించారు. పుతిన్‌చర్చలకు సిద్ధంగాలేడనడానికి ఈ దాడులే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. మరోవైపు అంతర్జాతీయ అణుశక్తి సంస్థ కూడా ఎక్స్ వేదికగా స్పందించి ది. నాలుగో రియాక్టర్‌పై ఉన్న న్యూసేఫ్ కన్ఫైన్‌మెంట్‌పై పేలుడు చోటు చేసుకున్నట్టు వెల్లడించింది. ఉక్రెయిన్లో ని బెలారస్ సరిహద్దుల్లో ఈ రియాక్టర్ ఉంది. దీనిలో 1986లో భారీ పేలుడు జరిగింది. ఇక్కడి రేడియేషన్‌తో కూడిన అణుమేఘాలు సోవియట్ యూనియన్, ఐరోపాలోని పలు ప్రాంతాల్లో వ్యాపించాయి. ఆ తర్వాత ఎంతో శ్రమించి స్టీల్,కాంక్రీట్‌తో దీనిని మూసివేశారు. ఉక్రెయిన్ సంక్షోభంపై జర్మనీలో మ్యూనిచ్ సెక్యూరిటీ కాన్ఫరెన్స్ మొదలు కావడానికి కొన్నిగంటల ముందు దాడిచోటు చేసుకోవడం గమనార్హం.ఈ సదస్సులో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్,ఉక్రె యిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ భేటీ కానున్నారు.

# భారత్‌కు ఎఫ్-35 యుద్ధ విమానాలు

## మోదీతో భేటీ అనంతరం ట్రంప్ ప్రకటన



సరిహద్దుల్లో చైనాతో ముప్పు పొంచి ఉన్న వేళ..భారత రక్షణరంగాన్ని మరింత బలోపేతం చేసేలా కీలక ప్రకటన వెలువడింది. న్యూఢిల్లీకి అధునాతన ఎఫ్-35 యుద్ధ విమానాలను విక్రయించేందుకు అమెరికా సిద్ధంగా ఉన్నట్టు ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు.అమెరికా పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ.. ఆయనతో భేటీ అయిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఇరుదేశాల మధ్య వాణిజ్య, దౌత్య సంబంధాలు, రక్షణరంగంలో పరస్పర సహకారంవంటి అంశాలపై దేశాధినేతలు చర్చించుకున్నారు. అనంతరం వీరిద్దరూ కలిసి సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొన్నారు. "అమెరికా-భారత్ కోసం అద్భుతమైన వాణిజ్య ఒప్పందాలు చేసుకోబోతున్నాం. సమీప భవిష్యత్తులోనే భారీ ఒప్పందాన్ని ప్రకటిస్తాం.అమెరికాలో ఉత్పత్తి అయ్యే చమురు, గ్యాస్‌ను భారత్ మరింతగా కొనుగోలు చేస్తుంది. ఈ ఏడాది నుంచి భారత్‌కు మిలిటరీ ఉత్పత్తుల విక్రయాలను పెంచుతాం. ఎఫ్-35 స్టెల్త్ ఫైటర్ జెట్లను కూడా విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నాం" అని ట్రంప్ వెల్లడించారు. అనంతరం మోదీ మాట్లాడుతూ.. "ఇరు దేశాల మధ్య పరస్పర ప్రయోజనకరమైన వాణిజ్య ఒప్పందం త్వరలోనే జరుగుతుందని విశ్వసిస్తున్నాం. అమెరికాలో చమురు, గ్యాస్ వాణిజ్యంపైనా దృష్టి పెడతాం. 2030 నాటికి 500 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యమే మా లక్ష్యం" అని తెలిపారు.

**భారత్, తటస్థ వైఖరి కాదు..**

రష్యా- ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా ఉద్రిక్తతలపైనా మోదీ మాట్లాడారు. "యుద్ధం విషయంలో భారత్ తటస్థ వైఖరి కాదు. మేం శాంతివైపు నిలబడతాం. ఇది యుద్ధాల శకం కాదని ఇదివరకే రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు చెప్పా. ఉద్రిక్తతలను ఆపడానికి ట్రంప్ తీసుకుంటున్న చర్యలకు మద్దతిస్తున్నా" అని మోదీ వెల్లడించారు.

**మనం కలిస్తే మెగా: మోదీ**

ట్రంప్ ఎన్నికల ప్రచార సమయంలో 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' అనే నినాదాన్ని విస్తృతంగా జనంలోకి తీసుకెళ్లారు. దీనినుంచి స్ఫూర్తి పొందుతూ తాను కూడా 'మేక్ ఇండియా గ్రేట్ అగైన్' నినాదం ఇస్తున్నట్టు మోదీ ఈసందర్భంగా తెలిపారు. ఈ రెండూ కలిస్తే 'మెగా' భాగస్వామ్యమవుతుందని విశ్వాసం వ్యక్తంచేశారు.

# అది పూర్తిగా ఏకపక్షం!

## భారత్-అమెరికా సంయుక్త ప్రకటనపై పాక్

సీమాంతర ఉగ్రవాదంపై భారత్-అమెరికా సంయుక్త ప్రకటన ఏకపక్షమంటూ దాయాది పాకిస్థాన్ గగ్గోలు మొదలు పెట్టింది. ట్రంప్-మోదీ విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో సీమాంతర ఉగ్రవాదానికి తన భూభాగం వాడుకోకుండా పాక్ చూసుకోవాలని పేర్కొన్నారు. ఈ ప్రకటనతో పొరుగు దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఆ దేశ విదేశాంగ శాఖ స్పందిస్తూ ఇది పూర్తిగా ఏకపక్షంగా ఉందని ఆరోపించింది. ముంబయి దాడుల కుట్రదారు తహవూర్ రాణా అప్పగింతకు ట్రంప్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. "తహవూర్ రాణా అప్పగింతకు నా కార్యవర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రపంచంలో అత్యంత భయంకరమైన వ్యక్తుల్లో అతడు ఒకడు. భారత్‌లో విచారణ ఎదుర్కోవాలి" అని ట్రంప్ పేర్కొన్నారు. ఆ తర్వాత సంయుక్త ప్రకటనలో పాక్ ఉగ్రవాదాన్ని తప్పుపట్టారు. దీనిపై ఇస్లామాబాద్‌లోని పాక్ విదేశాంగశాఖ ప్రతినిధి స్పందించారు. భారత్ ప్రాయోజిత సీమాంతర ఉగ్రవాదాన్ని విస్మరించారంటూ ఆరోపించారు. "ఇది పూర్తిగా ఏకపక్షం. తప్పుదోవ పట్టించేది. దౌత్య నిబంధనలకు పూర్తిగా విరుద్ధం. పాక్ త్యాగాలను లెక్కలోకి తీసుకోకుండానే దీనిలో చేర్చారు. ఇలాంటివి భారత ప్రాయోజిత సీమాంతర ఉగ్రవాదాన్ని ఏమాత్రం కప్పిపెట్టలేవు" అని పాక్ ప్రతినిధి ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమయంలో రక్షణపరంగా భారత్‌కు టెక్నాలజీ, ఆయుధాల సరఫరాపై కూడా ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలు ప్రాంతీయ సమతుల్యతను దెబ్బతీస్తాయని పేర్కొన్నారు. భారత్‌కు ఎఫ్-35 విమానాలు సహా పలు ఆయుధాలు విక్రయించేందుకు ఆసక్తిగా ఉన్నట్లు నేడు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

# ఆ స్నేహమే నన్ను మార్చింది: బిల్‌గేట్స్

చిన్నప్పుడు తాను అల్లరి పనులు చేశానని మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ అన్నారు. 'సోర్స్ కోడ్ మై బిగినింగ్స్' పేరిట తాను తీసుకొచ్చిన పుస్తక ప్రచారంలో భాగంగా ఇన్‌స్టాగ్రాం వేదికగా నెటిజన్లతో ముచ్చటించారు. తన బుక్ గురించి అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ తన చిన్ననాటి విషయాలను పంచుకున్నారు. "చాలాకాలం పాటు బడిలో అల్లరి చేసేవాడిని.

తుంటరి పనులతో నా స్నేహితులను నవ్వించేవాడిని. కానీ రెండు అనుభవాల ద్వారా నాలో మార్పు మొదలైంది. తరగతిలో తక్కువ మార్కులు వచ్చిన వారితో కలిసి మొదట్లో ప్రాజెక్టులు చేశా. వాళ్లు కూడా నన్ను తెలివి తక్కువ వాడిలా చూశారు. తర్వాత బాగా మార్కులు సాధిస్తూ ఉండే కెంట్ ఎవాన్స్‌తో స్నేహం చేశా. అతడు పెద్ద కలలు కనేవాడు. నేను కూడా అలాగే ఉండాలని కోరుకున్నాడు" అని వెల్లడించారు. ఈ రెండూ తనపై ప్రభావం చూపాయని తెలిపారు.

అలాగే మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు, స్నేహితుడు అయిన పాల్ అలెన్‌ను గుర్తుచేసుకున్నారు. "నాకంటే పాల్ కొంచెం పెద్దోడు. కూల్‌గా ఆలోచిస్తాడు. హైస్కూల్లో టెలిటైప్ మెషిన్ వచ్చిన తర్వాత మేం కంప్యూటర్ ల్యాబ్‌కు వెళ్లాం. 'నిన్ను నువ్వు చాలా స్మార్ట్ అనుకుంటావ్ కదా.. ఇదేంటో గుర్తించు' అని నాకు సవాల్ విసిరాడు. అదే అతడు నాతో మాట్లాడిన మొదటి మాట" అని తెలిపారు.

ఇదిలాఉంటే.. 'సోర్స్ కోడ్ బుక్‌లో తన చిన్ననాటి జీవితంలోని కీలక అంశాలను గేట్స్ ప్రస్తావించారు. ఆయన చిన్నతనంలో ఆటిజంతో బాధపడేవారు. దానికి ఎలాంటి వైద్యం అందించాలో ఆయన తల్లిదండ్రులకు తెలియదు. వివిధ ఆస్పత్రుల చుట్టూ తిరగడం, తనని మామూలు బాలుడిగా చేసేందుకు తన అమ్మానాన్నలు పడిన కష్టాన్ని ఈ పుస్తకంలో గేట్స్ వివరించారు. తాను యువకుడిగా ఉన్నప్పుడు చాలా ప్రయోగాలు చేశానని, అమ్మాయిల్ని ఆకట్టుకునేందుకు నిషేధిత ఎల్ఎస్‌డీ డ్రగ్ కూడా రుచి చూశానని చెప్పారు. తన స్నేహితుడు ఓ రోడ్డు ప్రమాదంలో చనిపోవడం తనను ఎంతగానో కలచివేసిందని అందులో పేర్కొన్నారు.

'సోర్స్ కోడ్‌ను మూడు భాగాలుగా తీసుకొస్తున్నారు. వాల్యూమ్-1లో తన చిన్ననాటి సంగతులు, డ్రగ్స్ ప్రయోగం లాంటి వివరాలను మాత్రమే గేట్స్ ఇందులో ప్రస్తావించారు. తన ఉద్యోగ జీవితం, మైక్రోసాఫ్ట్ ప్రయాణం, మెలిందా గేట్స్‌తో వివాహం, దాతృత్వ కార్యక్రమాలకు దీనిలో చోటు కల్పించలేదు. భవిష్యత్‌లో విడుదల చేసే పుస్తకాల్లో వాటి గురించి వివరించే అవకాశముంది.

# రెట్టించిన ఆత్మవిశ్వాసంతో..!

## ఛాంపియన్స్ ట్రోఫీకి టీమిండియా - బుమ్రా లేకపోవడమే లోటు

ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు టీమిండియా పూర్తి ఆత్మవిశ్వాసంతో కనిపిస్తోంది. కొద్ది రోజుల క్రితం టీమ్ ఇండియా పరిస్థితి అగమ్య గోచరంగా కనిపించింది. ఓవైపు సొంత గడ్డపై న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాష్ పరాభవం.. మరోవైపు ఆస్ట్రేలియా పర్యటనలోనూ సిరీస్ ఓటమి.. ఇంకోవైపు చేజారిన ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ ఫైనల్ స్థానం. ఇవన్నీ చాలవన్నట్లు భారత క్రికెట్ మూలస్థంభాలుగా భావిస్తున్న రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిల పేలవ ఫామ్ కారణంగా వారి రిటైర్మెంట్ గురించి ఊహాగానాలు.. ఇలా మొత్తంగా భారత క్రికెట్ అభిమానులకు అన్నీ చేదు గుళికలే. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. ఇంగ్లండ్‌తో వన్డే, టీ20 సిరీస్‌ల్లో ఘనవిజయాలు సాధించడమే కాక.. జట్టులో సమస్యలన్నీ పరిష్కరించుకొని రెట్టించిన ఉత్సాహంతో ప్రతిష్టాత్మక ఛాంపియన్స్ ట్రోఫీ కి సిద్ధమైంది భారత జట్టు.



పన్నెండేళ్ల పాటు సొంతగడ్డపై టెస్టుల్లో టీమిండియా తిరుగులేని ఆధిపత్యం చెలాయించింది. 2012-13 సీజన్‌లో ఇంగ్లండ్ చేతిలో టెస్టు సిరీస్ ఓడాక.. భారత్‌కు సొంతగడ్డపై సిరీస్ ఓటమన్నదే లేదు. కానీ గత ఏడాది చివర్లో భారత పర్యటనకు వచ్చిన న్యూజిలాండ్.. టీమ్ ఇండియాను దారుణంగా దెబ్బకొట్టింది. మూడు టెస్టుల్లోనూ భారత్‌ను ఓడించి సిరీస్‌కు క్లీన్ స్వీప్ చేసింది. సొంతగడ్డపై గొప్పగొప్ప జట్లను మట్టికరిపించిన భారత్‌కు న్యూజిలాండ్ చేతిలో ఇలాంటి పరాభవం ఎదురవుతుందని ఎవరూ ఊహించలేదు. ఇదే పెద్ద దెబ్బ అంటే.. తర్వాత ఆస్ట్రేలియాలో సైతం ఓటమి తప్పలేదు. తొలి టెస్టులో ఘనవిజయంతో సిరీస్‌కు ఘనంగా ఆరంభించిన భారత్.. తర్వాత నాలుగు టెస్టుల్లో మూడు ఓడి సిరీస్‌ను చేజార్చుకుంది. వరుసగా ఆస్ట్రేలియాలో రెండు సిరీస్‌లు సాధించిన భారత్.. ఈసారి మాత్రం బోర్డర్-గావస్కర్ ట్రోఫీని ప్రత్యర్థికి అప్పగించక తప్పలేదు. ఈ ఓటమితో ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ ఫైనల్లో చోటు కూడా గల్లంతయింది. వరుసగా రెండుసార్లు ఫైనల్ చేరిన భారత్.. ఈసారి మాత్రం లీగ్ దశలోనే నిష్క్రమించింది. వరుసగా రెండు సిరీస్‌ల్లోనూ రాణించకపోవడంతో కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లిల మీద తీవ్ర విమర్శలు వచ్చాయి. వాళ్లిక రిటైరైతే మేలనే వ్యాఖ్యానాలు వినిపించాయి. ఆస్ట్రేలియా పర్యటనలోనే రోహిత్ రిటైర్మెంట్ గురించి జోరుగా ప్రచారం జరిగింది. కానీ అతను ఒత్తిడికి తలొగ్గలేదు.

### ఫామ్ అందుకున్న సీనియర్లు

టీమ్ ఇండియా మీద అభిమానుల్లో అంచనాలు తగ్గిపోయిన స్థితిలో సొంతగడ్డపై ఇంగ్లండ్ లాంటి బలమైన జట్టుతో టీ20 సిరీస్ మొదలైంది. అందులో సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలోని టీ20 జట్టు అదరగొట్టింది. 4-1తో సిరీస్ సాధించింది. ఈ సిరీస్‌లోనే సీనియర్ ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీ పునరాగమనం చేశాడు. ఫిట్నెస్, ఫామ్ చాటుకున్నాడు. బ్యాటర్లు, బౌలర్లు నిలకడగా రాణించారు. ఇక వన్డే సిరీస్లో రోహిత్ శర్మ నేతృత్వంలోని భారత జట్టు ఇంకా ఉత్తమ ప్రదర్శన చేసింది. జట్టులో స్థానం ప్రశ్నార్థకమైన స్థితిలో శ్రేయస్ అయ్యర్ అదరగొట్టాడు. శుభ్‌మన్ గిల్ మళ్లీ ఫామ్ అందుకున్నాడు. కెప్టెన్ రోహిత్ శర్మ ఏడాదికి పైగా విరామం తర్వాత వన్డేల్లో శతకం సాధించాడు. చివరి వన్డేలో కోహ్లి సైతం అర్ధశతకంతో ఫామ్ అందుకున్నాడు. కేఎల్ రాహుల్ సైతం చివరి వన్డేలో కీలక ఇన్నింగ్స్ ఆడాడు.

ఇక బౌలింగ్‌లో సీనియర్ పేసర్ మహ్మద్ షమీతో పాటు యువ బౌలర్లు అర్షదీప్ సింగ్, హర్షిత్ రాణా ఆకట్టుకున్నారు. స్పిన్నర్లు జడేజా, అక్షర్ పటేల్ నిలకడగా రాణించారు. వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్ సైతం తమకు దక్కిన అవకాశాలను ఉపయోగించుకున్నారు. ప్రధానంగా రోహిత్, కోహ్లి జోరందుకోవడం భారత్‌కు అతిపెద్ద సానుకూలాంశం. ఇంగ్లండ్ లాంటి మేటి జట్టుపై వన్డే సిరీస్‌కు క్లీన్ స్వీప్ చేసి ఛాంపియన్స్ ట్రోఫీలో అడుగుపెట్టడం భారత్ ఆత్మవిశ్వాసాన్ని ఎంతో పెంచుతుందనడంలో సందేహం లేదు.

### అదొక్కటే లోటు

ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్‌కు కనిపిస్తున్న ఏకైక లోటు ప్రధాన పేసర్ ఫాస్ట్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా జట్టులో లేకపోవడంమే. ఆస్ట్రేలియా పర్యటనలో అతనెంత బుమ్రా అద్భుతంగా రాణించాడు. జట్టులోని మిగిలిన ఆటగాళ్లు స్థాయికి తగ్గ ప్రదర్శన చేయకపోయినా.. బుమ్రా మాత్రం అదరగొట్టాడు. చివరి టెస్టులో అతను పూర్తిస్థాయిలో బౌలింగ్ చేసి ఉంటే. సిరీస్ చేజారేదే కాదు. బుమ్రా ధాటికి ఆస్ట్రేలియా మేటి బ్యాటర్లు ఎలా వణికిపోయారో తెలిసిందే. నిరుడు భారత జట్టు టీ20 ప్రపంచకప్ గెలవడంలో బుమ్రా ఎంత కీలకపాత్ర పోషించాడో తెలిసిందే. ముఖ్యంగా ఫైనల్లో ఆశలే లేని స్థితిలో తన అద్భుత బౌలింగ్‌తో మ్యాచ్‌ను బుమ్రా మలుపుతిప్పిన తీరును అభిమానులు మరిచిపోలేరు. అలాంటి బౌలర్ ఛాంపియన్స్ ట్రోఫీలోనూ ఉంటే భారత్ మరింత ఉత్సాహంతో టోర్నీలో బరిలోకి దిగేది. బుమ్రా లేకపోవడం 30 శాతం మేర భారత్ అవకాశాలను తగ్గిస్తుందని వ్యాఖ్యాత రవిశాస్త్రి చెప్పడంలో అతిశయోక్తి లేదు. కానీ బుమ్రా స్థానంలో జట్టులోకి వచ్చిన హర్షిత్ రాణా.. ఇంగ్లండ్‌తో టీ20 మ్యాచ్లో, వన్డేలో అదరగొట్టాడు. మరోవైపు మహ్మద్ షమీ ఫిట్నెస్, ఫామ్‌ను చాటుకున్నాడు. అర్ష్‌దీప్ సైతం జోరుమీదున్నాడు కాబట్టి బుమ్రా లేని లోటు కనిపించదనే భారత జట్టు, అభిమానులు ఆశిస్తున్నారు.

### భారత్‌కి అచ్చొచ్చిన యూఏఈ..

ఛాంపియన్స్ ట్రోఫీకి ఆతిథ్యమిస్తున్నది పాకిస్థానే అయినా.. ఆ దేశానికి భారత జట్టు వెళ్లడం లేదన్న సంగతి తెలిసిందే. ఈ టోర్నీని హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహిస్తున్నారు. టీమ్ ఇండియా తన మ్యాచ్‌లను యూఏఈలోనే ఆడబోతోంది. భారత్‌తో మ్యాచ్ కోసం పాకిస్థాన్ సైతం అక్కడికే రానుంది. టీమ్ ఇండియా ఫైనల్ కు చేరినా.. ప్రత్యర్థి జట్టు అక్కడికి వచ్చి ఆడాల్సిందే. యూఏఈ పిచ్‌లు భారత పిచ్‌లకు దగ్గరగా ఉంటాయి. స్పిన్‌కు బాగా అనుకూలిస్తాయి. ప్రస్తుతం భారత్‌కు ఉన్న స్పిన్ బలం మరే జట్టుకూ లేదంటే అతిశయోక్తి కాదు. రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, వాషింగ్టన్ సుందర్లకు తోడు వరుణ్ చక్రవర్తి కూడా తోడయ్యాడు.

ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో ఆదరగొట్టిన వరుణ్‌ను ఇటీవలే జట్టులోకి చేర్చారు. దీంతో సుందర్ తప్పుకోవాల్సి రావచ్చు. అయినా భారత్ స్పిన్ బలానికి తిరుగు లేనట్లే. భారత ఆటగాళ్లందరికీ యూఏఈ వికెట్లు కొట్టిన పిండే. భారత్ అక్కడే ఉండి ప్రాక్టీస్ చేయడం, తన మ్యాచ్‌లన్నీ అక్కడే ఆడడం వల్ల వాటి మీద పూర్తి అవగాహన ఉంటుంది. ఒకరకంగా భారత్‌కు ఇది సొంతగడ్డ అన్నట్లే. పాక్ సహా మిగతా జట్లు పర్యాటక జట్లు కానున్నాయి. ఈ నేపథ్యంలో భారత్ జోరును ప్రత్యర్థులు అడ్డుకోవడం కష్టమే కావచ్చు. మన జట్టు స్థాయికి తగ్గ ప్రదర్శన చేయాలే కానీ.. మరో ఐసీసీ ట్రోఫీ భారత్ ఖాతాలో చేరడం ఖాయం.

---

### ఛాంపియన్స్ ట్రోఫీ ప్రైజ్‌మనీ

# భారీగా పెంపు

### విజేతకు రూ.20.8 కోట్లు

ఈ సారి ఛాంపియన్స్ ట్రోఫీ ప్రైజ్‌మనీని ఐసీసీ భారీగా పెంచింది. ఆయా జట్లపై కాసుల వర్షం కురవనుంది. పాకిస్థాన్ ఆతిథ్యమిస్తున్న ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ -2025 ఈ నెల 19 నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే ఎనిమిది దేశాలు తమ జట్లను ప్రకటించాయి. టీమిండియా ఆడే మ్యాచులు దుబాయ్ వేదికగానే జరుగుతాయి. తాజాగా చాంపియన్స్ ట్రోఫీ ప్రైజ్‌మనీకి సంబంధించి వివరాలను ఐసీసీ ప్రకటించింది. చివరిసారిగా 2017లో ఛాంపియన్స్ ట్రోపీ పోటీలు జరిగిన సంగతి తెలిసిందే. అప్పటితో పోలిస్తే దాదాపు 53 శాతం ప్రైజ్‌మనీని ఐసీసీ పెంచడం గమనార్హం. దాదాపు రూ.60 కోట్ల ప్రైజ్‌మనీని టీములకు పంచనుంది. టోర్నమెంట్‌లో చివరి స్థానంలో నిలిచిన జట్టుకూ రూ.1.22 కోట్లు దక్కనుంది. ఛాంపియన్స్ ట్రోఫీలో ఒక్కో మ్యాచ్‌కు రూ.29 లక్షలు అదనంగా ఇవ్వనుంది.

#### వివరాలు ఇలా..

**విజేత ప్రైజ్‌మనీ: రూ.20.8 కోట్లు**
**రన్నరప్ ప్రైజ్‌మనీ: రూ.10.4 కోట్లు**




**సెమీ ఫైనలిస్టులు: రూ.5.2 కోట్లు (ఒక్కొక్క జట్టుకు)**
**ఐదో స్థానం, ఆరో స్థానం:రూ.3 కోట్లు**
**ఏడు,ఎనిమిదో స్థానాలు:రూ.1.2 కోట్లు**
**ప్రతి మ్యాచ్కు ప్రైజ్‌మనీ:రూ.29 లక్షలు**

#### గత ట్రోఫీలో ఎవరికెంతంటే?

ఎనిమిదేళ్ల కిందట 2017లో ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ జరిగింది. ఫైనల్లో భారత్‌పై గెలిచిన పాకిస్థాన్ విజేతగా నిలిచింది. ఆ జట్టుకు అప్పుడు రూ.14.18 కోట్లను ప్రైజ్‌మనీగా ఐసీసీ ఇచ్చింది. రన్నరప్ గా నిలిచిన భారత్‌కు రూ.7 కోట్లు దక్కాయి. సెమీస్‌కు చేరిన ఇంగ్లండ్, బంగ్లాదేశ్‌కు ఒక్కొక్క టీముకు రూ.3 కోట్లు, ఐదు-ఆరు స్థానాల్లోని ఆసీస్, దక్షిణాఫ్రికాకు చెరో రూ.58 లక్షలు, ఆఖరి రెండు స్థానాల్లోని శ్రీలంక, న్యూజిలాండ్‌కు రూ.39 లక్షలు అందాయి.

---

# బీసీసీఐ పది నియమాలు..

### ఛాంపియన్స్ ట్రోఫీలోనూ కఠినంగా అమలు!

క్రికెటర్లు, సిబ్బంది విషయంలో అమలు చేస్తున్న కఠిన నిబంధనలను రానున్న ఛాంపియన్స్ ట్రోపీలోనూ పాటించాలని బీసీసీఐ నిర్ణయించింది. ఈ విషయంలో బీసీసీఐ ఇప్పటికే కఠినమైన నిబంధనలు రూపొందించింది. ఆస్ట్రేలియా పర్యటనలో ఘోర పరాభవం ఎదురవడంతో ఆటగాళ్లు, సిబ్బంది విషయంలో పది నియమాలను క్రికెట్ బోర్డు సిద్ధం చేసింది. క్రమశిక్షణతోపాటు జట్టులో సానుకూల వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంది. ఇప్పటికే ఇంగ్లండ్‌తో సిరీసుల్లో కఠినంగా అమలు చేసింది. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ వ్యక్తిగత కార్యదర్శిని జట్టుకు దూరంగా ఉంచింది. టీమ్ ఉన్న హొటల్లో ఉండేందుకు అనుమతి ఇవ్వలేదు. ఇదే విధానం ఛాంపియన్స్ ట్రోఫీ సందర్భంగానూ అమల్లో ఉంటుందని.. క్రికెటర్లు తమ భాగస్వాములను తీసుకెళ్లడంపైనా ఇప్పటికే స్పష్టత ఇచ్చినట్లు క్రికెట్ వర్గాలు తెలిపాయి


గతంలోకోచింగ్ స్టాఫ్‌లోని ఒకరి వ్యక్తిగత కార్యదర్శి (పీఏ) తరచూ జట్టు బస చేసే హొటల్లోనే కనిపించేవాడు. ఇంగ్లండ్‌తో సిరీసుల్లో మాత్రం అతడికి వేరే హొటల్లో వసతి కల్పించారు. ఇంగ్లండ్‌తో ప్రతి మ్యాచ్ సమయంలోనూ ఇలానే జరిగింది. ఆ పీఏ .. ఆస్ట్రేలియా




పర్యటన సమయంలో జాతీయ సెలక్టర్లు ఉన్న కారులో ఉండేవారు. ప్రైవేట్‌గా మాట్లాడుకొనేందుకూ సెలెక్టర్లకు అవకాశం ఉండేది కాదు. అసలు అడిలైడ్ టెస్టు సమయంలో బీసీసీఐ అతిథ్య బాక్స్‌లోకి అతడికి ఎలా అవకాశం ఇచ్చారనే ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. అంతేకాకుండా కేవలం ఆటగాళ్లను మాత్రమే అనుమతించే బ్రేక్‌ఫాస్ట్ ప్రదేశంలోకి కూడా సదరు పీఏ వచ్చేవాడు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న బీసీసీఐ కఠిన చర్యలకు ఉపక్రమించిందని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లినప్పుడు కొందరు క్రికెటర్లు 250 కేజీలకు పైగా లగేజ్ తీసుకెళ్లినట్లు సమాచారం. బీసీసీఐ ఆ బిల్లును చెల్లించాల్సి వచ్చింది. ఇక కొత్త నిబంధనల ప్రకారం 150 కేజీల వరకే ఆటగాళ్లకు పరిమితి విధించింది.

#### కుటుంబానికి అవకాశం లేదు

ఛాంపియన్స్ ట్రోఫీకి కూడా స్టార్ క్రికెటర్లు తమ కుటుంబసభ్యులను తీసుకెళ్లేందుకు బీసీసీఐ. అనుమతించలేదు. టోర్నీ వ్యవధి కేవలం మూడు వారాలే కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అంతకుముందు అమలు చేసిన పది నియమాల్లో నెల రోజుల పర్యటన ఉంటేనే ఒక వారం కుటుంబ సభ్యులతో ఉండేందుకు వీలుండేది. కానీ, ఛాంపియన్స్ ట్రోఫీ ఈ నెల 19న ప్రారంభమై.. మార్చి 8న ముగుస్తుంది. దీంతో ఎవరికీ మినహాయింపు ఇవ్వకూడదని బీసీసీఐ నిర్ణయించినట్లు సమాచారం. దీనిపై ఓ సీనియర్ క్రికెటర్ నుంచి వినతి వచ్చినా.. బీసీసీఐ మాత్రం అనుమతి ఇవ్వలేదని తెలుస్తోంది. సహచర క్రికెటర్లతో కలిసి రూము షేర్ చేసుకోవడం, జట్టు ప్రయాణించే బస్సులోనే అందరూ వెళ్లాలని స్పష్టంగా పేర్కొంది. దీనివల్ల ఆటగాళ్ల మధ్య సంబంధాలు మెరుగ్గా ఉంటాయనేది బీసీసీఐ భావన. అదేవిధంగా వ్యక్తిగత సిబ్బంది విషయంలోనూ ఇలాగే వ్యవహరించనుంది. అయితే, బోర్డు తరఫున ఆటగాళ్ల డైట్ కోసం ప్రత్యేకంగా చెఫ్‌లను కేటాయించాలని ఆలోచిస్తోంది.







## వేరెవర్ యూ గో..

నితిన్, శ్రీలీల ప్రధాన పాత్రల్లో దర్శకుడు వెంకీ కుడుముల తెరకెక్కిస్తున్న చిత్రం 'రాబిన్ హుడ్'. ప్రేమికుల రోజు సందర్భంగా ఈ సినిమాలోని 'వేరెవర్ యూ గో' సాంగ్ లిరికల్ వీడియోను మహేశ్ బాబు సోషల్ మీడియా వేదికగా విడుదల చేసి.. చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. కృష్ణకాంత్ రాసిన పాటని ఆర్మాన్ మాలిక్ ఆలపించారు. జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం అందించారు. ఈ మూవీ మార్చి 28న బాక్సాఫీసు ముందుకు రానుంది.

## తాండవరూపమిలా..!



నందమూరి బాలకృష్ణ హీరోగా నటించిన రీసెంట్ చిత్రం "డాకు మహారాజ్" సెన్సేషనల్ సక్సెస్ అందుకున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా సక్సెస్ తర్వాత బాలయ్య వెంటనే అవైటెడ్ సీక్వెల్ చిత్రం "అఖండ 2 తాండవం" స్టార్ట్ చేసేసారు. తన కంబ్యాక్ దర్శకుడు బోయపాటి శ్రీనుతో చేస్తున్న సినిమా కోసం అభిమానులు, ఆడియెన్స్ ఓ రేంజ్ లో ఎదురు చూస్తుండగా షూటింగ్ కూడా ఫుల్ స్వింగ్‌లో నడుస్తుంది. అయితే ఈ సినిమాలో ప్రస్తుతం బాలయ్య పోషించిన అఘోర లుక్ ఇపుడు బయటకి వచ్చేసింది. కొన్నేళ్ల కితం బాలయ్య ఏ రీతిలో కనిపించారో ఇపుడు కూడా అదే తరహాలో కనిపిస్తున్నారని చెప్పాలి.సినిమా సెట్స్ నుంచే బయటకి వచ్చిన ఈ పిక్ ఇపుడు బాలయ్య అభిమానుల్లో వైరల్‌గామారింది. దీనితో ఈసారి కూడా గట్టి మాస్ ట్రీట్ ఉంటుందని అభిమానులు కోరుకుంటున్నారు. ఇక ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తుండగా మేకర్స్ ఈ ఏడాది సెప్టెంబర్ 28న పాన్ ఇండియా లెవెల్లో రిలీజ్‌కి తీసుకొస్తున్నారు.

## ట్యాగులతో టికెట్లు తెగవు



తన రీసెంట్ మూవీ 'ఛావా' ప్రమోషన్‌లో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో 'నేషనల్ క్రష్' ట్యాగ్ గురించి మాట్లాడారు నటి రష్మిక. కేవలం ట్యాగ్‌లవల్ల మాత్రమే సినిమా టికెట్లు అమ్ముడుపోవన్నారు. వీటికంటే ప్రేక్షకుల ప్రేమాభిమానాలు తనకు ముఖ్యమని తెలిపారు. "ట్యాగ్స్ కెరీరుకు ఉపయోగపడతాయంటే నేను నమ్మను. కొంతమంది అభిమానులు ప్రేమగా ఇలాంటివి ఇస్తుంటారు. ఏది ఏమైనా అవి కేవలం ట్యాగ్స్ మాత్రమే. మనం నటించే చిత్రాలు, ప్రేక్షకుల ప్రేమాభిమానాలే టికెట్ సేల్స్‌పై ప్రభావం చూపిస్తాయి. అనుకోకుండా ఇండస్ట్రీలోకి వచ్చాను. 24 చిత్రాల్లో నటించాను. నాకంటూ ఒక గుర్తింపు తెచ్చుకుని.. నా ప్రయాణాన్ని ఎంజాయ్ చేస్తున్నా" అన్నారు. దక్షిణాదితోపాటు హిందీ చిత్రపరిశ్రమలోనూ రాణించడంపై మాట్లాడుతూ.. "అన్ని ప్రాంతాల ప్రేక్షకుల ఆదరణ సొంతం చేసుకోవడం ఆనందంగా ఉంది. అందుకు అనుగుణంగానే కొన్నిసార్లు నిద్రకు టాటా చెప్పేసి.. వర్క్ లైఫ్‌పై ఫోకస్ చేస్తున్నా" అన్నారు. ఆమె నటించిన 'ఛావా' నేడు ప్రేక్షకుల ముందుకొచ్చింది. శంభాజీ మహారాజ్ సతీమణి పాత్రలో నటించారు. మహారాణి పాత్రలో భాగం కావడంపై ఆనందం వ్యక్తం చేస్తూ దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్‌కు ధన్యవాదాలు చెప్పారు. లక్ష్మణ్ తెరకెక్కించిన 'మిమి' చూసి ఆయనతో సినిమా చేయాలనుకున్నానని తెలిపారు. తాను నటించిన 'గుడ్‌బై' ప్రీమియర్స్‌కు ఆయన్ని ఆహ్వానించానని.. అలా ఆయనతో పరిచయం ఏర్పడిందన్నారు. ఆయన 'ఛావా' కథ చెప్పినప్పుడు షాకయ్యానని.. అలాగే సంతోషానికి లోనయ్యానని తెలిపారు.

## చిత్రమైన కథతో రా రాజా

ఇప్పటి వరకు ఇండియన్ స్క్రీన్ మీద రాని ఓ కొత్త సబ్జెక్ట్, ఎవ్వరూ టచ్ చేయని ప్రయోగంతో వస్తున్న లేటెస్ట్ సినిమానే "రా రాజా". మొహాలు కనిపించకుండా ఓ ట్రైలర్‌ను కట్ చేయడమన్నది ఎలాంటి టెక్నీషియన్‌కు అయినా కష్టమే. అలాంటి ఓ విభిన్న ప్రయోగాన్ని 'రా రాజా' టీం చేసింది. పద్మ సమర్పణలో పద్మిని సినిమాస్ బ్యానర్ మీద బి శివప్రసాద్ దర్శకత్వంలో 'రా రాజా' చిత్రం తెరకెక్కింది. ఈ చిత్రానికి బూర్లే హరిప్రసాద్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా, కిట్టు లైన్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు.



సినిమాకి సంబంధించిన అప్డేట్‌ను వాలెంటైన్స్ డే సందర్భంగా రిలీజ్ చేశారు. ఇక ఈ వాలెంటైన్స్ డే సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్ జనాల్లో మరింత క్యూరియాసిటీని పెంచేసింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను చిత్రయూనిట్ పూర్తి చేసింది. ఈ మూవీ విడుదలకు సిద్ధంగా ఉంది. ఇక త్వరలోనే సినిమా రిలీజ్ డేట్‌ను మేకర్లు అనౌన్స్ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారట.

## నెల వెనక్కెళ్లిన దిల్‌రూబా



యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'దిల్‌రూబా'. ఇప్పటికే షూటింగ్ పనులు ముగించుకుని రిలీజ్‌కు రెడీ అయ్యింది. తొలుత చిత్రాన్ని ప్రేమికుల రోజు కానుకగా ఫిబ్రవరి 14న రిలీజ్ చేస్తామని చిత్ర యూనిట్ ప్రకటించింది.

అయితే, కొన్ని కారణాలవల్ల సినిమా రిలీజ్ వాయిదా పడింది. పోస్టర్స్, టీజర్, ట్రైలర్, సాంగ్స్‌తో ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేసిన ఈ సినిమా రిలీజ్ వాయిదా పడటంతో ప్రేక్షకులు సినిమా కోసం ఆసక్తిగా చూస్తున్నారు. అయితే, తాజాగా ఈ చిత్ర రిలీజ్ డేట్‌ను మార్చి 14న రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అయినట్టు ప్రకటించారు. చిత్రం కొత్త రిలీజ్ డేట్‌ను అధికారికంగా ప్రకటించారు. ఇక సినిమాను పూర్తి రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా విశ్వకరుణ్ తెరకెక్కించారు. సినిమాలో రుక్సర్ ధిల్లాన్ హీరోయిన్‌గా నటించగా సామ్ సిఎస్ సంగీతం సమకూర్చారు.

## డ్యూయెట్‌లో వీరమల్లు



పవన్ కళ్యాణ్ హీరోగా నిధి అగర్వాల్ హీరోయిన్‌గా దర్శకుడు క్రిష్ జాగర్లమూడి అలాగే జ్యోతి కృష్ణ తెరకెక్కిస్తున్న భారీపీరియాటిక్ పాన్ ఇండియా చిత్రమే "హరిహర వీరమల్లు". పవన్ కళ్యాణ్ మొదటిసారి ఒక వారియర్ పాత్రలో నటిస్తున్న చిత్రం కోసం సుమారు ఐదేళ్లనుంచి అభిమానులు ఎదురు చూస్తున్నారు. ఫైనల్‌గా సినిమా రిలీజ్‌కి సిద్ధమవుతుంది. సినిమా నుంచి మేకర్స్ రెండో సాంగ్‌పై సాలిడ్ అప్డేట్ అందించారు. పవన్, నిధిలపై సాగే డ్యూయెట్ సాంగ్‌గా మేకర్స్ వాలెంటైన్స్ డే కానుకగా ఇద్దరి నడుమ బ్యూటిఫుల్ పోస్టర్‌తో అనౌన్స్ చేశారు. ఫిబ్రవరి 24న మధ్యాహ్నం 3 గంటలకి రిలీజ్ చేస్తున్నట్టు కన్ఫర్మ్ చేశారు. ఎంఎం కీరవాణి ఇచ్చిన ట్యూన్ ఎలా ఉంటుందో వేచి చూడాలి. ఇక ఈ చిత్రాన్ని మేకర్స్ మార్చ్ 28న గ్రాండ్‌గా రిలీజ్ చేసేందుకు సిద్ధం చేస్తున్నారు.

## ఓటీటీలోకి మాక్స్

మాస్ ఎంటర్‌టైనర్ ఆఫ్ ది ఇయర్ 'మ్యాక్స్' డిజిటల్ ప్రీమియర్‌ను జీ5 ప్రకటించింది. కన్నడ బాద్‌షా రీసెంట్ బ్లాక్ బస్టర్ 'మ్యాక్స్' మూవీ ఫిబ్రవరి 15న జీ5లో స్ట్రీమింగ్ కానుంది. కొత్త దర్శకుడు విజయ్ కార్తికేయ డైరెక్షన్‌లో వచ్చిన హై ఆక్టేన్, హార్ట్ రేసింగ్ రోలర్‌కోస్టర్ మూవీకి థియేటర్లో మంచి రెస్పాన్స్ వచ్చింది. మాస్ అవతార్‌లో కిచ్చా సుదీప్ కొత్తగా కనిపించారు. కన్నడ బాక్సాఫీస్ వద్ద మ్యాక్స్ రికార్డులు సృష్టించింది. కన్నడతోపాటు తెలుగు, తమిళం, మలయాళంలోనూ మంచి ఆదరణ దక్కించుకుంది. కిచ్చా సుదీప్‌తో పాటుగా ఈ చిత్రంలో వరలక్ష్మి శరత్‌కుమార్, సంయుక్త హొర్నాడ్, సుకృతా వాగ్లే, సునీల్, అనిరుధ్ భట్ వంటి వారి నటించి మెప్పించారు. కలైపులి ఎస్. థాను (వి క్రియేషన్స్), కిచ్చా సుదీప (కిచ్చా క్రియేషన్స్) నిర్మించిన ఈ థ్రిల్లింగ్ చిత్రం ఇప్పటికే 2024లో అత్యధిక వసూళ్లు సాధించిన కన్నడ చిత్రంగా నిలిచింది.

పోలీసు ఇన్‌స్పెక్టర్ అర్జున్ మహాక్షయ్ (కిచ్చా సుదీప్)గా మ్యాక్స్‌లో కిచ్చా సుదీప్ అదరగొట్టారు. పోలీస్ ఆఫీసర్ పవర్, గ్యాంగ్ స్టర్‌లను పరుగులు పెట్టించే నిజాయితీగల పోలీస్ ఆఫీసర్ పాత్రలో కిచ్చా సుదీప్ మెప్పించారు. ఒక్క రాత్రిలో జరిగే ఘటనలను ఎంతో గ్రిప్పింగ్‌గా చూపించి ఆడియెన్స్‌ను ఆకట్టుకున్నారు.

